
Deccan Land




June | JUN 2022

జూన్ - 2022

DECCAN LAND, HYDERABAD


118

₹30

# దక్కన్ ల్యాండ్

సామాజిక రాజకీయ మాసపత్రిక





- ఉన్నదొకే ధరిత్రి - కాపాడుకుందాం!
- నదుల పరిరక్షణ తక్షణ అవసరం
- రాజ్యకాలాన్ని పెంచిన వాడపర్తి శాసనం
- అనునిత్యం అవిటిదైపోతున్న అవని!





12.05.1940 - 17.06.2014

**Late Sri. Joginpally Bhaskar Rao Garu**

***Educationist, Founder & Chairman***

**JB Group of Educational Institutions**




























## అద్భుత కట్టడాల హంపి

భారతదేశంలో ఉన్న చాలా ఆలయాలు చారిత్రక వారసత్వ సంపదకు పుట్టినిల్లుగా తారసపడడం అత్యంత సహజం. అయితే చారిత్రక విశేషాలతో పాటు పౌరాణిక ప్రాశస్త్యాన్ని కూడా కల్గిన మహత్తర ఆలయాలెన్నో మన దేశంలో ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రంలోని హంపి మహత్తర ఆలయమే కాదు, మనం అత్యంత ఆనందోత్సాహాల మధ్య జరుపుకునే వసంతోత్సవానికి (హెూలీ) పునాది వేసిన పుణ్య స్థలమది. హంపి అనగానే అద్భుతమైన కట్టడాలు, దేవాలయాలు స్ఫురణకు వస్తాయి. 13-15వ శతాబ్దంలో విజయనగర సామ్రాజ్య రాజధాని ఇప్పుడు కర్ణాటక రాష్ట్రంలోని బళ్ళారి జిల్లాలోని ఒక చిన్న పట్టణం. విద్యారణ్యస్వామి ఆశీస్సులతో స్థాపించబడిన విజయనగర సామ్రాజ్యానికి విజయనగరం లేదా హంపి రాజధాని. గోపురం నీడ ప్రధాన ఆలయంలోని ఒక చిన్న రంధ్రంలో నుండి క్రింద నుండి పైకి అనగా తలక్రిందులుగా కనపడటం అప్పటి కళా చాతుర్యానికి నిదర్శనం. 1986లో యునెస్కోచే ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొందింది.

TELANGANA RESOURCE CENTRE

"**CHANDRAM**" 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029.
Fax: 040-27635644Mobile: 9030626288
E-mail: desk.deccan@gmail.com website : www.deccanland.com




## నయా ఉస్మానియా

మే నెల ఎడిటోరియల్‌లో ఉస్మానియా యూనివర్సిటీ గురించి చాలా విషయాలు తెలియజేశారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ముందు నిలబడి దాన్ని చూస్తుంటే ప్రతీ ఒక్కరిలోనూ ఎన్నో రకాల అనుభూతులు కలుగుతాయి. కొందరికి అక్కడ తాము చదువుకున్న రోజులు గుర్తుకొస్తే, మరి కొందరికి ఒకనాటి రాచరికం మదిలో మెదులుతుంది. కొందరికి అక్కడ ఉరకలు వేసిన తెలంగాణ ఉద్యమం గురుకొస్తుంది. మరికొందరికి వివిధ అంశాల్లో అక్కడి విద్యార్థుల చైతన్యం యాదికొస్తుంది. 1917లో నాటి ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ ఈ విద్యాసంస్థను నెలకొల్పారు. నాటి నుంచి కూడా ఎవరి ఊహలకూ అందని రీతిలో అది విస్తరిస్తూనే ఉంది. తన ఖ్యాతిని ప్రపంచవ్యాప్తం చేసుకుంటూనే ఉంది. దేశంలోని అత్యంత పురాతన యూనివర్సిటీల్లో ఇది ఏడవది. దక్షిణ భారత దేశంలో మూడో పురాతన యూనివర్సిటీ, స్వాతంత్ర్య పోరాటం మొదలుకొని తెలంగాణ స్వరాష్ట్రం దాకా ఎన్నో ఉద్యమాలకు ఇది పురిటిగడ్డగా నిలిచింది.

**-రెడ్యానాయక్,** ఉస్మానియా విద్యార్థి

❖ ❖ ❖

## చరిత్రకు ప్రత్యక్షసాక్ష్యం చొప్పకట్లపాలెం శాసనం

కాకతీయ ప్రభువు ప్రతాపరుద్రదేవుని పాలనాకాలంలో నిర్మించిన శివాలయాలకు మల్లినాథ లేదా మల్నాథ దేవాలయాలని, తన ముత్తాత కాకతీయ గణపతి దేవుని కాలంలో కట్టించిన శివాలయాలకు రామనాథ దేవాలయాలని పేరున్నది. 'స్వయంభు మల్నాథ మహాలింగ దేవాలయం' అని ఖమ్మం జిల్లా చొప్పకట్లపాలెం గ్రామంలో లభించిన శాసనంలో పేర్కొనబడింది. శ్రీరామోజు హరగోపాల్ బృందం చొప్పకట్లపాలెంలో అన్వేషించి శాసనం వివరాలు చాలా చక్కగా తెలియజేశారు.

**-ఎం. రఘు,** ఖమ్మం

❖ ❖ ❖

## ప్లాస్టిక్ మానవ మనుగడకు ముప్పు

రచయిత డా॥ ఆర్. సీతారామారావు ప్లాస్టిక్‌తో పొంచి ఉన్న ముప్పును చాలా చక్కగా తెలియజేశారు. ప్రతి ఏటా ప్లాస్టిక్ వల్ల పెద్ద జంతువులు కూడా మరణిస్తూ ఉన్నాయి. వేల సంఖ్యలో పక్షులు, తాబేళ్లు, సీల్ చేపలు, వేల్స్ మొదలైనవి చనిపోతూ ఉన్నాయి. ఆయా ప్రాణుల గొంతులు, పేగులు జీర్ణం కాని ప్లాస్టిక్ శిథిలాలతో నిండి ఉంటున్నాయి. ప్లాస్టిక్ మొత్తం మీద అన్ని రకాల ప్రాణుల ఆహారపు గొలుసు మీద ప్రభావం చూపుతున్నది. ప్లాస్టిక్ నేరుగా జీర్ణక్రియ వ్యవస్థను దెబ్బతీయడమే కాకుండా, ప్లాస్టిక్ శకలాలు విష రసాయనాల విడుదల వ్యవస్థకు దోహదపడతాయి. కొన్నేమో వాటి ఉత్పత్తి క్రమంలో విషరసాయనాల విడుదలకు కారణమైతే మరికొన్ని సముద్ర తీరాల్ల కాలుష్య కారకాలుగా తేలియాడుతూ విషతుల్యం చేస్తాయి. ఆచరణవైపు అడుగులు వెయ్యాలి అని రచయిత అభిప్రాయంతో ఏకీభవించి అందరం ప్లాస్టిక్ రహిత సమాజం కోసం పాటు పడుదాం.

**-ఎస్. సుమలత,** హైదరాబాద్

❖ ❖ ❖

## గోడల నగరం జైపూర్

రచయిత సువేగా పింక్ సిటీ జైపూర్ గురించి చాలా చక్కగా వివరించారు. మాకు తెలియని అనేక విషయాలు తెలియజేశారు. జైపూర్ సిటీ చరిత్ర, జైపూర్ వ్యవస్థాపకుడు జైసింగ్-2, భౌగోళిక వాతావరణం, పరిపాలన, రాజకీయాలు, పర్యాటకం, జనాదరణ సంస్కృతి, అక్కడి వంటలు, భాషలు, ఆర్థిక వ్యవస్థ, మౌలిక సదుపాయాలు, హస్త కళలు గురించి చాలా అద్భుతంగా వివరించారు.

**-ఎ. నూతన,** మేడ్చల్

❖ ❖ ❖

## ప్రకృతి వరణం

రచయిత డా॥ లచ్చయ్య సార్ గత కొన్ని మాసాలుగా "ప్రకృతే నియంత్రిస్తుంది! ప్రకృతే శాసిస్తుంది!!" శీర్షికతో ధారావాహికగా అందిస్తున్న వ్యాసాలు చాలా ఉపయోగకరంగా ఉన్నాయి. కాంపిటేషన్ ఎగ్జామ్స్‌కు ప్రిపేర్ అయ్యే నా లాంటి వారికి ఈ వ్యాసాలు ఎంతో ఉపయోగకరంగా ఉపయోగపడతాయి.

**-బి.ఆర్. చందు,** ఆదిలాబాద్

## పరిశోధకులకు శుభవార్త

### దక్కన్ ల్యాండ్‌కు ISSN ఆమోదం

**దక్కన్ ల్యాండ్ మాసపత్రిక** ISSN (International Standard Serial Number) **ఆమోదం పొందినదని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. మా** ISSN **2581-3188. ప్రముఖ, ఔత్సాహిక, పరిశోధకులు తమ పరిశోధనాత్మక, విశ్లేషణాత్మక రచనలను ప్రచురింప జేసి వినియోగించుకోవడం ద్వారా ప్రాచుర్యం చేసుకోవడానికి ఈ సదవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరుతున్నాం.**

**రచయితలు తమ రచనలను పంపవలసిన చిరునామా :**
**"చంద్రం"** 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029 Telangana.
**సంప్రదించవల్సిన ఆఫీస్ ఫోన్ : 9030626288**
E-mail: desk.deccan@gmail.com
website: www.deccanland.com

- ఎడిటర్

ISSN 2581-3188

# దక్కన్ ల్యాండ్

సామాజిక, రాజకీయ మాసపత్రిక

సంపుటి: 10 సంచిక : 10 పేజీలు : 60

జూన్ - 2022

సంపాదకులు
**మణికొండ వేదకుమార్**
9848044713
editordeccan@gmail.com

సహాయ సంపాదకులు
**కట్టా ప్రభాకర్**

సర్క్యులేషన్
**హెచ్. మోహన్‌లాల్**

వాణిజ్య ప్రకటనలు
**సయ్యద్ ఖైజర్ భాష**
9030626288

ఫొటోగ్రాఫర్
**టి.స్వామి**
8374995555

కవర్‌పేజీ
**హంపి**

layout & composing @
CHARITHA IMPRESSIONS

printed @ DECCAN PRESS
ఆజామాబాద్, హైదరాబాద్-500 020.

కార్యాలయ చిరునామా

TELANGANA RESOURCE CENTRE


DECCAN LAND
"CHANDRAM" 3-6-712/2, St.No. 12,
Himayatnagar, Hyderabad - 500 029
TELANGANA
Mobile: 9030626288
Fax: 040-27635644
E-mail: desk.deccan@gmail.com
website : www.deccanland.com

**కృతజ్ఞతలు**

దక్కన్ ల్యాండ్ మాసపత్రికకు
సలహాలు, సూచనలు అందించిన
వివిధ రంగాల నిపుణులకు మా కృతజ్ఞతలు.

విషయసూచిక


# లోపలి పేజీల్లో...



బిద్రీ
దశాబ్దాల కళ



నదుల పరిరక్షణ
తక్షణ అవసరం




కేశనకుర్తి వీరభద్రాచారి ........ కందాళై రాఘవాచార్య ........ 6
'ఓన్లీ ఒన్ ఎర్త్' - మానవాళి చిరునామా..... (ఎడిటోరియల్) ........ ఎం. వేదకుమార్ ........ 7
ఉన్నదొకే ధరిత్రి - కాపాడుకుందాం! ........ డా॥ ఆర్. సీతారామారావు ........ 9
మహారాజా కిషన్ పర్‌షాద్ దేవుడీ ........ పరవస్తు లోకేశ్వర్ ........ 11
ఆ పాదాలు ఇప్పుడక్కడ లేవు!!! ........ ఈమని శివనాగిరెడ్డి ........ 13
ఓన్లీ వన్ ఎర్త్ ........ దక్కన్ న్యూస్ ........ 14
'వ్యర్థ' వివేకంతో నిర్మల నదులు ........ సునీతా నారాయణ్ ........ 15
బ్లాక్ చెయిన్ టెక్నాలజీ..! ........ పుట్టా పెద్దఓబులేసు ........ 17
ఢిల్లీలో ఉన్న మన 'హైదరాబాద్ హౌస్' ........ దక్కన్ న్యూస్ ........ 20
నాలుగు గొప్ప చోళ దేవాలయాలు ........ శివశంకరబాబు ........ 21
నదుల పరిరక్షణ తక్షణ అవసరం ........ వి.ప్రకాశ్ ........ 23
ఆరోగ్యం కోసం యోగా ........ ఎసికె. శ్రీహరి ........ 28
ఆధ్యాత్మిక నిలయం హంపి ........ సువేగా ........ 29
బిద్రీ దశాబ్దాల హస్తకళ ........ సువేగా ........ 35
సాదత్ హసన్ మంటో ఐదవ విచారణ ........ మంగారి రాజేందర్ (జింబో) ........ 37
సాగునీటి ప్రాజెక్టులు - పర్యావరణ పునరుద్ధరణ ........ శ్రీధర్‌రావ్ దేశ్‌పాండే ........ 39
దేశీయ అవసరాలు తీర్చుతున్న ఈసీఐఎల్ ........ ఎం.డి. కరీం ........ 43
జగదేకమల్లుని రాజ్యకాలాన్ని పెంచిన వాడపర్తి శాసనం ...... శ్రీరామోజు హరగోపాల్ ........ 45
చరిత్రకు అరుదైన సాహిత్యాధారం "భద్రగిరిశతకం" ........ కట్టా శ్రీనివాసరావు ........ 48
అనునిత్యం అవిటిదైపోతున్న అవని! ........ డా॥ లచ్చయ్య గాండ్ల ........ 51
అడవిని కాచే ఆడపులి! ........ దక్కన్ న్యూస్ ........ 55
అవాలు... లాభాలు... ........ ఆనబోయిన స్వామి ........ 57
పుస్తక సమీక్ష ........ బాలచెలిమి ........ 58


**'దక్కన్ ల్యాండ్'**లో అచ్చువుతున్న రచనలలో వ్యక్తమవుతున్న అభిప్రాయాలన్నింటితో సంపాదకులకు ఏకీభావం ఉండాల్సిన అవసరం లేదు. 'దక్కన్ ల్యాండ్'ను పర్యావరణ, వారసత్వ సంపద, జీవవైవిధ్య అభిప్రాయ వేదికగా, రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణావేదికగా తీర్చిదిద్దాలన్నదే మా సంకల్పం. అందుకు అనుగుణంగానే అన్ని రకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాలకూ స్థానం కల్పించాలన్నది మా ఉద్దేశం. వివిధ రంగాల్లో నిపుణుల రచనలను అందించడం ద్వారా ఆయా అంశాలపై, పరిష్కార మార్గాలపై పాఠకుల్లో అవగాహన పెంపొందించడమే **'దక్కన్ ల్యాండ్'** లక్ష్యం.

# కేశనకుర్తి వీరభద్రాచారి

కీ. శే. కేశనకుర్తి వీరభద్రాచారి అనగానే నిజామాబాద్‌లో అన్ని కళల కేంద్రబిందువు అని ప్రతి వారూ స్మరించాల్సిందే! ఆరడుగుల మనిషి – నల్లని కోటు టై–పొడుగాటి పాతకాలం హీరోలు గుర్తుకు వచ్చే ప్యాంటు నడిమ పాపిట, పొడుగాటి వెంట్రుకలు. చేతిలో ఐదారు పుస్తకాలు! టకటక బూట్లు చప్పుడు వరండాలో! అదిగో చారి సార్ వస్తున్నారు! కాలేజీ విద్యార్థులంతా ఆంగ్ల పాఠం కోసం ఎదురు చూస్తున్న క్షణానికి శుభ సూచకం ఆయన ఆగమనం. గిరిరాజ కాలేజీలో వృత్తిరీత్యా ఆంగ్లోపన్యాసకుడిగా ఉన్నా – ఆయన ప్రవృత్తి రీత్యా తెలుగునాట ప్రసిద్ధిపొందారు.

ఎక్కడో భీమవరంలో నివసించి ఉద్యోగరీత్య ఇందూరుకు వచ్చి ఈ జిల్లాను సకళ కళామయంగా పూర్ణ చంద్రుడి వెన్నెల వేదికగా తీర్చిదిద్దారు చారి సార్!

ఉషశ్రీ – వీరభద్రాచారిగారు కలిసి రాసిన వేంకటేశ్వర కళ్యాణం అప్పటి కళాశాల విద్యార్థులకు తెలుగు ఉపవాచకమైంది. వేదికపై నాటకమైంది. ఇలాంటి సకళ కళల సమాహారమైన కేశవకుర్తి వీరభద్రాచారిసార్ 14-05-1927 శ్రీకాకుళం జిల్లా 'కొర్ని'లో కేశనకుర్తి అప్పారావు, వరహాలమ్మ దంపతులకు జన్మించారు. మాతో అప్పుడప్పుడు చెప్పేవారు – 12వ యేటనే అనేక నాటికలు రాసి వేసేవాళ్ళమని! అవి రాతప్రతులే ఐనాయిగాని అచ్చు ప్రతులు కాలేదని చింతించేవారు. 1969 సంక్రాంతి 14న నిజామాబాద్‌లో గొప్ప కవుల వేదిక అవతరించింది. ఈ మకర సంక్రాంతి శుభవేళ ఇందూరులో సాహితీ వికాసం! సరికొత్త ఉదయం! దీనికి అంకురార్పణ వేసింది కేశనకుర్తి వీరభద్రాచారిగారే! ఈ సంస్థ పేరే 'ఇందూరు భారతి రచయితల సమాఖ్య'.

*వేదికపై వ్యాఖ్యానం ఎలా చేయాలో, కవిత్వం ఎలా చదవాలో, వేదిక మంగళాచరణ గీతం నుండి వందన సమర్పణ వరకు ఎట్టి మెలుకువలు ఉపయోగించాలో ఇవన్నీ యువతకు నేర్పించి గొప్ప కవులుగా, నటులుగా, గాయకులుగా తీర్చిదిద్దారు వీరభద్రాచారిగారు.*

వీరికి చేదోడు వాదోడుగా సైబ పరంధాములు, అపుకారి సూర్యప్రకాశ్, బద్దూరి మొదలగు యువకిశోరాలు చారిగారిని అనుసరించారు.

ఆయనకు ఆలోచన రావడం మేమందరం అమలుపరచడం జరిగిపోయేవి!

ఇందూరు భారతి ఆవిర్భావం తరువాత అనేకులు కలం పట్టి కవులైనారు – కవయిత్రులైనారు! గొప్పవాళ్లను ఆహ్వానించి వారితో ప్రసంగాలు ఇప్పించి యువకులకు ప్రేరణ అందేలా చారి సార్ ప్రణాళిక రచించేవారు.

దాశరథి కృష్ణమాచార్య, బెజవాడ గోపాలరెడ్డి, దేవులపల్లి రామానుజారావు, జయ్యు, నండూరి రామకృష్ణమాచార్య, నార్ల చిరంజీవి, వానమామలై వరదాచార్యులు, సి.నా.రె. ఇలాంటి పెద్దలను ఆహ్వానించి ఇందూరు భారతిని సుప్రసిద్ధం చేశారు.

కవిత్వమే కాకుండా గానం నాట్యం కోసం "సరస్వతీ గానసభ"ను ప్రారంభించారు. అనేకమంది అమ్మాయిలు ఇంటింటా నాట్యసరస్వతులు, గానకోకిలలూ ఐనారు. సాయంత్రం బాలవిహార్ పిల్లలతో సందడి సందడిగా ఉండేది.

విడివిడిగా అనేక నాటిక సంస్థలు ఎవరికివారే అన్నట్లుగా ఉండేవారు. వీరభద్రాచారి సలహాల మేరకు అన్ని నాటక సంస్థలు ఒకటై 'నగరనట సమాఖ్య'గా ఒక్కటైనారు. ఈ సమాఖ్య నేపథ్యంలో చారి సార్ విశాల హృదయం ప్రగతి ఆలోచనలే కారణం.

ఈ సంస్థ ద్వారా అనేక నాటకాల పోటీలు నిర్వహింపజేసి – గొప్ప నటులను ఆహ్వానించి ఇందూరు పేరు తెలుగు నాట సుప్రసిద్ధం చేశారు.

గానసభ ద్వారా శోభానాయుడు, నరసింహాచారి, వసంత, ఈమని శంకరశాస్త్రి, చిట్టిబాబు పర్విన్ సుల్తానా వంటి సుప్రసిద్ధులను ఆహ్వానించి నిజామాబాద్‌ను రాయల యుగంగా మార్చారు.

సాహితీ కళా సంస్థలలోనే కాకుండా సేవాసంస్థలైన లయసైన్స్, లియో మొదలైన క్లబ్బుల ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహింపజేసేవారు. యువకులందరికి ఆంగ్లం ఎలా మాట్లాడాలో శిక్షణ సైతం ఇచ్చేవారు.


వేదికపై వ్యాఖ్యానం ఎలా చేయాలో, కవిత్వం ఎలా చదవాలో, వేదిక మంగళాచరణ గీతం నుండి వందన సమర్పణ వరకు ఎట్టి మెలుకువలు ఉపయోగించాలో ఇవన్నీ యువతకు నేర్పించి గొప్ప కవులుగా, నటులుగా, గాయకులుగా తీర్చిదిద్దారు.

అప్పటి సాహిత్య అకాడమిలో దాదాపు తన జీవిత కాలము సభ్యుడిగా ఉండి నిజామాబాద్‌కు ఎనలేని సాహిత్య సాంస్కృతిక సేవలనందించారు.

తాను ఎన్నో కవితలు పద్యాలు రాసినా అవి అచ్చుకు నోచుకోలేదని, అలాంటి స్థితి యువతకు ఉండకూడదని ఇందూరు భారతి ద్వారా వెలుగులోకి తెచ్చారు. ప్రతి సంవత్సర సావనీర్లను

(తరువాయి 8వ పేజీలో)

# 'ఓన్లీ ఒన్ ఎర్త్' - మానవాళి చిరునామా




మానవాళి మనుగడికి మూలధాతువు భూమి. భూమి, ఆకాశం, నీరు, గాలి, నిప్పు కలిస్తే ప్రకృతి. సహజంగానే వీటి మధ్య సమతుల్యత ఉంటుంది. ఈ సమతుల్యతనే పర్యావరణమంటాం. ప్రకృతితో సామరస్యం కొనసాగినంత కాలం సుస్థిర జీవనం సాధ్యం. ఈ సామరస్యతకు హానికలిగినప్పుడు వివిధ సంక్షోభాలు తలెత్తుతాయి.

ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొనే సంక్షోభాలన్నీ సహజమైనవి కావు. మానవ ప్రమేయమే ప్రధాన కారణమవుతున్నది. ఈ సంక్షోభాలు ప్రకృతి పరంగానే కాదు సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక రంగాలనూ ప్రభావితం చేస్తున్నాయి.

సకల జీవరాసులకు కన్న తల్లి భూమి. ఈ భూమిపై వున్న జీవరాసులలో మనిషి కూడా ఒక భాగమని గుర్తించాలి. భూమి తన ఒక్కడి సొత్తు అనే ఆధిపత్య భావన విడిచిపెట్టాలి. సకల జీవరాసుల ఉనికిని కాపాడే వనరులన్నిటికీ భూమి వివిధ రూపాలలో అందిస్తున్నది. వాటిని సద్వినియోగం చేసుకోవాలి. భూగర్భజలాలు, నదులు, సముద్రాలు, గాలి పారిశ్రామిక వ్యవర్థాలతో విషపూరిత మవుతున్నాయి. అడవుల నరికివేత, మడ అడవుల నిర్మూలన, ఖనిజ సంపద వంటి సహజ వనరులన్నిటినీ ధ్వంసం చేసి కలుషితం చేస్తున్నాము. వీటి ఫలితంగా వివిధ జీవరాసులు తన ఉనికిని కోల్పోయి జీవ వైవిధ్యం దెబ్బతింటున్నది.

పర్యావరణ వ్యవస్థలు బలంగా ఉండటానికి మానవ వ్యవస్థలు దోహదం చేసినప్పుడు మానవ వ్యవస్థలు బలంగా ఉండటానికి సహజంగానే పర్యావరణ వ్యవస్థలు తోడ్పడతాయి.

మానవులు ప్రకృతితో సామరస్య జీవనం సాగించేందుకు కృషి చేయాలి. దానికి అనుగుణంగా మన విధాన నిర్ణయాలు, ప్రణాళికలు ఉండాలి.

తెలంగాణా రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఎనిమిదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం ఈ దిశగా పయనించి తీసుకొన్న కొన్ని నిర్ణయాలలో మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, కాళేశ్వరం ప్రాజెక్టు, హరితహారం వంటివి పర్యావరణ సమతుల్యానికి తోడ్పడ్డవి. ఫ్లోరైడ్ రహిత ప్రాంతంగా తెలంగాణా నిలిచింది. పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా పునర్నిర్మాణం కొనసాగాలి.

జూన్ 5న జరుపుకోబోతున్న ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఈ కృషికి మరింత ప్రేరణగా నిలుస్తోందని ఆశిద్దాం.

1972లో స్టాక్‌హోమ్‌లో జరిగిన మొదటి సదస్సు 'ఓన్లీ ఒన్ ఎర్త్'ని ప్రధాన నినాదంగా తీసుకుంది. ఏభై ఏళ్లు గడిచిన తర్వాత యిప్పుడు కూడా అదే ప్రధాన నినాదంగా ఉంది. ఆ నినాదం యిచ్చిన అవగాహన చైతన్యం ఆచరణలో ఇప్పటికే సఫలీకృతం కావాల్సి వుంది. కాని పరిస్థితి మరింత క్లిష్టతరమై సవాలుగా నిలిచింది. మరింత అవగాహనతో, చైతన్యంతో యుద్ధప్రాతిపదికన ఆచరణవైపు ప్రయాణించి 'ఒకే ఒక్క భూమి'ని నిలబెట్టుకోవాలి. కాపాడుకోవాలి. కాలుష్యరహిత మానవ స్వభావమే ఈ కర్తవ్యాన్ని నెరవేర్చగలుగుతుంది. లేకుంటే మానవాళి ఉనికే ప్రశ్నార్థకమవుతుంది.

వేదకుమార్.యం

(మణికొండ వేదకుమార్)

ఎడిటర్

(6వ పేజీ తరువాయి)

ప్రింటు చేయించారు.

24 గంటలలో దాదాపు అర్ధరాత్రి దాటేవరకు బిజీగా ఉండేవారు. మళ్లీ ఉదయమే ఇంగ్లీషు ట్యూషన్స్ చెప్పేవారు.

అప్పుడప్పుడు కవిత్వం సామాన్య జనానికి అందాలని రాత్రిపూట గ్రామాల్లో కవిసమ్మేళనం నిర్వహించేవారు. కంజర్ల బోర్గాం ముబారక్‌నగర్, మొదలైన గ్రామాల్లో అందరూ భోంచేసి వచ్చిన తరువాత కవిత్వం వేదిక ప్రారంభమయ్యేది. అందరు కవులు సామాన్య జనానికి అర్థమయ్యేలా ఉన్న కవిత్వాన్ని అందించేవారు. ఈ కవి సమ్మేళనం దాదాపు అర్ధరాత్రి దాటిపోయేది. ఇలాంటి స్ఫూర్తి కలిగించింది చారి సారే.

ఇంతేగాక పున్నమి వెన్నెల రాత్రుల్లో ఊరి బయట చెరువుకట్ల మీద కవి సమ్మేళనం నిర్వహింపజేసేవారు. బొడ్డెమ, చెరువు - మంచిప్ప చెరువు, అలీసాగర్ మొదలైన చెరువుల వద్దకు పెట్రోమాక్స్‌లతో వెళ్లేవాళ్లం. దాదాపు 10 గంటల రాత్రి గడిచిపోయేది. కవితా విభావరులు ఇలా అనేకమంది యువకవుల్లో ప్రేరణగా నిల్చిపోయాయి.

చర్చలు, సమావేశాలు, గృహ సమావేశాలు, కవుల సంకలనాలపై ఉపన్యాసాలు, క్లుప్త గోష్టులు, కవితాపోటీలు, అవార్డులు, పండుగ పూట కవిత్వం వేడుకలు. ఇలా భోజరాజు కాలంలో సాగినట్లే కేశనకుర్తి వీరభద్రాచారి గారి మార్గదర్శకత్వంలో ఇందూరు భారతి సాహితీ శిఖరంగా ఎదిగింది.

1985లో ఆంగ్లోపన్యాసకులుగా పదవీ విరమణ గావించినా ఏనాడు అలసిపోని కళాతపస్విగా తమ సేవలను అందిస్తూ వచ్చారు.

*వీరభద్రాచారిగారు వెళ్లిపోయాకా వారి కవితలు అచ్చుకాకుండా ఉండిపోయినై. మేమంతా వాటిని వారి కుటుంబ సభ్యుల సహకారంతో పెట్టెలు, పుస్తకాలు, ఫైల్లు పాత పత్రికలు అన్నీ అన్వేషించి వారి కవితలను పరిష్కరించి 'కొత్తదారి' పేరిట సంకలనాన్ని రూపొందించాం. దీనికై ముందు మాట దాశరథి కృష్ణమాచార్యులవారు కంటతడి పెడుతూ రాశారు.*

నిరంతర సేవలు అందించడం ఎప్పుడు విరామమెరుగని ట్యూషన్‌లు మొదలైన వాటివలన కేశనకుర్తి వీరభద్రాచారిగారికి శ్వాసకోశాల ఇబ్బంది తలెత్తింది. చికిత్స నిమిత్తం చెన్నైలోని విజయా హాస్పిటల్‌కు వెళుతున్నప్పుడు అందరం చారిగారికి ధైర్యం చెపుతూ పసిపిల్లాడిలా వీడ్కోలు చెప్పాం! కాని చారి సార్ అనారోగ్యం తీవ్రతై అక్కడే 04-06-1986 నాడు కళాకీర్తిశేషులైనారు.

నిజామాబాదులో వారు పరమపదించి ఉంటే కొన్ని కిలోమీటర్ల పర్యంతరం కళాభిమానులు చారి సార్‌కు వీడ్కోలు పలికేవారు. అంత్యక్రియలూ సన్మానప్రాయంగా జరిగేవి. కాని చెన్నైలో కాలధర్మం చెందటంతో వారిని ఇక్కడికి రప్పించే అవకాశం రాలేదు. మా అందరికీ కడచూపుకూడా కరువైంది.

నిజామాబాదును ఇలా సర్వతోకళావేదికగా తీర్చిదిద్దిన ఆ మహామనీషికి అశ్రు అంజలి మాత్రమే ఘటించగలిగారు కళాభిమానులు.

వారు వెళ్లిపోయాకా వారి కవితలు అచ్చుకాకుండా ఉండిపోయినై. మేమంతా వాటిని వారి కుటుంబ సభ్యుల సహకారంతో పెట్టెలు, పుస్తకాలు, ఫైల్లు పాత పత్రికలు అన్నీ అన్వేషించి వారి కవితలను పరిష్కరించి 'కొత్తదారి' పేరిట సంకలనాన్ని రూపొందించాం.

దీనికై ముందు మాట దాశరథి కృష్ణమాచార్యులవారు కంటతడిపెడుతూ రాశారు. దాశరథి వారికి చారిసార్‌కు ఉన్న అనుబంధం చాలా గొప్పది. నిజామాబాద్ అన్నా - చారిసార్ అన్నా, ఇందూరు భారతి కవులన్నా దాశరథిగారికి ఎనలేని ఆత్మీయ స్పర్శ.

సంకలనం చారిగారి ప్రెస్ ఐన 'శ్రీ' ప్రింటర్స్‌లోనే అచ్చైంది. ఈ ఆవిష్కరణ వేడుకకు కీ.శే. రావూరి భరద్వాజ విచ్చేసి అనేక గాద్గదిక మాటల మధ్య చారిసార్‌ను స్మరించుకునేలా చేశారు.

ఆవిష్కరణ సభకు కేశనకుర్తి వీరభద్రాచారిగారు స్థాపింపజేసిన అనేక కళానాటక నాట్యసంస్థలు విచ్చేసి వారి స్మృతిగా 'కొత్తదారి' వేసుకున్నారు.

ఈనాటికి గిరిరాజ కాలేజీ భవనాన్ని చూసినా, కొండెంగ హనుమాన్ వారున్న పాత ఇల్లు చూసినా, పెద్దబాజర్ రోడ్ చూసినా, మణిక్ భవన్ కళావేదిక చూసినా కేశనకుర్తి వీరభద్రచారిగారే జ్ఞాపకం వస్తారు.

ఈనాడు లబ్దప్రతిష్ఠులైన అనేక కవులు, నటులు, గాయకులు ప్రతిరోజు ఏదో సందర్భంగా వారి పేరును నాల్కపైకి తెచ్చుకొని స్మరించకుండా ఉండలేరు.

ఎక్కడో భీమవరంలో స్థిరమైనా ఇక్కడ ఇందూరుకు వచ్చి కళాక్షేత్రంగా రూపొందించిన కేశనకుర్తి వీరభద్రాచారిగారు శరీరంతో లేకున్నా - వారి సాహితీ కళా ఆత్మ మా ఎదురుగా ఉన్నట్లే భావిస్తుంటాం.

ఈ రోజు ఇందూరు భారతి ద్వారా మేము నిరంతర సేవలందిస్తున్నమంటే వారి స్ఫూర్తి మాకు కవితా జీవకళ.

నిజామాబాద్ సాహితీ కళాచరిత్రలో వారి పేరు అనేక గ్రంథాల్లో సువర్ణ అక్షరాలతో లిఖించబడింది.

కళాకారుడికి మరణం నిజంగా లేదని ఇందరి అభిమానమే నేటికి ఋజువు చేసింది. ఇందూరు కళలకు వేసింది కమలాల పూలదారి. వీరు రాసింది సరికొత్త 'కొత్తదారి', మాలో నిలిచి ఉండే కారణజన్ములు కేశనకుర్తి వీరభద్రాచారి.

*(తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ప్రచురించిన* ***'తెలంగాణ తేజోమూర్తులు'*** *నుంచి)*

**-కందాళై రాఘవాచార్య**

# ఉన్నదొకే ధరిత్రి - కాపాడుకుందాం!



**2022** సంవత్సరం ప్రపంచ పర్యావరణదినోత్సవానికి స్వీడన్ ఆతిథ్యమిస్తున్నది. ఒకే ఒక్క ధరిత్రి (ఓన్లీ వన్ ఎర్త్) అనేది ప్రచార నినాదంగా ప్రకృతితో సామరస్య పూర్వకంగా సుస్థిరతతో జీవించటం మీద దృష్టి నిలపడం జరుగుతుంది. ఇక ఈ ఏడాది కార్యక్రమాలు అన్నీ సామరస్యం, సుస్థిర జీవనం మీదనే కొనసాగుతాయి.

పర్యావరణ సంక్షోభాలు, విధ్వంసాలు నానాటికీ అధికమవుతున్నాయి తప్ప తగ్గే సూచనలు సమీప దూరంలో కనిపించటం లేదు. మనుషులందరమూ ఈ భూమండలం మీద ఆధిపత్యంతో జీవించడానికే అలవాటు పడ్డట్లున్నాం. ముఖ్యంగా ప్రకృతి మీద మరింత ఆధిక్యతా భావంలో ఉన్నామని కూడా అనిపిస్తుంది.

ఒకే ఒక్క ధరిత్రి లేదా ధరణి అనే మాటను ఒకటికి రెండుసార్లు పైకి అనుకుంటే తప్ప ఆ నినాదంలో దాగిన సందేశ తీవ్రత అర్థం కాదు. మానవులు మనుగడ సాగించడానికి మరో భూమి లేదు. ఉన్నదొకే భూమి. దీనిని మరుభూమిగా మార్చుకునేంత అవివేకులం కావద్దని ఆ నినాదంతో ఏదో ఒక హెచ్చరిక ధ్వనిస్తోంది నాకు. మరో భూమి అంటూ లేకపోవటం. ఉన్న భూమిని కాపాడుకోవటం, పరిరక్షించుకోవటం ప్రపంచ మానవులందరి కర్తవ్యం, లక్ష్యం కూడా కావాలి. ఎందుకంటే పర్యావరణ సమస్యలు, సంక్షోభాలు ఏ ఒక్క విడి ప్రాంతానికో, దేశానికో, ఖండానికో చెందినవి కావు. అవి మానవాళి ఉమ్మడిగా ఎదుర్కొంటున్న సమస్యలు, సంక్షోభాలు. ఇవి ఏ ఒక్కరో ఇద్దరో తేలికగా అధిగమించగలిగినవీ, పరిష్కరించగలిగినవీ కావు.

ఇందుకుగాను మానవులందరం ఉమ్మడిగా గుర్తించాల్సిన అంగీకరించాల్సిన అంశం ఏమంటే మనం ఈ భూమికి అతిథులమే తప్ప అధిపతులం కాదు. కానీ, అధిపతులుగా యజమానులుగా మారుతున్నాం. ఈ ధరణిని పలు విధాలుగా దుర్వినియోగం చేస్తున్నాం. ప్రకృతి, పర్యావరణం మానవుల కోసం కాకపోతే ఎందుకున్నట్లు అనే ఒక అమాయకపు ఆధిక్యతతోనో, నిర్లక్ష్య వైఖరులతోనో మనం ఉన్నాం. ప్రకృతికి సంబంధించి ఒక అప కథనాన్ని ఉమ్మడిగా రచించాం. ఈ చరిత్రను మార్చి చరితార్థులుగా మిగలవలసిన తరుణం కూడా ఇదే.

నిజానికి మానవులంతా ఉమ్మడిగా రాసుకున్న చరిత్ర చాలా సుదీర్ఘమైంది. వాస్తవంగా ఆలోచిస్తే చరిత్ర అనేది అనేక మార్పులతో కూడిన కథనం. ప్రజలుగానీ, ప్రపంచంగానీ ఏటికేడాది, తరం నుంచి తరానికి మార్పు ఏమీ లేకుండా ఉన్నట్లయినా, లేదా అదే అభివృద్ధి అనే వృత్తమే పదే పదే పునరావృతమైనా ఇక ఎంత మాత్రమూ ఈ వలయం నుంచి తప్పించుకునే దారి లేక అలాగే కొనసాగితే ఇక చరిత్ర మనం రాసుకోవటమనేది అంత విలువైన విషయమేమీ కాదు. మార్పులేని స్థితి అంతటా కొనసాగింపబడి దానినే మనం నమోదు చేస్తే దానిని చరిత్రగా చదవటం కూడా అంత ప్రయోజనం లేనిపని.

అదృష్టమో, దురదృష్టమో కాని అన్ని మానవ సమాజాలలోనూ మార్పు సహజం. మార్పు అనివార్యం. మార్పు నుంచి తప్పించుకోవటం ఏ మానవ సమాజానికి సాధ్యం కాదు. మారే స్వభావం గల సమాజాలకు, ప్రకృతికి ప్రపంచానికి కూడా ఇది వర్తిస్తుంది. ఈ రెంటి మధ్య సంబంధాలు కూడా వీటిని కలిపే ఉంచుతాయి. ప్రకృతిలో సహజంగా వచ్చే మార్పులు ఒకరకమైతే మానవ ప్రమేయం ద్వారా వచ్చే మార్పులు రెండవ రకం. ప్రకృతి సహజంగా మారటం ద్వారా మానవ సమాజాలు అందుకనుగుణంగా మారవలసి వస్తుంది. మానవ సమాజాల వల్ల ప్రకృతి మారినట్లయితే ఆ మేరకు ప్రకృతి కూడా సమాజాలకు అనుకూలంగా మార్చబడుతుంది.

అన్ని మానవ సమాజాలకు సవాళ్లు సహజం. కొన్నిసార్లు ఇవి ఉప్పెనలు, తుఫాన్లు, భూకంపాలు, సునామీలు మొదలైన రూపంలో కనపడవచ్చు. అట్లాంటివి ప్రతికూలంగా మారి కొన్నిసార్లు మానవ సమూహాలను ప్రమాదంలోకి నెడతాయి. కొన్నిసార్లు ఈ సవాళ్లు సాంస్కృతికంగా, ఆర్థికంగా కూడా ముంచుకొస్తాయి. ఇట్లాంటివి సంభవించటానికి మానవులు తమ అభివృద్ధి కోసం చేసే పనులే కారణం. ఇవి సహజ వ్యవస్థల యొక్క ఉనికికి భంగకరంగా ఉంటాయి. మానవ వ్యవస్థలు కొనసాగడానికి ఆవరణ వ్యవస్థలు ఏ విధంగా దోహదకారులుగా ఉంటాయో, పర్యావరణ వ్యవస్థలు నిలదొక్కుకోవడానికి మానవ వ్యవస్థలు కూడా దోహదకారులుగా నిలవ వలసి ఉంటుంది. ఇవ్వాళ మనం గుర్తించవలసిన విషయం ఇదే. ప్రకృతి, పర్యావరణం వ్యవస్థలను అవసరాలకు మించి బాధించాం. వత్తిడికి గురి చేశాం.

మనుషుల మనుగడకోసం ప్రకృతి, పర్యావరణాలు పలు విధాలుగా మార్పులకు గురయ్యాయి. మనిషి తనకోసం చేసుకున్న మార్పులకు కూడా పర్యావరణం అలవాటు పడవలసి ఉంది. అట్లాగే ప్రకృతి, పర్యావరణంలో వాటిల్లిన మార్పులు, పరిణామాలను బట్టి మానవ వ్యవస్థలు కూడా తగిన మార్పు, చేర్పులు చేసుకోవలసి ఉంది. ఇటువంటి అవగాహన, చైతన్యాలు ఉన్నప్పటికీ సరైన ఆచరణ లేకపోవటం వల్ల మానవాళి ఉనికి మరింత ప్రమాదంలో పడింది. ఈ రెండు వ్యవస్థలలోనూ పరస్పరం జరిగిన మార్పులు, పరిణామాలకు అనుగుణంగా తమని తాము మార్చుకోలేకపోయినా, పద్ధతులను, నమూనాలను రూపొందించుకోలేకపోయినా అవి క్షీణించనైనా క్షీణిస్తాయి లేదా అంతరిస్తాయి. అంతర్ధానమవుతాయి. ఇట్లాంటివి ప్రతిచారిత్రక కాలంలో కూడా ఈ భూమండలం మీద ప్రతిచోటా జరిగాయని అధ్యయనాలు చెపుతున్నాయి. పర్యావరణ, మానవ వ్యవస్థలు పరస్పర ప్రభావాలు, ప్రమేయాల వల్ల ఏం జరిగిందో తెలుసుకోవటమే పర్యావరణ చరిత్ర ప్రమాదాలు, ముప్పులు, సంక్షోభాలతో తలపడుతూ కూడా వర్తమానంలో మానవులుగా మనం చేయాల్సిన పని వివేకవంతంగా ఎంపిక చేసుకోవటం. ఇది మానవాళి భవిష్యత్తు కోసం తెలిసిన అవగాహన గల గత పర్యావరణ అనుభవాలను దృష్టిలో ఉంచుకొని జరగాల్సి ఉంది.

అందుకే 5 జూన్ 2022న ప్రపంచపర్యావరణ దినోత్సవాన్ని ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం (UNEP) భాగస్వామ్యంతో స్వీడన్ ఆతిథ్యం ఇస్తోంది. 'ఒకే ఒక్క అవని / ధరిత్రి / ధరణి' అనే నినాదం మానవులు మరింత సుస్థిర, హరిత జీవన శైలుల వైపు మరలేందుకు గల అవకాశాలను వెతకమని సూచిస్తున్నది. ఆ వైపు అడుగులు వేయమని సూచిస్తున్నది.

మానవులు ప్రకృతితో సుస్థిరత, సామరస్య జీవనం సాగించేందుకు గల అవకాశాలను పరిశీలించాలి. మన విధాన నిర్ణయాలు, విడివిడి వ్యక్తులుగా మనం ఎంపిక చేసుకునేవి హరితవాదం దిశగా సాగాల్సినవి. ఐక్యరాజ్య సమితి పర్యావరణంపై 1972 స్టాక్‌హోంలో జరిపిన మొదటి సదస్సు కూడా 'ఓన్లీ వన్ ఎర్త్' అనేదే ప్రధానాంశం. దీని ఉద్దేశం ఏమంటే మానవులకు నివాసయోగ్యమైన గూడు భూమి ఒక్కటే అని. కాబట్టి భూమిపై ఉండే సకల వనరులను మనం వివేకవంతంగా పరిరక్షిస్తేనే ఈ ధరిత్రి మనలను కాపాడుతుందని, మనలను కాపాడే భూమిని కాపాడుకోవటం కన్నా విలువైన పనేముంది?

– డా॥ ఆర్. సీతారామారావు
m : 9866563519
e: sitametaphor@gmail.com

JBR
ARCHITECTURE COLLEGE
HYDERABAD
(Approved by Council of Architecture, New Delhi - Affiliated to JNA&FAU Hyderabad)
E-mail : jbrarchitecture@jbgroup.org.in, www.jbrachitecture.com

# మహారాజా కిషన్ పర్‌షాద్ దేవుడీ

"షాద్" అన్న తఖల్లుస్‌తో (కలంపేరు) ఉర్దూ, అరబ్బీ, ఫార్సీ భాషలలో కవిత్వం రాసినది ఎవరో తెలుసా? ఆరవ నిజాంకు దివాన్‌గా పనిచేసిన మహారాజా కిషన్ పర్‌షాద్. ఆయన జాగీరు గ్రామం పేరే షాద్‌నగర్. నగరంలో కిషన్‌భాగ్ దేవాలయం ఆయన కట్టించినదే. ఆయన అధికార నివాసభవనం "దేవుడీ" షాలిబండాలో ఉంది. కరిగిపోయిన కమ్మని కలకు ప్రతిరూపమే ఆ దేవుడీ. ఆ దివాణం చుట్టూ అల్లుకున్న కమ్మని కథలు ఎన్నెన్నో!

వీరు ఖత్రీ కులానికి సంబంధించినవారు. వీరి మాతృభూమి పంజాబ్. వీరు ముస్లింల ఆస్థానాలలో "నఖల్‌నవీస్‌లుగా" (కాపీ రైటర్స్) పనిచేసేవారు. క్రమక్రమంగా పరిపాలనా రంగంలో నైపుణ్యం సంపాదించారు. మంత్రి పదవులను అలంకరించారు. మొదటి నిజాం ఢిల్లీ నుండి వచ్చినప్పుడు వీరు కూడా పరిపాలనా సిబ్బందిగా వచ్చి హైదరాబాద్‌లో స్థిరపడినారు.

1864లో ఆరవ నిజాం కన్నా రెండు సంవత్సరాల ముందే కిషన్ పర్షాద్‌గారు జన్మించారు. అక్బర్ పాదుషాగారి కాలంలో పేష్కార్‌గా (ఆర్థిక మంత్రిగా) పనిచేసిన తోడర్ మల్ వీరి పూర్వీకులు. మరొక పూర్వీకుడు రాయ్‌మూల్ చంద్ 1724లో మొదటి నిజాంతో కలిసి హైద్రాబాద్‌కు వచ్చి రాజ్యస్థాపన చేసారు. వీరి ముత్తాత మహారాజా చందూలాల్ మూడవ మరియు నాల్గవ నిజాంలకు పేష్కార్‌గ, దివాన్‌గ పనిచేసారు. చందూలాల్ బేలా, చందూలాల్ బారాదరి అను బస్తీలు ఈయన పేరుమీదనే వెలిసాయి. అల్వాల్‌లోని వెంకటేశ్వరస్వామి గుడి ఈయన నిర్మించిందే. ఇదీ మహారాజా కిషన్ పర్షాద్‌గారి నేపథ్యం. ఆయన రక్తనాళాల్లో తన పూర్వీకుల రక్తమే గాక వారి ఔన్నత్యం కూడా ప్రవహిస్తుండేది.



కిషన్ పర్షాద్ దేవుడి (ప్రస్తుతం సూరజ్‌భాన్ దవాఖానా)

ఆధునిక విద్య అభ్యసించిన తర్వాత 19 సం॥ల వయస్సులో కిషన్ పర్షాద్‌గారు పేష్కార్ పదవిలో నియమించబడినాడు. ఇతను బహుముఖ ప్రజ్ఞాశాలి. ప్రాచీన అర్షభాషా సంస్కృతాన్ని, తరతరాల నుండి సంక్రమిస్తున్న పేష్కారు పదవీనైపుణ్యం కోసం జమాఖర్చులకు సంబంధించిన గణితాన్ని, తన ప్రవృత్తి సంతృప్తికోసం కవిత్వం, సంగీతం, చిత్రకళ, ఫొటోగ్రఫీ, కాలిగ్రఫీని అభ్యసించాడు. తోటి మానవులకు సేవచేసే ఉద్దేశ్యంతో వైద్యాన్ని, జోతిష్య శాస్త్రాన్ని నేర్చుకున్నాడు. తన తాత్విక దాహాన్ని తృప్తిపరచటం కోసం అన్ని మతాలను తులనాత్మకంగా అధ్యయనం చేశాడు. తన మధ్య వయసులో మట్టికుండలపై, కూజాలపై కళాకృతుల్ని ఆవిష్కరించే నైపుణ్యాన్ని సాధించాడు. అంతేకాదు అతను పాక కళాశాస్త్రంలో ప్రవీణుడు కూడా. ఒక కంది పప్పుతోనే యాభై రెండు రకాల వంటకాలను తయారుచేసేవాడు.

ఒకరోజు ఆరవ నిజాం కిషన్ పర్షాద్ దేవ్‌డీకి వెళ్లాడు. కుటుంబ సభ్యులందరూ విడివిడిగా నవాబుగారికి నజరానాలు సమర్పించుకునే ఆచారం అమలులో ఉన్నందున కిషన్ పర్‌షాద్‌గారి అక్కచెల్లెళ్లందరూ "నజర్"లు చెల్లించుకున్నారు. ఒక సోదరి మాత్రం తన భర్త పరదేశంలో ఉన్నందున నవాబుగారి ముందు హాజరు కాలేనని అన్నగారిని ప్రార్థించింది. కాని ఆయన వొత్తిడి వలన చివరికి ఒప్పుకుంది. తల నిండా కొంగు కప్పుకుని నవాబు ముందు హాజరై నజర్ సమర్పిస్తుండగా నిజాం "మీ సోదరి విధవరాలా" అని దివాన్‌గారిని అడిగాడు. వైధవ్యం పొందిన హిందూ స్త్రీలు తలనిండా కొంగు కప్పుకోవటం ఆ రోజులలో ఆచారం. నవాబుగారు అలా పొరపాటు పడ్డారు. ఆ ప్రశ్నకు అందరూ ఉలికిపడి అసలు సంగతి చెప్పారు. తన పొరపాటుకు నిజాం కూడా చింతించాడు. మరునాడు ఆ వార్త నిజమే అయ్యింది. రాజుగారు ఆ ప్రశ్న అడిగిన సమయంలోనే ఆమె భర్త పరదేశంలో మరణించాడు.

ఆ సంఘటన జరిగిన తర్వాత ఆ కుటుంబ స్త్రీలు ఎవరూ నిజాం ప్రభువు ముందు హాజరుకావటానికి సాహసించలేదు.

కిషన్ పర్‌షాద్‌గారు లంకంత ఆ దేవుడీలో విలాసవంతంగా జీవించేవాడు. అనేకమంది భార్యలకు వారి పిల్లలకు వేరు వేరు గదులుండేవి. వారికోసం ప్రత్యేకంగా నౌకర్లు, చాకర్లు ఉండేవారు. వంటగదులు, భోజన శాలలు కూడా వారివారి అభిరుచుల మేరకు ప్రత్యేకంగా ఉండేవి. యాత్రలకు, వినోద విహారాలకు ఎక్కడికి వెళ్లినా వారందరితో కలిసి కదిలేవాడు. ఆయన జీవితం ఒక గొప్ప ఉత్సవ ఊరేగింపుగా నిత్యకల్యాణం పచ్చతోరణంగా కొనసాగింది.

ఆయన సిమ్లా రైలు ప్రయాణం ఒక గొప్ప చారిత్రక వినోద దృశ్యంగా కొనసాగింది. ఇప్పటికి వందేళ్ల క్రితం ఆయన సిమ్లా రైలు యాత్ర తన కుటుంబ సభ్యుల సమేతంగా చేశారు. అన్ని విలాసాలతో కూడిన ఒక ప్రత్యేక రైలును, ఏకంగా అద్దెకు తీసుకున్నారు. తనకు, తన పట్ట మహిషికి, పిల్లలకు ఒక బోగీ, దాని వెనక భాగంలో పనివాళ్లకు, వంటవాళ్లకు మరోబోగి, మిగతా బోగీలు ఇతర భార్యలకు వారి పిల్లలకు వారి సేవకులకు. ఇక వారి లగేజీలకు, సామానులకు అంతు లేదు. అతిపెద్ద సర్కస్ కంపెనీ కూడా వారి బృందం ముందు చిన్నగా కనబడుతుంది. రాత్రి కాగానే రైలు ఏదో ఒక అందమైన ప్రకృతి ఒడిలో విశ్రమించేది. వారి పెట్రోమాక్సు లైటు వెలుగులకు, జిలుగు వెలుగుల రంగుల దేరాలు, గుడారాలకు, రమణుల కాలి అందెల సవ్వడులకు చేతిగాజుల గలగలలకు, వంటవారి హడావుడికి, పిల్లల కేరింతలకు అడివంతా ఉలికిపడి మేల్కొనేది. గానాబజానా విందు భోజనాలతో

రాత్రి రంజుగా రాణించేది. అర్ధమరేతిరి దాటిం తర్వాత నెగళ్ల జ్వాలల వెచ్చదనంతో అడివితో సహా అందరూ తూలి, సోలిపోయి నిద్రలోకి జారుకునేవారు. తెల్లారగానే చిలకలు వాలిన చెట్టులా రైలు కిలకిలలాడేది. కళకళలాడేది. ఆ పడుచుదనాల రైలుబండి మందగమనంతో ముందుకు సాగేది. అట్లా సొక్కుతూ, సోలుతూ ఒయ్యారాలు పోతూ ఆరైలు బండి పది దినాలకు గాని సిమ్లాకు చేరుకోలేదు. వారి ప్రయాణం పుణ్యమా అని "బండీర పొగ బండీర, దొరలెక్కె రైలు బండీర" అన్న పాట నిజమే అయ్యింది.

షాలీబండాలోని ఆయన దేవుడీ భిన్నమతాలకు, భిన్న సంస్కృతులకు ఒక సంకేతంగా నిలిచిపోయింది. ఆయన భార్యలలో కొందరు ముస్లింలు, వారికి, వారి సంతానాలకు తమ స్వంత మతాన్ని అవలంబించే స్వేచ్ఛను ఇచ్చాడు. హిందూ ముస్లిం పిల్లలందరీ రెండు మతాలకు సంబంధించిన పేర్లను కలిపి పెట్టేవాడు. ఉదా॥ "రాయ్ మహబూబ్ నారాయణ్" పేరు. దాంతో ఎవరు ఏ మతానికి సంబంధించిన వారో తెలియక పోయేది. వారు నివసించే భవనాల పేర్లు కూడా అలానే ఉండేవి. దీనివలన ఒక నూతన సంస్కృతి, మిశ్రమ సంస్కృతి నగరంలో ఆవిర్భవించింది. సాధువులు, సంతులతో పాటు ఫకీర్లను, సూఫీసాధువులను కూడా ఆదరించాడు.


మహారాజా కిషన్ పర్షాద్

ప్రతి పెళ్లి కూతురు నా కూతురే అని ఆయన భావన. ఒకరోజు రైల్లో ప్రయాణిస్తుంటే ఒక బీద ముస్లిం ముసలాయన కిటికీ వద్దకు వచ్చి కూతురు పెళ్లి చేయలేక పోతున్నానని "మెహర్" ఖర్చులను భరించలేక పోతున్నానని అంగలార్చాడు. దాంతో దివాన్‌గారు తన పాకెట్ డైరీలో అతని ఊరు, పేరు పెళ్లి ఖరారైన తేదీ వివరాలు నోట్ చేసుకుని నిశ్చితంగా వెళ్లి పెళ్లి పనులు చూసుకోమని భరోసా ఇచ్చాడు. ఇచ్చిన మాట ప్రకారం పెళ్లిరోజున సరుకుల్ని, సామాగ్రిని తీసుకుని ఆ గ్రామానికి చేరుకున్నాడు. ఆ ముసలివాని ఇల్లు నిశ్శబ్దంగా ఉంది. పెళ్లికళా, హడావుడి ఏమీ కనబడలేదు. ఇంట్లోంచి దిగులుగా ఇవతలికి వచ్చిన ముసలివాడిని సంగతి ఎంటని అడిగాడు. కట్నం డబ్బులు ముందే ఇవ్వలేదని పెళ్లి వాళ్లు రాలేదని అన్నాడు. పెళ్లికొడుకు ఊరు, పేరు తెలుసుకుని జవాన్లు కట్నం డబ్బులను, సంభరాలను తరలించి ఇది నాకూతురి పెళ్లి, ఇకనైనా రాలేదో నేనే స్వయంగా వచ్చి అసలు పెళ్లిచేసి తోలుతీస్తా అని సందేశం పంపగా పెళ్లి కొడుకు ఉరుకులు, పరుగులతో వచ్చి పెళ్లి పీటల మీద కూచున్నాడు.

ఆయన వినోద క్రీడ చాలా వింతగా ఉండేది. సుప్రభాతపు వేళల్లో తన దేవ్‌డీపై భాగంలో నిల్చుని చిన్ని చిన్ని తాజా మాంసం ముక్కల్ని చాలా బలంగా పైకి ఆకాశంలోకి చాలా ఎత్తున విసిరేవాడు. గగనంలో విహరిస్తున్న గ్రద్దల గుంపు చాలా ఒడుపుగా పల్టీలు కొట్టి పోటీలు పడి ఆ మాంసం ముక్కల్ని అందుకునేవి. ఎవరైనా "ఇదేం సరదా! పావురాలకు గింజలు చల్లటం చూశాం కాని గద్దలకు మాంసం ముక్కలు విసరటం చూడలేదు" అంటే "గ్రద్దలు గరుత్మంతుడికి ప్రతిరూపాలు కదా" అని ఒక్క ముక్కలో వారికి సమాధానం చెప్పేవాడు. కుటుంబ సభ్యులలో ఎవరైనా తన మనసు నొప్పిస్తే వారిని పల్లెత్తుమాట అనకుండా అందమైన ముత్యాల సరాల దస్తూరితో (కాలిగ్రఫీ) వారికి సుదీర్ఘ లేఖలు సున్నితంగా రాసేవాడు. దాంతో వాళ్లు తమ తప్పు తెలుసుకుని అతనికి "ఫిదా" (వశం) అయిపోయే వారు.

ఇక దానగుణం గురించి చెప్పుకోవాలంటే ఒక బికారికి సహాయం అందించి తానే బికారిగా మారిన కథ ముందు చెప్పాలి. ఒకసారి ఢిల్లీ గల్లీలలో సంచరిస్తున్నప్పుడు ఒక బికారి తారసపడినాడు. కాసేపు ముచ్చటించాక తెలిసినదేమంటే ఆ బికారి చిట్టచివరి మొగల్ చక్రవర్తి బహద్దూర్‌షా జఫర్ పుత్రరత్నమని. ఆంగ్లేయులు తన తండ్రిని బర్మాకు ప్రవాసం పంపగానే తాను తప్పించుకుని ఢిల్లీ గల్లీలలో ఇలా తెగిన పతంగంలా తిరుగు తున్నానని తన విషాద పతనాన్ని తెలియచేసాడు. దాంతో మహారాజ్‌గారి గుండె కరిగి కన్నీరయ్యింది. మనసు చెరువయ్యింది. హొటల్‌కు వచ్చి బ్యాగులో ఉన్నదంతా ఊడ్చి ఆ"పేదరాజు" చేతుల్లో పెట్టి "జహాపనా ఇది తమరి కోసమే దాచి ఉంచాను దయచేసి స్వీకరించండి అని విన్నవించుకున్నాడు. క్షణంలో మళ్లీ రాజుగా మారిన ఆ బికారి వెళ్లిపోగానే "ఆహా భగవంతుడెంత దయామయుడు. ఒకప్పటి ఢిల్లీ చక్రవర్తి కుమారుడికి సహాయం చేసే అపురూప అరుదైన అవకాశాన్ని నాకు ప్రసాదించాడు'' అని సంబరపడ్డాడు.

మహారాజ్ వెంబడి ఢిల్లీ వచ్చిన అతని సహచరుడు, మిత్రుడు నవాబ్ మెహదీనవాజ్ జంగ్ (మెహదీపట్నం ఈయన స్థాపించినదే) ఒక్క రూపాయి కూడా మిగల్చకుండా సర్వం ఊడ్చి దానం చేసిన సంగతి తెలుసుకుని, తిరుగు ప్రయాణానికి రైలు టిక్కట్లకు కూడా డబ్బులు లేవని గ్రహించి లబోదిబోమని నెత్తినోరు కొట్టుకున్నాడు. ఘనత వహించిన మహారాజులం, ఏం ముఖం పెట్టుకుని ఎవర్ని అప్పు అడుగుతాం" అని దిగాలుపడిపోయాడు. చివరికి వెతికి వెతికి ఒకపాత మిత్రుణ్ణి కలిసి అతడిని జమానతుగా పెట్టి అప్పు పుట్టించి రైలు టిక్కెట్లను మాత్రం కొనుక్కుని అనేక ఇక్కట్లతో హైద్రాబాద్ చేరారు ఆ ఇద్దరు బికారులు. ఆ రోజులలో హైద్రాబాద్ నగరంలో ఒక యాభై సంవత్సరాల పాటు నగర ప్రజలందరూ "మహారాజ్" అన్న పదం కేవలం "మహారాజా కిషన్ పర్షాద్" దివాన్ గారికే వర్తిస్తుందని బలంగా విశ్వసించేవారు. అట్లా వారి దృష్టిలో మరో మహారాజ్ గారు లేరు. ఉండబోరని వారి ప్రగాఢ నమ్మకం. నగర ప్రజల ప్రేమాభిమానాల్ని దండిగా మూటగట్టుకుని ఆకాశం అవతలి అంచులకు వెళ్లిపోయిన "ఆ మహారాజు నిజంగా మహారాజే".


ఇప్పుడు ఆ దేవుడీ ఏమైంది? ఎట్లుందని అడుగుతున్నారా? నిక్షేపంగా, సలక్షణంగా ఉంది. అందులో ఇపుడు ప్రభుత్వం వారి "మాతాశిశు ఆరోగ్యం సంక్షేమ దవాఖానా" నడుస్తుంది.

**ఎప్పుడైనా శాలీబండా వెళ్లి ఆ దేవ్‌డీని సందర్శించుకుని ఆ మహారాజ్‌కు మనసులోనే నివాళి అర్పించండి.**

*(షహర్ నామా (హైద్రాబాద్ వీధులు – గాథలు) పుస్తకం నుంచి)*

**–పరవస్తు లోకేశ్వర్,** m: 91606 80847
e : lokeshwar.hyderabadi@gmail.com





# ఆ పాదాలు ఇప్పుడక్కడ లేవు!!!

అవును అవి పాదాలే. అక్కడ రెండు జతల పాదాలున్నాయి. అవి నిజంగా నిలువెత్తు పాదాలు. ఇంతవరకూ మన రాష్ట్రంలోనే కాదు, దేశంలో మరెక్కడా ఇంతెత్తున్న ఇలాంటి పాదాలు, ఇలా అరికాళ్లపైకి కనిపించేలా ఉన్న దాఖలాలు లేవు. శ్రీరామోజు హరగోపాల్‌గారు కొలనుపాకలో ఇంతకంటే చిన్నపాదం గురించి ఇటీవలే తెలియజేశారు. ఇంతకీ ఈ పాదాలు ఎవరివై ఉంటాయి? ఈ పాదాలు జైనతీర్థంకరులవేమో. స్థానికంగా మాత్రం ఇవి దేవుని పాదాలని, ఆ పాదాలను నిలబెట్టి ఉంచిన ప్రదేశాన్ని పాదాలగడ్డ అని అంటారు. మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల మండలం, గంగాపురం శివారులోని పాడుబడిన ఆలవానిపల్లి పొలాల్లో ఉన్నాయి. ఇదే ప్రదేశాన్ని గొల్లత్త(క్క) గుడి అని కూడా అంటారు. రాష్ట్ర పురావస్తుశాఖ ఇక్కడ 1971 నుంచి అనేక సంవత్సరాలు తవ్వకాలు జరిపిన తరువాత క్రీ.శ. 7-8 శతాబ్దాల నాటి ఇటుక, రాతి ఆలయాల పునాదులు బయల్పడినాయి. పాదాలగడ్డకు 200 మీటర్ల దూరంలో గల అప్పటి ఇటుక రాతి ఆలయం శిథిలావస్థకు చేరుకొంది. దీన్ని రక్షిత కట్టడంగా ప్రకటించారు. పోతపోసిన ఇటుకలతో కట్టిన శిఖరం వరకూ ఉన్న ఈ ఇటుకరాతి ఆలయమే మన రాష్ట్రంలో శిఖరం వరకూ గల అతిపురాతన ఆలయం, చాళుక్య - రాష్ట్రకూట సంప్రదాయాలను సంతరించుకొన్న ఈ ఆలయ గోడలపై అపురూపమైన సున్నపు బొమ్మలున్నాయి. (ఉండేవి). అవి నిర్లక్ష్యానికి గురై నేల రాలిపోయాయి. ఈ ఆలయంలోపల పద్మాసనంపై ధ్యానముద్రలో నున్న వర్ధమాన మహావీరుని రాతి శిల్పం వల్ల ఈ ప్రదేశం జైన స్థావరమని తెలిసింది. ఒకప్పుడు ఎంతో వైభవంగా విలసిల్లిన జైన బసది సొమ్మసిల్లింది. ఇదే అదనుగా మరో మతం, జైనాన్ని హతమార్చింది. విశాల జైన ప్రాంగణం నిశానీ లేకుండా పోయింది.



అందివచ్చిన చారిత్రక కట్టడాలను రక్షిత కట్టడాల పేరుతో నిర్లక్ష్యం చేయటం మానుకొని, శిథిలాలను పదిలపరచటానికి పూనుకోవాలి. జైనమతాన్ని వైనంగా బతికించుకోవాలి. వారసత్వ పరిరక్షణలో భాగంగా హోదాలు మరిచి ఒరిగిపోయిన ఈ పాదాలను మళ్లీ నిలబెట్టి. గత వైభవాన్ని పునరుద్ధరించాలి. దానికి గ్రామస్థాయి వారసత్వ కమిటీలు పూనుకోవాలి. ప్రభుత్వం కోసం చూడకుండా గ్రామస్తులే కాపాడుకోవాలి.

-ఈమని శివనాగిరెడ్డి-స్థపతి
m : 9848598446
e : nagireddy@malaxmi.in

# ఓన్లీ వన్ ఎర్త్

● జూన్ 5 ప్రపంచ పర్యావరణ దినోత్సవం ● 2022కు ఆతిథ్యం ఇవ్వనున్న స్వీడన్

ప్రపంచ పర్యావరణ దినోత్సవం 2022 థీమ్. 'ఓన్లీ వన్ ఎర్త్' (ఒకే ఒక్క భూమి), ప్రకృతికి అనుగుణంగా స్థిరంగా జీవించడంపై దృష్టి పెడుతుంది. జూన్ 5ని ప్రపంచ పర్యావరణ దినోత్సవంగా గుర్తించడానికి దారితీసిన స్టాక్‌హోమ్ కాన్ఫరెన్స్ నుండి 2022కి 50 సంవత్సరాలు పూర్తయ్యాయి.

గాలి, నీరు, నిప్పు, ఆకాశం, భూమి పంచభూతాలు.. ప్రకృతిలో మనం బాధ్యతగా ఉంటే ప్రకృతి మనల్ని బాగా చూసుకుంటుంది. మనిషికి మాత్రమే సొంతం అనుకుంటే.. మిగిలిన జీవ రాసులకూ సమాన హక్కు ఉన్న ప్రకృతిని మనిషి మాత్రమే వాడుకుంటే మనిషి మనుగడకే ప్రమాదం అవుతుంది.



ప్రకృతిని ప్రేమిస్తూ.. పర్యావరణాన్ని రక్షిస్తూ.. ముందుకు సాగితే, ప్రకృతి మన భవిష్యత్ తరాలకు సాయం చేస్తుంది. వాతావరణ సంక్షోభం మన జీవితాల్లో కొన్ని కోలుకోలేని మార్పులను చేస్తున్నందున, ప్రపంచ పర్యావరణ దినోత్సవం అటవీ నిర్మూలన, ప్లాస్టిక్ వ్యర్థాలు వంటి సమస్యలను పరిష్కరించడంలో ప్రత్యేకమైన పరిష్కారాలను ఈరోజు చర్చిస్తుంది ఐక్యరాజ్యసమితి.

పర్యావరణానికి అనుకూలమైన చర్యలు తీసుకోవడానికి అవసరమైన ప్రపంచ అవగాహనను పెంచడానికి ఐక్యరాజ్యసమితి ఈమేరకు పర్యావరణ దినోత్సవం జరపాలని నిర్ణయించింది. యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్మెంట్ ప్రోగ్రామ్ (UNEP) ద్వారా ఈరోజును జరుపుతున్నారు. 1972 జూన్ 5వ తేదీ నుంచి 16వ తేదీ వరకు మానవ పర్యావరణంపై ఐక్యరాజ్యసమితి సమావేశం అయింది. ఈ సందర్భంగా 1972లో యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ ద్వారా ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఏర్పాటు చేసింది. 1973లో మొదటిసారి ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకున్నారు.

నైరోబీ, 18 నవంబర్ 2021 - స్వీడన్ ప్రభుత్వం UN పర్యావరణ కార్యక్రమం (UNEP) భాగస్వామ్యంతో 2022 ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహిస్తుంది. మానవ పర్యావరణంపై ఐక్యరాజ్యసమితి మొదటి కాన్ఫరెన్స్ నుండి 2022 సంవత్సరం 50 సంవత్సరాలను సూచిస్తుంది, 1972 స్టాక్‌హోమ్ కాన్ఫరెన్స్ UNEPని రూపొందించడానికి మరియు ప్రతి సంవత్సరం జూన్ 5ని ప్రపంచ పర్యావరణ దినోత్సవంగా గుర్తించడానికి దారితీసింది.

ప్రపంచ పర్యావరణ దినోత్సవం 2022 ఒకే ఒక్క భూమి అనే థీమ్‌తో నిర్వహించబడుతుంది. పరివర్తనాత్మక మార్పులను తీసుకురావడం ద్వారా – విధానాలు మరియు ఎంపికల ద్వారా – పరిశుభ్రమైన, పచ్చటి జీవనశైలికి అనుగుణంగా ప్రకృతికి అనుగుణంగా స్థిరంగా జీవించాల్సిన అవసరాన్ని హైలైట్ చేస్తుంది. 1972 స్టాక్‌హోమ్ కాన్ఫరెన్స్‌కు ఒకే ఒక్క భూమి నినాదం. 50 సంవత్సరాల తరువాత నినాదం నిజం. ఈ గ్రహం మన ఏకైక ఇల్లు. దీని పరిమిత వనరులను మానవత్వం కాపాడాలి.

పర్యావరణం, వాతావరణ మంత్రి, స్వీడన్ ఉప ప్రధాన మంత్రి పెర్ బోలుండ్ ఇలా అన్నారు: "2022 ప్రపంచ పర్యావరణ దినోత్సవానికి గర్వకారణమైన హోస్ట్‌గా, స్వీడన్ అత్యంత ముఖ్యమైన పర్యావరణ ఆందోళనలను హైలైట్ చేస్తుంది. మన దేశం యొక్క చొరవలను, వాతావరణం, ప్రకృతి సంక్షోభాలను పరిష్కరించడానికి ప్రపంచ ప్రయత్నాలను ప్రదర్శిస్తుంది. ముఖ్యమైన చర్చలు, వేడుకల్లో పాల్గొనడానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రపంచ సమాజాన్ని మేము ఆహ్వానిస్తున్నాము.

– దక్కన్‌న్యూస్
m : 9030 6262 88
e: desk.deccan@gmail.com



'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు, 'సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' డైరెక్టర్ జనరల్ సునీతా నారాయణ్ అందించిన వ్యాసం

# 'వ్యర్థ' వివేకంతో నిర్మల నదులు

మన నదులు అంతకంతకూ కాలుష్య కాసారాలు అవుతున్నాయి. వాటిని స్వచ్ఛ వాహినులుగా ఉంచేందుకు చాలా సంవత్సరాల క్రితమే అత్యంత శ్రద్ధాసక్తులతో ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. అయితే అవి అంతగా ఫలించడం లేదు. కారణమేమిటి? మన పట్టణాలు, నగరాలలోని చెత్తా చెదారం, మురుగు జలాలను నదులలోకి యథేచ్ఛగా వదలడమే కాదూ? అసలే వాతావరణ మార్పు మన ధాత్రికి ఎనలేని ముప్పుగా పరిణమించిన సందర్భమిది. నదులను నిర్మలంగా ఉంచుకోవడమనేది మన ముందున్న పెద్ద సవాళ్లలో ఒకటి. వర్షపాతం తీరుతెన్నులను చూద్దామా అంటే వాటిలో స్థిరత్వం లేదు. పైగా అవి సదా అపసవ్యంగా ఉంటున్నాయి. ఫలితంగా మనకు సమీప భవిష్యత్తులోనే నీటి కొరత తీవ్ర స్థాయిలో దాపురించనున్నది. ఇది ఖాయం. నదులు, సరస్సులు, చెరువులు మొదలైన జల వనరులలో వర్షజలాలను సంరక్షించుకోవడమే కాదు, ఒక్క వాన చినుకు కూడా కలుషితమై పోకుండా పటిష్ఠ జాగ్రత్తలు తీసుకున్నప్పుడు మాత్రమే నీటి ఎద్దడిని మనం అధిగమించగలం.

నదుల సంరక్షణకు సంబంధించిన మన ప్రస్తుత విధానాలు గతంలో మన వైఫల్యాల నుంచి నేర్చుకున్న పాఠాల ఆధారంగా రూపొందడం ఒక శుభ విషయం. 'ప్రతి కుటుంబానికి సొంత టాయ్‌లెట్ (మలమూత్రాల విసర్జన శాల) ఉండి తీరాలి. ఉండడమేకాదు, అది మానవ విసర్జనాలను భద్రంగా వదుల్చుకునే సౌలభ్యాన్ని సమకూరుస్తున్న వ్యవస్థలతో అనుసంధానమయి ఉండాలి. ఇలా జరిగినప్పుడు మాత్రమే పరిసరాలు కాలుష్యమవ్వవు. ఆరోగ్య సమస్యలు తలెత్తవు'. 'క్లీన్ గంగ' జాతీయ కార్యక్రమం ప్రస్తావిత అనివార్యతలను గుర్తించడం ఎంతైనా ముదావహం. ఈ వాస్తవాల వెలుగులో మన ఎజెండా ఎలా ఉండాలి? కేవలం ప్రతి కుటుంబానికి సొంత టాయ్‌లెట్ సదుపాయం సమకూర్చడం మాత్రమే కాదు, నిరుపేదలు సైతం భరించగల పారిశుధ్య వ్యవస్థలను అభివృద్ధి పరచాలి. అభివృద్ధి అనేది అందరికీ అందుబాటులో ఉండి, సమ్మిళితమైనది అయినప్పుడు మాత్రమే అది సుస్థిరంగా ఉండగలుగుతుంది. ఇటువంటి సుస్థిర అభివృద్ధిని సాధించడమే మన ముందున్న ఒక నిజమైన సవాల్.

సమస్యను భిన్న రీతుల్లో, మరింత ప్రభావశీలంగా పరిష్కరించుకునేందుకు ఒక అవకాశాన్ని ఈ సవాల్ మనకు కల్పిస్తున్నది. ఇప్పటి

వరకు మనం అనుసరించిన పట్టణ పారిశుధ్య నమూనా చాలా వ్యయభరితమైనది వివిధ నగరాలలో మానవ విసర్జనాలు పర్యావరణానికి, మానవ ఆరోగ్యానికి తీవ్ర సమస్యలను సృష్టిస్తున్నాయి. వాటిని సరైన విధంగా వదుల్చుకోవడం జరగడం లేదు. టాయ్‌లెట్ సదుపాయాలనే పారిశుధ్య వసతులుగా పొరపడడం వల్లే ఇది జరుగుతోంది. వాస్తవమేమిటంటే టాయ్‌లెట్స్ అనేవి విసర్జనాలను తీసుకునే పాత్రలు మాత్రమే. మనం నీటిని పోసినప్పుడు ఆ విసర్జనాలు మోరీ (మురుగుకాలువ)లోకి ప్రవహిస్తాయి. సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టిపి)తో అది అనుసంధానమై ఉండవచ్చు లేదా ఉండకపోవచ్చు. ఆ ఎస్‌టిపి సైతం పనిచేస్తుండవచ్చు లేదా పనిచేయకపోవచ్చు. దీన్ని బట్టి మానవ విసర్జనాలు, గృహ కార్యకలాపాల సంబంధిత వ్యర్థ పదార్థాలను భద్రంగా వదిలివేయడం లేదని అర్థమవుతుంది. వాటిని అలానే సమీప నది లేదా సరస్సు లేదా చెరువులోకి వదిలివేయడం జరుగుతోంది. అవి కలుషితమవుతున్నాయి. పెరిగిన కాలుష్యంతో వ్యాధులు ముసురుతున్నాయి.

అయితే, నేను ఇప్పటికే చెప్పినట్టు ఈ సమస్య మనకొక అవకాశం. భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ– ఇది చాలా వ్యయంతో కూడుకున్నది. మరింత స్పష్టంగా చెప్పాలంటే మన పురపాలక సంఘాల ఆర్థిక తాహతుకు మించినది– అభివృద్ధి పరచుకునేంతవరకు వేచి ఉండే బదులు ఆ విసర్జనాలను మరో మార్గంలో వదుల్చుకోవచ్చు. చాలా గృహాలలో సెప్టిక్ ట్యాంక్‌లు ఉన్నాయి. అవి నిండిన తరువాత మల పంకాన్ని శుద్ధి ప్రక్రియకు పంపించవచ్చు. తద్వారా ఆ విసర్జన పదార్థాన్ని భద్రంగా పునః ఉపయోగించుకోవచ్చు. మానవ విసర్జనాలలో బలవర్థక పోషక పదార్థాలు ఉంటాయి. వాటిని మనం నిర్లక్ష్యంగా జల వనరులలోకి వదిలివేయడం వల్ల నత్రజని వలయం విచ్ఛిన్నమవుతోంది. మానవ విసర్జనాలను మనం మళ్లీ భూమి మీదకు తెచ్చి ఎరువుగా ఉపయోగించుకోవచ్చు. తద్వారా నత్రజని వలయాన్ని యథాతథంగా కాపాడుకోవచ్చు. ఆ మల పంకాన్ని ఉపచారం చేసిన తరువాత సేంద్రియ ఎరువుగా ఉపయోగించుకోవచ్చు.

ప్రాచీన రోమ్, Edo (ఈ ప్రాచీన నగరంనుంచే ఆధునిక టోక్యో ఉద్భవించి, అభివృద్ధి చెందింది)ల నుంచి మనం నేర్చుకోవాలి. సుదూర ప్రాంతాల నుంచి తమ ఆవాస స్థలాలకు నీటిని తీసుకువచ్చేందుకు రోమన్లు భారీ యాక్విడక్ట్ (ఒక నీటి కాలువపై నుండి నీటిని పారించటానికి కట్టబడిన కృత్రిమ కాలువ)లు నిర్మించారు. రోమన్లు చాలా పటిష్ఠమైన నీటి సరఫరా వ్యవస్థను అభివృద్ధి పరచుకున్నారని పలువురు ప్రశంసించడం కద్దు. అయితే ఆ యాక్విడక్ట్‌లు రోమన్ల ప్రతిభా పాటవాలకు కాకుండా పర్యావరణ దుర్నిర్వహణకు తార్కాణాలుగా చెప్పి తీరాలి. టైబర్ నదిపై రోమ్ నగరాన్ని నిర్మించారు. కనుక ఎటువంటి యాక్విడక్ట్ అవసరం లేదు. రోమ్ నగర వ్యర్థ పదార్థాలు అన్నిటినీ టైబర్‌లోకి వదిలివేయడం జరిగేది. తత్కారణంగా నది కలుషితమైపోయి ఆ నదీ జలాలు తాగడానికి పనికి వచ్చేవికావు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి యాక్విడక్ట్‌ల ద్వారా నీటిని తమ ఆవాసప్రాంతాలకు పారించుకునే వారు. ఫలితంగా నీటి నిర్గమన మార్గాలకు పెద్దగా ఆస్కారముండేది కాదు. రోమన్ సంపన్నులు బానిసల ద్వారా ఆ సదుపాయాన్ని ఏర్పాటు చేసుకునేవారు. సంప్రదాయ జపనీస్ సమాజం ప్రాచీన రోమన్ల ఆనవాయితీకి పూర్తి భిన్నంగా వ్యవహరించేది. జపనీయులు ఎట్టి పరిస్థితులలోనూ వ్యర్థాలను నదులలోకి వదిలివేసే వారు కాదు. ఆ వ్యర్థాలను ఎరువులుగా చేసుకుని వ్యవసాయంలో ఉపయోగించుకునేవారు. ప్రాచీన జపాన్‌లో ప్రజలందరికీ నీటి సరఫరా సమానస్థాయిలో జరిగేది. నీటికి, సంస్కృతికి సన్నిహిత సంబంధమున్నది. ఈ దృష్ట్యా నీటి కొరత అనేది కేవలం అనావృష్టి ఫలితం కాదు. అది సమాజ వైఫల్యమే. తమ నీటి వనరులను సంరక్షించుకుని, సరైన విధంగా ఉపయోగించుకోవడంలో వైఫల్యమే నీటి ఎద్దడికి కారణమవుతోంది. వ్యర్థాలకు సంబంధించి సువ్యవస్థిత నిర్వహణ పద్ధతిని రూపొందించుకోనంతవరకు మన నదులను కాలుష్యాల బారి నుంచి కాపాడుకోలేమన్నది మనం తెలుసుకోవలసిన ముఖ్య విషయం. నీటి అవసరాల విషయంలో భద్రమైన భవిష్యత్తును నిర్మించుకోవడమనేది మన జల విజ్ఞత పైనే కాదు వ్యర్థాలను పునరుపయోగించుకునే వివేకంపైన కూడా ఆధారపడి ఉన్నది.


– సునీతా నారాయణ్
'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు



## సాంకేతిక రంగంలో సరికొత్త విప్లవం...

# బ్లాక్ చెయిన్ టెక్నాలజీ...!

సెలయేటి ఒడ్డున కూర్చుని పంట పొలాలకు ప్రవహించే నీటిని గమనించినట్లయితే పాతనీరు వెళుతుంటే, కొత్తనీరు వచ్చిచేరుతూ పంటపొలాలను సస్యశ్యామలం చేస్తూ ఉంటుంది. అదే విధంగా సాంకేతిక రంగంలో కూడా ఏదైనా ఒక కొత్త ఆవిష్కరణ వచ్చినపుడు దాని గురించి ఆలోచించేలోపే మరొక కొత్త ఆవిష్కరణ మనకు అందుబాటులోకి వస్తూ.. మానవాళికి మరింత సుఖాన్ని, సౌఖ్యాన్ని అందిస్తున్నాయనడం ఎంత మాత్రం సత్యదూరం కాదు. ఇక కంప్యూటర్ వచ్చాక మన సమాజం యొక్క తీరుతెన్నులే మారిపోయాయి. గంటలో చేసే పనిని, కంప్యూటర్ క్షణకాలంలో చేసేస్తుండడంతో సమాజం కంప్యూటర్ చుట్టూ పరిభ్రమిస్తోంది. అయితే ప్రతినాణేనికి బొమ్మా, బొరుసూ ఉన్నట్లుగానే ప్రతి కొత్త ఆవిష్కరణ వెనుక కూడా కొన్ని అనుకూలతలు, మరికొన్ని ప్రతికూలతలు ఉంటాయి. కంప్యూటర్ విషయానికే వస్తే కంప్యూటర్‌లో మనం దాచుకొన్న విలువైన సమాచారాన్ని హ్యాకింగ్ పేరుతో తస్కరించడం ఇటీవల పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలో హ్యాకింగ్, వైరస్, స్పామ్ లాంటి చికాకుల నుండి కంప్యూటర్ ద్వారా జరిగే వివిధ ప్రక్రియలను సురక్షితంగా నిర్వహించడానికి పరిశోధకులు సరికొత్తగా తీసుకువచ్చిన టెక్నాలజీయే బ్లాక్ చైన్ టెక్నాలజీగా చెప్పవచ్చు. బ్లాక్‌చైన్ టెక్నాలజీ వల్ల కలిగే బహుళ ప్రయోజనాలను మనం కూడా. తెలుసుకుందామా




### అసలు బ్లాక్ చైన్ టెక్నాలజీ అంటే

అంతర్జాలం ద్వారా కొన్ని సమూహా (బ్లాక్స్)లలో సమాచారాన్ని నమోదుచేసి, ఆ సమూహాలన్నింటిని ఒక గొలుసుకట్టు (చైన్) విధానంలో కలుపుతూ మనం నమోదు చేసిన సమాచారాన్ని సురక్షితంగా భద్రపరిచేటటువంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని బ్లాక్ చైన్ టెక్నాలజీ అంటారు. 1997వ సం॥రంలో యాడం బ్యాక్ అనే సాంకేతిక నిపుణుడు హ్యాష్ క్యాష్ (Hash cash) అనే ఒక అల్గారిథమ్ (కంప్యూటర్‌కు ఇచ్చే ఆదేశాల సముదాయం) ను గుర్తించాడు. అంతకు మునుపే SHA256 అనే మరో అల్గారిథమ్ ఉండేది. ఈ రెండింటిని కలిపి "సతోషినకమొటో" అనే నిపుణుడు 2008లో "కన్సెన్సస్" అనే మరో అల్గారిథమ్‌ను రూపొందించాడు. ఈ 'కన్సెన్సస్" అనే అల్గారిథమ్ ఆధారంగా బిట్ కాయిన్ అనే సంస్థ క్రిప్టో కరెన్సీ (గుప్త ద్రవ్యం)ని వాడుకలోకి తీసుకు రావడంతో బ్లాక్ చైన్ టెక్నాలజీ విపరీతంగా ప్రాచుర్యంలోకి వచ్చింది.

### బ్లాక్ చైన్ టెక్నాలజీ ప్రత్యేకతలు

బ్లాక్ చైన్ టెక్నాలజీ ప్రత్యేకతల్ని తెలుసుకునే ముందు మన నిజ జీవితంలో జరిగే కొన్ని రోజు వారీ వ్యవహారాలను పరిశీలిద్దాం. మనం మన బ్యాంక్ ఖాతా నుండి మన స్నేహితుడి బ్యాంకు ఖాతాకు డబ్బును పంపాల్సి వచ్చినపుడు మనం బ్యాంక్‌ను వెళ్ళి సంప్రదిస్తే బ్యాంక్ మన ఖాతా నుండి మన స్నేహితుడి ఖాతాకు డబ్బును పంపించి, ఆ లావాదేవీని మన ఖాతాలో మనం డబ్బును పంపినట్లుగా, మన స్నేహితుడు డబ్బును స్వీకరించినట్లుగా ఇరువురి ఖాతాలలో నమోదుచేస్తుంది. ఈ ఖాతాలను ఆయా వ్యక్తులకు సంబంధించిన ఖాతా పద్దు (Private Ledger) గా వ్యవహరిస్తారు. ఈ ఖాతాలలో జరిగే మార్పులు మనకు మాత్రమే తెలుస్తాయి. అయితే ఈ ఖాతాలలో మనకు తెలియకుండా వేరెవరైనా తమకు అనుకూలమైన మార్పులు కూడా చేయవచ్చు. దానివల్ల మనం నష్టపోయే అవకాశం ఉంది. అయితే బ్లాక్ చైన్ టెక్నాలజీ విధానంలో ఎలాంటి మార్పులు చేర్పులకు అవకాశం ఉండదు. మన సమాచారమంతా సురక్షితంగా ఉంటుంది. కంప్యూటర్ ఎక్సెల్ షీట్‌లోని కాలమ్స్ (నిలువు వరుసలు) రో (అడ్డ వరుసలు) లలో సమాచారమంతా నమోదు చేసి, ఆ సమాచారాన్ని వివిధ కంప్యూటర్లకు పంపిన విధంగానే, బ్లాక్ చైన్ టెక్నాలజీలో వివిధ బ్లాకులలో సమాచారాన్ని నమోదు చేసి వాటిని గొలుసుకట్టు విధానంలో కలిపి వాటిని కంప్యూటర్లకు అనుసంధానిస్తారు. ఒక బ్లాకులో నమోదు చేసిన సమాచారం మిగిలిన బ్లాకులలో కూడా అందుబాటులో ఉంటుంది. కాబట్టి ఈ విధానంలో నమోదైన సమాచారాన్ని అందరికీ అందుబాటులో ఉండే ఖాతా పద్దు (Public Ledger)గా చెప్పవచ్చు. అందువల్ల ఒక బ్లాకులోని సమాచారాన్ని మార్చడానికి ప్రయత్నిస్తే, అది మిగిలిన బ్లాకులలోని వారందరికీ

తెలిసిపోతుంది. కాబట్టి మొదట్లో పేర్కొన్నట్లుగా మన ఖాతా నుండి మరొకరికి డబ్బు పంపాలంటే బ్యాంకు మధ్యవర్తిగా వ్యవహరిస్తుంది. కానీ బ్లాక్ చైన్ విధానంలో ఎలాంటి మధ్యవర్తి ప్రమేయం ఉండదు. బ్యాంక్‌లో మన ఖాతా నుండి మరొకరి ఖాతాకు డబ్బు పంపడానికి కొద్ది సమయం నిరీక్షించాల్సి ఉంటుంది. బ్లాక్‌చైన్ విధానంలో ఎలాంటి నిరీక్షణా అవసరం లేదు. బ్యాంకులో మన ఖాతా నుండి మరొకరి ఖాతాకు డబ్బును పంపినందుకుగానూ బ్యాంకు మన నుండి కొంత నగదును రుసుముగా వసూలు చేస్తుంది. బ్లాక్ చైన్ విధానంలో ఎలాంటి అదనపు రుసుములు వసూలు చేయడం జరగదు. అదే విధంగా ఈ విధానంలో బ్యాంక్, ఫోన్ పే, గూగుల్ పే లలో లాగా ఎలాంటి కేంద్రీకృత నియంత్రణా ఉండదు. సమాచారమంతా వికేంద్రీకృత విధానంలో ఉంటుంది.

**బ్లాక్ చైన్ టెక్నాలజీ పనిచేయు విధానం**

బ్లాక్ టెక్నాలజీ విధానంలో మొదట బ్లాకులను రూపొందిస్తారు. వాటిలో మొదటి బ్లాకును జెనిసిస్ బ్లాక్ అంటారు. ఈ విధానంలో ప్రతి బ్లాకు, తరువాత బ్లాకు తో ఒక గొలుసుకట్టు విధానంలో కలపబడి ఉంటుంది. ప్రతి బ్లాకుకు ఒక విశిష్ట గుర్తింపు సంఖ్య ఉంటుంది. దానినే హ్యాష్ కోడ్ అంటారు. దీనిని మన చేతి వేళ్ళకు ఉన్న వేలి ముద్రలతో పోల్చవచ్చు. మన చేతి వేలి ముద్రలు ఒకరితో మరొకరివి సరిపోల నట్టుగానే, బ్లాక్ చైన్ విధానంలో కూడా ప్రతి బ్లాకుకు వేర్వేరు హ్యాష్‌లు ఉంటాయి. ఆ విధంగా ప్రతి బ్లాకులోనూ





1. సమాచారం 2. హ్యాష్ కోడ్ 3. ముందు బ్లాకుకు సంబంధించిన హ్యాష్‌కోడ్ నిక్షిప్తమై ఉంటాయి. బ్లాక్ చైన్ విధానంలో అనుసంధానం చేయబడిన కంప్యూటర్లను "నోడ్‌లు" అని వ్యవహరిస్తారు. బ్లాక్ చైన్ టెక్నాలజీ విధానంలో ఏదైనా ఒక లావాదేవి (Transaction) జరిగినపుడు ఆ లావాదేవి నిర్ధారణ కావాలంటే ఒకటికంటే ఎక్కువ నోడ్‌లు ధృవీకరించాల్సి ఉంటుంది. అప్పుడు మాత్రమే ఈ లావాదేవీ పూర్తిఅయినట్లుగా చెప్పవచ్చు. ఈ విధంగా బ్లాక్ చైన్ విధానంలో జరిగే ప్రతి లావాదేవీని ధృవీకరించే వారిని "మైనర్స్" అని వ్యవహరిస్తారు.

బ్లాక్ చైన్ విధానంలో కొత్త బ్లాకులలో సమాచారాన్ని నమోదు చేసి వాటిని ముందు బ్లాకులకు జతచేయవచ్చు, కానీ బ్లాకులలోని సమాచారాన్ని మార్చడానికి ఎట్టి పరిస్థితుల్లో వీలుకాదు. ఒకవేళ మార్చాలని ప్రయత్నిస్తే ఏ బ్లాకులో ఉన్న సమాచారాన్ని మార్చాలని ప్రయత్నిస్తామో, ఆ బ్లాకు యొక్క హ్యాష్ కోడ్ వెంటనే మారిపోతుంది. ఎప్పుడైతే హ్యాష్ కోడ్ మారిపోతుందో, తరువాత బ్లాకులో ఇదివరకే పాత హ్యాష్ కోడ్ ఉంటుంది. అప్పుడు కొత్తగా వచ్చిన హ్యాష్ కోడ్, ముందున్న హ్యాష్ కోడ్‌తో సరిపోలదు. అప్పుడు ఏ బ్లాకులో సమాచారాన్ని మార్చాలని ప్రయత్నిస్తామో, అక్కడి నుండి దాని ముందున్న బ్లాకులకు సంబంధం పూర్తిగా తెగిపోతుంది. ఒకవేళ ప్రతిబ్లాకు కు హ్యాష్ కోడ్ తయారు చేసి, దాని ముందున్న బ్లాక్ హ్యాష్ కోడ్ మార్చి, ఆ బ్లాకులో డేటా నమోదు చేసి తద్వారా మిగిలిన బ్లాకుల్లోని డేటాని మార్చాలని ప్రయత్నించినా, ఒక బ్లాకుకు పై మూడు రకాల మార్పులను చేసేందుకు కనీసం 10ని॥ల సమయం పడుతుంది. దీనినే "ప్రూఫ్ ఆఫ్ వర్క్" అంటారు. కొన్ని సం॥రాల పాటు లావాదేవీలు జరిగినపుడు వేల సంఖ్యలో బ్లాకులు ఉంటాయి. వేల సంఖ్యలో నున్న బ్లాకులలోని సమాచారాన్ని మార్చడం అసంభవం అని చెప్పవచ్చు. అందులోనూ అందరికీ అనుసంధానమై ఉంటుంధి కాబట్టి ఏ మాత్రం మార్పు జరిగినా అది మిగిలిన వారికి తెలిసి పోతుంది.

**బ్లాక్ చైన్ టెక్నాలజీ అనువర్తనాలు**

బ్లాక్ చైన్ టెక్నాలజీకి తక్కువ సమయంలో పని పూర్తి చేయడం, విశ్వసనీయత, ఎలాంటి మార్పులు చేయుటకు వీలుకాని లావాదేవీలు, మోసపూరిత చర్యలను నిరోధించడం, పూర్తిస్థాయి భద్రత, పారదర్శకత మొ॥లగు అనేక విశిష్టతలున్నాయి. అందువల్ల బ్లాక్ చైన్ సాంకేతికతను మార్కెట్లలో బిల్లింగ్, మానిటరింగ్ డేటా బదిలీ చేయడానికి, ప్రభుత్వ సేవలకు సంబంధించి ఓటరు నమోదు ప్రక్రియలో నకిలీ ఓట్లను నిరోధించడానికి, వివిధ రకాల పత్రాలను డిజిటలైజ్ చేయడానికి, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) విధానంలో వ్యవసాయానికి సంబంధించిన డ్రోన్ సాంకేతికతను నిర్వహించడానికి, స్వయంచోదిత కార్లను నడపడంలోనూ, వ్యక్తిగత రోబోట్లను పని చేయించడానికి, ఆరోగ్య రంగంలో వ్యక్తుల సమాచార నిధిని భద్రపరచడానికి, డేటాను నిర్వహించడానికి, సైన్స్‌కు సంబంధించి సూపర్ కంప్యూటర్, క్లౌడ్ అనాలసిస్ చేయడానికి బ్లాక్ చైన్ సాంకేతికతను విరివిగా వినియోగిస్తారు. అంతే కాకుండా బ్లాక్ టెక్నాలజీ సహకారంతో బిట్ కాయిన్, ఎథీరియమ్, రిపుల్, వైట్ కాయిన్ వంటి క్రిప్టో కరెన్సీ (గుప్తధనం)లను ఎక్కువగా వాడుకలోకి తెస్తున్నారు. ముందే చెప్పుకున్నట్లు ఈ సాంకేతిక పరిజ్ఞానం వినియోగించినట్లయితే కంప్యూటర్లను హ్యాకింగ్, వైరస్‌ను చొప్పించడం, స్పామ్ లాంటి సైబర్ దాడుల నుండి రక్షించవచ్చు. 2016 సం॥లో దుబాయ్ సిటీ బ్లాక్ చైన్ టెక్నాలజీని ఉపయోగించి ఎంతో మంది ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను మరియు పెట్టుబడిదారులను అనుసంధానించి దుబాయ్ నగరంలో అనేక రకాలైన పరిశ్రమలను ప్రారంభించి, అభివృద్ధిని వేగవంతం చేయడం ద్వారా దుబాయ్ ని "ప్రపంచంలోనే అత్యంత సంతోష నగరంగా"




తీర్చిదిద్దారు. అదే విధంగా జనవరి 2017లో ఐక్యరాజ్యసమితి (యు.ఎన్.ఓ) యొక్క ప్రపంచ ఆహార కార్యక్రమం వారు మానవతా సహాయ నిధిని (Humanitarian Aid) ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా బ్లాక్ చైన్ టెక్నాలజీని వినియోగించి పాకిస్తాన్ సింధ్ ప్రాంతంలోని అత్యంత వెనుకబడిన గ్రామీణ ప్రాంతాలను ప్రగతి పథంలోకి తీసుకొచ్చారు. బ్లాక్ చైన్ విధానంలో నమోదైన లబ్ధిదారులు డబ్బు, ఆహార పదార్థాలతో పాటు ఇతర అన్ని రకాల లావాదేవీలను సురక్షిత విధానంలో పారదర్శకంగా నిర్వహించుకొని పేదరిక విషవలయం నుండి బయటపడ్డారని యు.ఎన్.ఓ. తెలిపింది.

**పరిమితులు**

బ్లాక్ చైన్ టెక్నాలజీ వల్ల బహుళ ప్రయోజనాలతో పాటు కొన్ని పరిమితులు కూడా ఉన్నాయి.





బ్లాక్ చైన్ విధానంలో జరిగే లావాదేవీలను కంప్యూటర్లు ధృవీకరించడానికి ఎక్కువ సమయం పడుతుంది. అందువల్ల దాని విద్యుత్తు వినియోగం కూడా పెరుగుతుంది. గ్లోబల్ వార్మింగ్ అంతర్జాతీయంగా ప్రమాద ఘంటికలు మోగిస్తున్న నేపథ్యంలో అభివృద్ధి చెందుతున్న దేశాలకు బ్లాక్ టెక్నాలజీకి అవసరమైన ఇంధనం సమకూర్చుకోవడం పెనుసవాలుగా మారనుంది.

ప్రతి లావాదేవీ వేగం కూడా ఇక్కడ సమస్యగా మారే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. గొలుసుకట్టు విధానంలో ఉన్న బ్లాక్‌లన్నిటిలో వచ్చిన సమాచారం ధ్రువీకరించాల్సి ఉంటుంది. కాబట్టి ఇందుకు సమయం ఎక్కువ తీసుకోవడం వల్ల లావాదేవీల యొక్క వేగం తగ్గే అవకాశం ఉంది. బ్లాక్ చైన్ టెక్నాలజీ విధానంలో నగదు లావాదేవీలు నిర్వహించేటపుడు ప్రతి లావాదేవీకి ఒక రహస్య గుర్తింపు సంఖ్య జారీ చేయబడుతుంది. ఈ రహస్య గుర్తింపు సంఖ్యను జాగ్రత్తగా భద్రపరచాలి. ప్రమాదవశాత్తు జరిగే సంఘటనలవల్ల ఈ గుర్తింపు సంఖ్యను మనం కోల్పోయినట్లయితే దాని ద్వారా జరిగే నగదు లావాదేవీలు కూడా ప్రమాదంలో పడే అవకాశం ఉంది. మరోవైపు డిమాండ్ – సప్లై సూత్రాన్ని అనుసరించి బ్లాక్ చైన్ టెక్నాలజీ విధానంలో లావాదేవీల సంఖ్య పెరిగే కొద్దీ కంప్యూటర్ల నిర్వహణకయ్యే ఖర్చు కూడా పెరిగే అవకాశం ఉందని సంబంధిత నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు.

**చివరిగా**

చిన్న చిన్న లోపాలను సవరిస్తే, బ్లాక్ చైన్ టెక్నాలజీ వల్ల నేటి సమాజానికి బహుళ ప్రయోజనాలు ఒనగూరే అవకాశం ఉంది. భద్రత, పారదర్శకతల సమ్మిళితమైన బ్లాక్ చైన్ టెక్నాలజీ విధానం ద్వారా మానవాళికి మహోపకారం జరగాలని, తద్వారా సమాజం ప్రగతి పథంలో కొత్త పుంతలు తొక్కాలని మనమూ ఆశిద్దాం.

**– పుట్టా పెద్ద ఓబులేసు,**
m : 9550290047
e : obu.jmd@gmail.com

చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో బాలచెలిమి ప్రచురించిన 'గాడిద తెలివి', 'అంతరిక్ష దొంగలు' (2018 నవంబర్), 'గుల్లేరు బాలుడు', 'టంగ్ యంగ్' (2018 డిసెంబర్) అనే నాలుగు కథల పుస్తకాలు వెలువడినందుకు సంతోషం వ్యక్తం చేస్తున్నాము. ప్రతులు కావల్సిన వారు ఈ క్రింది చిరునామా నుండి పొందవచ్చును.

విడి ప్రతి వెల: రూ.30/-
'Bhoopathi Sadan' 3-6-716, Street No.12, Himayathnagar, Hyderabad-500029, Telangana. Mob: 9030626288
మరియు
• Nava Telangana • Manchi Pustakam
• Nava Chetana • Navodaya Book House



# దిల్లీలో ఉన్న మన 'హైదరాబాద్ హౌస్'

దేశాధినేతలతో దౌత్య సంబంధాలకైనా, విదేశీ ప్రముఖులతో ఛాయ్ పే చర్చలకైనా.. విలేకరుల సమావేశాలైనా, ముఖ్య కార్యక్రమాలైనా అన్నింటికీ ఒకటే వేదిక. అదే దిల్లీలో ఉన్న హైదరాబాద్ హౌస్. ఏ దేశ అధ్యక్షులైనా మన దేశంలో పర్యటిస్తే దీని గడప తొక్కాల్సిందే. అతిథిగా రాచమర్యాదల రుచి చూడాల్సిందే. నిజాం ప్రభువుల కలల సౌధంగా రూపుదిద్దుకున్న ఈ కట్టడం దేశ రాజధాని నగరంలో హైదరాబాద్ దర్పానికి ప్రతిబింబంగా నిలుస్తోంది.

**వందేళ్ల చరిత్ర..**

దిల్లీ నగరం నడిబొడ్డున దాదాపు ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ హైదరాబాద్ హౌస్ ఎందరో ప్రముఖులకు ఆహ్వానం పలికింది. అందులో అమెరికా మాజీ అధ్యక్షులు ఒబామా, డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, ఇజ్రాయెల్ మాజీ అధ్యక్షుడు నెతన్యాహు ఉన్నారు. దౌత్యపరమైన చర్చలు, ఒప్పందాలకు గంభీరమైన ఈ ప్యాలెస్ వాతావరణమే సరైందని అధికారులు భావిస్తారు. వందేళ్ల చరిత్ర ఉన్న ఒకప్పటి ఈ రాజమహల్‌ను చివరి నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ ఎంతో ఇష్టపడి కట్టించుకున్నాడు. అప్పట్లోనే ఈ నిర్మాణం కోసం రూ. 1.20 కోట్లకు పైనే వెచ్చించారంటే మాటలు కాదు. సీతాకోకచిలుక ఆకారంలో, చూడగానే రాజసం ఉట్టిపడేలా ఉండే దీని నిర్మాణ శైలి చూపరులను విశేషంగా ఆకట్టుకుంటుంది.

**అప్పట్లోనే కోటి దాటింది..**

దిల్లీలో తమ విడిది కోసం ఒక భవనం ఉండాలని భావించిన ఏడో నిజాం ఈ భారీ కట్టడానికి శ్రీకారం చుట్టాడు. అందుకోసం విదేశీ వాస్తు శిల్పి ఎడ్విన్ లుటియెన్స్‌కు ఈ బాధ్యతలను అప్పగించాడు. యూరోపియన్– మొఘలుల శైలిని కలగలుపుతూ దీనిని నిర్మించారు. ఎత్తైన గుమ్మటం దీని ప్రధాన ఆకర్షణ. బర్మా నుంచి తెప్పించిన టేకును ఇందులో వినియోగించారు. లండన్, న్యూయార్క్‌ల అలంకరణ శైలిని అనుసరించారు. ఇలా రూ. 26 లక్షల అంచనా వ్యయంతో మొదలైన నిర్మాణం రూ. కోటి దాటింది. 1926లో నిర్మాణం ప్రారంభించగా రెండేళ్లలో పూర్తి చేశారు. రాణుల కోసం 4 అంతఃపుర మందిరాలతో కలిపి 36 గదులు నిర్మించారు.


**నిజాం కుమారుల మెప్పు పొందలేక..**

విదేశీ ప్రముఖులకు ఎంతగానో నచ్చిన ఈ ప్యాలెస్‌ను నిజాం రాజు కేవలం నాలుగు సార్లు మాత్రమే సందర్శించాడు. ఇస్లాం సంప్రదాయ పద్ధతికి కాస్త భిన్నంగా, ఆధునిక యూరోపియన్ శైలిలో నిర్మించడంతో ఇందులో ఉండేందుకు నిజాం కుమారులు ఇష్టపడలేదు. దీంతో స్వాతంత్ర్యం అనంతరం ఇది హైదరాబాద్ హౌస్‌గా మారింది.

– దక్కన్‌న్యూస్, m : 9030 6262 88
e: desk.deccan@gmail.com

# నాలుగు గొప్ప చోళ దేవాలయాలు

మనదేశంలో విలసిల్లిన మూడు దేవాలయ శైలుల్లో నాగరపద్ధతిలో వింధ్య పర్వతాల నుంచి కృష్ణానది వరకు, ద్రావిడ పద్ధతిలో కృష్ణానది నుంచి కన్యాకుమారి వరకు ఆలయాలు నిర్మించబడినాయి. క్రీ.శ.4-5 శతాబ్దాల్లో ప్రారంభమైన ఈ దేవాలయ నిర్మాణం తమిళ నాట క్రీ.శ.13-14 శతాబ్దాలకు పతాకస్థాయికి చేరుకొన్నాయి. ముందు ఇటుక, కొయ్యలతో ప్రారంభమై గుహాలయాలు, రాతి ఆలయాలుగా రూపు దిద్దుకొని, రానురాను ఆగమశాస్త్రాల్లో పేర్కొన్న పూజ, పునస్కారాల కోసం, ఆలయం కూడా గర్భాలయ, అర్థ, మహామండపాలకు తోడు అనేక కట్టడాలు చేరి, గోపురాలతో కూడి విశాల ఆలయ సముదాయానికి దారి తీసింది. ఇలా క్రమవికాసం పొందిన ద్రావిడ ఆలయాల్లో 4 గొప్ప చోళ దేవాయాలపై నా ప్రసంగం కొనసాగుతుంది.




ఆలయాల నిర్మాణాన్ని ప్రోత్సహించిన రాజులను తలచుకొంటామేగానీ, అద్భుత కళానైపుణ్యంతో, దేవాలయ వాస్తు, శిల్పాన్ని మన కందించిన శిల్పుల గురించి పట్టించుకోం. ముందుగా నేను, దాక్షిణాత్య దేవాలయాలను నిర్మించిన శిల్పులకు నమస్కరిస్తున్నాను. శిల్పులు, వాస్తుశాస్త్రం, శిల్పశాస్త్రం, నాట్యశాస్త్రం, సంగీతం, ప్రతిమా లక్షణం, ప్రతిమామాన శాస్త్రం, గణితం, జ్యామెట్రీ, చిత్రకళ, పురాణాలు, ఆగమాలు తెలిసి ఉండాలి. గురుపరంపర ద్వారా ఇన్ని విద్యలూ నేర్చుకొన్న శిల్పులకు మరోసారి నమస్కరిస్తున్నాను.

పోషకులకు కావలసిన రీతిలో నిర్మించేపుడు, శిల్పులు - స్థపతులు తమ శక్తి యుక్తులు, సౌందర్యాన్ని జోడించి అత్యంత అందంగా ఆలయాలను నిర్మించటంవలన ఒక్కో దేవాలయం, ఒక్కోరకంగా, ఆకర్షణీయంగా ఉంటుంది.

ఆలయ నిర్మాణాన్ని గురించి చెప్పుకొనేప్పుడు విమానం, గోపురాల మధ్య తేడాతో పాటు గర్భాలయం, అర్థమండపం, మహామండపం, ముఖమండపం, నృత్యమండపం, కళ్యాణ మండపం, సోపాన మండపాల గురించి తెలుసుకోవాలి. గర్భాలయం మీద నిర్మించేదాన్ని విమానమని, ప్రాకారంలో ప్రవేశద్వారం పైన నిర్మించే దాన్ని గోపురమని, ఆలయం ముందు వివిధ కార్యక్రమాల కోసం స్థంభాలతో నిర్మించేదాన్ని మండపం అంటారు.

**ఆలయ భాగాలు:**

మనిషి పాదాలపై నిలబడిన రూపంలోనే ఆలయాన్ని కూడ, అధిష్ఠానంపైన పాదవర్గం, ప్రస్తరం, కంఠం, శిఖరం, శిఖ (కలశం)లతో నిర్మించటాన్ని 'దేహోదేవాలయం ప్రోక్తః' అన్న ఉపనిషద్వా క్యానికి నిరూపణ గా చెప్పాలి.

**తమిళనాట ఆలయ వాస్తు వికాసం :**

సంగమకాలం (క్రీ.శ.5వ శతాబ్ది)లో ప్రారంభమైన ఆలయ నిర్మాణం, పల్లవుల తరువాత తమిళ నాడును పాలించిన చోళుల కాలంలో మునుపెన్నడూ లేనంతగా ఊపందుకొని, సర్వాంగ సహితంగా విశాల ఆవరణ, ప్రాకార, గోపురాలతో విలసిల్లింది.

చోళులకాలం (క్రీ.శ.800-1200)లో నిర్మించిన ఆలయాలు, గ్రానైటు రాతితో, అధిష్ఠానం నుంచి శిఖరం వరకూ, గర్భాలయం నుంచి గోపురం వరకూ ఒక ప్రత్యేక పద్ధతిలో నిర్మించబడినాయి. అధిష్ఠానం, పాదవర్గం, ద్వారాలు, కవులు, మండప స్థంభాలు, విమాన శిఖరాల నిర్మాణంలో అనేక ప్రయోగాలు చేసి అత్యంత రూప లావణ్యాన్ని ఇనుమిడించి నిర్మించబడిన అనేక చోళ దేవాలయాల్లో, నాలుగు దేవాలయాలు మణిమకుటాలుగా వెలుగొందుతూ, ప్రపంచ ప్రఖ్యాతిగాంచాయి.

రాజరాజేశ్వరం (బృహదీశ్వరా లయం), తంజావూరు, ఐరావతేశ్వరాలయం, దారాసురం, చోళీశ్వరం, గంగైకొండ చోళపురం అనే మూడు చోళదేవాలయాలు, ప్రపంచ వారసత్వ కట్టడాల జాబితాలో చోటు దక్కించుకొన్నాయి. ఇవి కాక, త్రిభువనంలోని కంపహరేశ్వరాలయం కూడా చోళదేవాలయ వాస్తు పతాక స్థాయికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు. వివరాలు:

**1. రాజరాజేశ్వరం, తంజావూరు:**

అతిపెద్ద శివలింగంతో, అత్యంత ఎత్తైన విమానంతో, అత్యంత విశాలంగా, అన్ని హంగులతో నిర్మించటాన ఈ ఆలయాన్ని రాజరాజేశ్వరమని పిలిచినా, తరువాత తంజావూరును పాలించిన మహారాష్ట్రులు ఈ ఆలయాన్ని బృహదీశ్వరాలయమని పిలవటం సబబే. 216 అడుగుల ఎత్తున్న 13 అంతస్తుల ఆలయం,

|  |  |  |
|---|---|---|
| *రాజరాజేశ్వరాలయం, తంజావూరు* | *దారాసురం దేవాలయం* | *ఐరావతేశ్వరాలయం* |

భారతదేశంలోనే ఎత్తైన ఆలయంగా గుర్తించబడిరది.

ద్వారపాలకులు, మహామండపం, నందమండపం, ఒకటేమిటి, ఈ ఆలయంలో అన్నీ పెద్ద పరిమాణంలో తీర్చిదిద్దినవే. అలిందం (లోపల తిరగటానికి వీలుగా) తో కూడిన గర్భాలయం, అటూ ఇటూ ప్రవేశద్వారాలు, మధ్యలో అంతరాళం, మహామండపం, నిత్య మండపం, సోపాన మండపం, నందమండపం, సుబ్రహ్మణ్య, దేవీ ఆలయాలు, కరువారూరు ఆలయం, రెండు ప్రాకారాలు, గోపురాలు, ప్రాకార మండపాలతో, రాజరాజ చోళుని ఆలోచనలకు అద్దం పడుతుంది రాజరాజేశ్వరం. ధ్వజస్థంభ, బలిపీఠాలు కూడ ఆలయ పరిమాణానికి తగ్గట్టుగానే నిర్మించబడినాయి. గర్భాలయం చుట్టూ ప్రదక్షిణా పథం వల్ల ఈ ఆలయాన్ని సాంధార ఆలయ మంటారు. ఇదో ప్రత్యేకత. ఆలయ మొదటి అంతస్థులో, చుట్టూ గల గోడలపై వర్ణచిత్రాలు, 81 నాట్య కరణాలు, ఆనాటి ఆలయ సంప్రదాయ నృత్యమైన భరతనాట్యానికి అద్దం పడుతున్నాయి. రాజరాజ చోలుని రాజ గురువైన కరువారూరు వర్ణచిత్రం కూడా ఇక్కడ లభించింది.

ప్రధానాలయాన్ని రాజరాజ చోళుడు క్రీ.శ.985-1015 మధ్య నిర్మించగా, ఆలయ సముదాయంలోని అమ్మవారి ఆలయాన్ని పాండ్యులు, నంది మండపం, సుబ్రహ్మణ్యాలయాలను నాయక రాజులు, నృత్య మండపం, గణపతి ఆలయాలను మరాఠా రాజులు నిర్మించారు.

### 2. చోళీశ్వరం, గంగైకొండ చోళపురం

రాజరాజచోళుని కుమారుడ్కెన మొదటి రాజేంద్రచోళుడు, తాను ఉత్తర కోస్తాలో బెంగాల్‌లోని గంగాతీరం వరకు జయించి, గంగనుంచి నీటిని తీసుకు వచ్చి, అందుకు గుర్తుగా ఒక పట్టణాన్ని నిర్మించి దానికి గంగైకొండ చోళపురమని పేరు పెట్టి, తన రాజధానిని తంజావూరు నుంచి అక్కడికి తరలించి, తండ్రిలాగే, తాను కూడా అదే తీరులో ఒక ఆలయాన్ని నిర్మించి, చోళేశ్వరమని పిలిచాడు. ముమ్మూర్తులా, తంజావూరు రాజరాజేశ్వరాలయాన్ని పోలినట్లే, ఈ ఆలయాన్ని రాజేంద్రచోళుడు నిర్మించాడు. రెండు ప్రాకారాలతో ఉన్న ఈ ఆలయంలో, ప్రవేశగోపురం, బలిపీఠం, నంది, మహా మండపం, అర్థ, ముఖ మండపాలు, గర్భాలయం, తెన్ కైలాసం, గణపతి, వడ కైలాసం, చండీశ, దుర్గ, సింహ కిన్నెర ఆలయాలతో విలక్షణ వాస్తుకు ఉదాహరణగా గంగై కొండ చోళపురం ఆలయాన్ని చెప్పుకోవచ్చు.

### 3. ఐరావతేశ్వరం, దారాసురం

రెండోరాజరాజు, తన రాజధానిని దారాసురానికి మార్చి, ప్రాకారం, ప్రాకర మండపంలోపల, గర్భాలయ, అర్ధమండప, అంతరాళ (సోపానమండపం) మహామండపం, సభామండపం, గోపురాలతో, ఇతర ఉపాలయాలతో, రథాకారంలో నిర్మించిన ఈ ఆలయం చోళ ఆలయ వాస్తులో ప్రత్యేకతను సంతరించుకొన్నది. చక్రాలతో అలరారుతున్న రథాకార మండపాన్ని రాజగంభీరమండపం అంటారు. చుట్టూ ప్రదక్షిణం చేసి, మండపం ద్వారంలోనికి ప్రవేశించిన వారికి చోళ ఆలయ వాస్తు, శిల్పకళల గొప్పదనం గోచరిస్తుంది. స్థంభాలు, ద్వారాలు, కవుల, అధిష్ఠానం, పాదవర్గంపైన గల శిల్పాలు, 63 నాయన్మార్ల శిల్పాలు, లక్ష్మి, గంగ, అగస్త్య, మురుగ, దక్షిణామూర్తి, భిక్షాటన మూర్తి, శరభేశ్వర శిల్పాలు కనువిందు చేస్తాయి.

### 4. కంపహరేశ్వరాలయం, త్రిభువనం

కుంభకోణానికి 15 కి.మీ.ల దూరంలో గల త్రిభువనంలో, మూడో కులోత్తుంగుడు నిర్మించిన కంపహరేశ్వరాలయం కూడ పై మూడు దేవాలయల సరసన నిలిచే ఆలయమే. చుట్టూ ఉన్న శిల్పాల్లో సోమసూత్రాన్ని మూడు దశల్లో చూపించటం అద్భుతమే. గర్భాలయం, అర్ధమండపం, విశాలమైన మహామండపం, సోపానమండపం, నంది, గోపురం, ప్రాకారం, ఉపాలయాలు చూడముచ్చటగా నిర్మించ బడినాయి. పాండ్యులపై సాధించిన విజయానికి గుర్తుగా నిర్మించిన ఈ ఆలయ కప్పులపై ఆ దృశ్యాలన్నీ ఉన్నాయి. గర్భాలయంపైన గల శిఖరాన్ని బంగారు మయం చేయటం మరో ప్రత్యేకత.

ఈ విధంగా, తంజావూరు, గంగైకొండ చోళపురం, దారాసురం త్రిభువనంలలో నిర్మించిన ఈ ఆలయాలు, చోళ ఆలయ వాస్తు శిల్ప పరాకాష్ట దశకు మచ్చుతునకలు. ఈ నాలుగు దేవాలయాల్ని చూస్తే చోళులు నిర్మించిన మొత్తం ఆలయాలను చూచినట్లే.

**– శివశంకరబాబు**
తమిళ హెరిటేజ్‌ట్రస్టు

**తెలుగు సేత: డా. ఈమని శివనాగిరెడ్డి, స్థపతి**





# నదుల పరిరక్షణ తక్షణ అవసరం



ప్రతి సంవత్సరం పర్యావరణ ప్రేమికులు, కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థలు జూన్ 5న పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. ప్రతి సంవత్సరం ఏదో ఒక అంశంపై దృష్టి పెడుతున్నట్లే ఈ సంవత్సరం థీమ్ 'ఓన్లీ వన్ ఎర్త్'. ఈ సమస్త విశ్వంలో ప్రాణకోటికి జీవించగల అవకాశం ఉన్నది ఈ ఒకే ఒక్క భూమిపై మాత్రమే. ఈ భూమిపై గల ప్రకృతి వనరులను పరిరక్షించుకుంటూ మానవాళి సహజీవనం చేయాల్సి వుంటుంది. నిజానికి ఏం జరుగుతోంది?

ప్రకృతి వనరుల సంరక్షణ కంటే వినియోగం పేరుతో వనరుల దోపిడీకే ప్రభుత్వాలు ఎక్కువ ఆసక్తి చూపుతున్నాయి. సాగునీటి ప్రాజెక్టులు, రోడ్ల నిర్మాణం కోసం, మైనింగ్, ఇతర పరిశ్రమల అవసరాలకోసం, గృహ నిర్మాణాల కోసం యథేచ్ఛగా అడవులు నరుకుతున్నాం. ప్రకృతి సమతుల్యతను దెబ్బతీస్తూ గుట్టలను, భూగర్భంలోని ఖనిజ సంపదను అందినంత తోడేస్తున్నాం. నదులను, జలవనరులను నాశనం చేస్తున్నాం. అధికోత్పత్తి పేరుతో యాభై ఏళ్ళుగా భూమిని రసాయనిక ఎరువులు, పురుగు మందులతో విషతుల్యం చేశాం. భూగర్భజలాల సంరక్షణ, పెంపు వంటి ఎంతో ముఖ్యమైన పనిని గాలికొదిలేసి పాతాళంలోని నీటిని సైతం తక్షణ అవసరాలకు తోడేస్తున్నాం. ఆ నీటిలోని ఫ్లోరైడ్, ఇతర రసాయనాలతో, కాలుష్య కారకాలతో రోగాలు తెచ్చుకుంటున్నాం. థర్మల్ పవర్ కోసం లక్షలాది టన్నుల బొగ్గు నిల్వలను వెలికితీసి బూడిద చేస్తున్నాం, వాతావరణాన్ని, భూమిని మరింత వేడెక్కిస్తున్నాం, జీవావరణను ధ్వంసం చేస్తున్నాం. సంపద సృష్టి పేరుతో సమస్త ప్రకృతి వనరులను సర్వనాశనం చేస్తున్నాం. భావితరాలు మనల్ని క్షమించలేనంతగా దిగజారుతున్నాం. ప్రకృతిలో పంచభూతాల్లో నీరు, నదులు ముఖ్యమైన భాగం. గత కొన్నేళ్ళుగా నదులు, జలవనరుల రంగంలో కృషి చేస్తున్నందున నా అవగాహనను పంచుకునే ప్రయత్నం చేస్తాను.

మానస సరోవరం వంటి ఎంతో పవిత్రమైన, స్వచ్ఛమైన ప్రకృతి నుండి జనించిన సింధూ, బ్రహ్మపుత్ర నదులు, హిమాలయాల్లోని గోముఖి పర్వతాల్లో మొదలయ్యే భాగీరథి, మరోనది అలకానందల సంగమంతో దేవప్రయాగ వద్ద ప్రారంభమయ్యే పవిత్ర గంగానది, పశ్చిమ, తూర్పు కనుమల్లో జనించిన అనేక నదులు, ఉపనదులు ఈ దేశ ప్రజల నాగరికతకు, సంస్కృతికి మూలం. మన పూర్వీకుల చరిత్ర ఆనవాళ్ళను ఈ నదుల తీరాల్లోనే వెదుక్కుంటున్నాం. నదిని కన్నతల్లిలా, దేవతలా భావించిన పూర్వీకుల వారసులం మనం. పుట్టుక నుంచి చావుదాకా విడదీయరాని అనుబంధమే మనిషికి నదికి మధ్యగల సంబంధం. సంచార జీవితాలకు స్థిరత్వాన్ని నేర్పింది నది. వేటాడే మనస్తత్వాలకు వ్యవసాయం వైపు మరల్చింది నది. ఉత్పత్తి జ్ఞానాన్నిచ్చి మనిషిని ఉన్నత శిఖరాలకు చేర్చింది నది. విజ్ఞాన నిలయమైన మఠాలకు, ఆరామాలకు బౌద్ధవిశ్వ విద్యాలయాలకు నాటి చిరునామా నది. తపస్సంపన్నులైన మహాఋషులకు, యోగులకు ఒడి ఈ నది. మరణానంతరం అస్థికలను, బూడిదను తనలో నిమజ్జనం చేసుకొని వారి వారసులకు గొప్ప ఉపశమనాన్నిచ్చేది నది. పన్నెండేళ్ళకోసారైనా పుష్కరాల పేరుతో మహాపండితులను ఒక్క దగ్గర









చేర్చి సమాజహితం కోరే చర్చోపచర్చలకు వేదిక నది. పర్యావరణకు, జీవావరణకు పునాది నది. మానవాళి భవిష్యత్తుకు భద్రతనిచ్చేది నది.

వేదాల్లో, పురాణాల్లో, శిలాశాసనాల్లో, నదుల ప్రాముఖ్యత, పరిరక్షణ గురించి మన పూర్వీకులు శతాబ్దాలుగా హెచ్చరిస్తూనే ఉన్నారు. "నది నీటిలో మలినాలను వదలుతూ స్నానమాచరించడం, నీటిలో దుర్వాసనను వదలడం ప్రక్కన ఉన్న వ్యక్తిని పదునైన ఆయుధంతో హింసించిన దానితో సమానమ"ని వేదాలు నదుల పవిత్రతపై వ్యాఖ్యానించిన ఘన చరిత్ర మనది. అంత పవిత్రంగా చూసుకోవాల్సిన నదులను కాళ్ళు తడుపుకోవడానికి కూడా వీల్లేని స్థాయిలో భయంకరమైన కాలుష్యంతో నింపినాం. ఏ ప్రాణీ నదుల నీటిలో జీవించజాలని స్థితిని తీసుకొస్తున్నాం.



## దేశంలోని నదులు ఎదుర్కొంటున్న సమస్యలు

కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ప్రవహిస్తున్న నదులు – ఉపనదులు మానవ శరీరంలోని రక్తనాళాల్లాగే దేశమంతా విస్తరించి నలుమూలలకు ప్రవహిస్తున్నాయి. రక్తనాళాలు కుంచించిఉకు పోతే రక్తపోటు వచ్చినట్లే నదులు ఆక్రమణలతో ఇరుకై పోతే వరద జనావాసాలపైకి ముంచెత్తుతుంది. రక్తనాళాల్లో చెడురక్తం ప్రవహిస్తే వరీరాంగాలు పాడైనట్లే నదిలో కాలుష్యపు నీరు ప్రవహిస్తే పర్యావరణ సమస్యలు తలెత్తి ప్రకృతి ధ్వంసమై ఆ నీటిలోని చేపలు, ప్రాణులు మరణిస్తాయి. జీవావరణ (Biodiversity)కి ముప్పు ఏర్పడుతుంది.

గంగానది నుండి కావేరీనది దాకా నదులన్నీ కాలుష్యమయమై పోయాయి. నగరాలలో ప్రవహించే ఉపనదులు, వాగులన్నీ డ్రైనేజీ నాలాలుగా మారిపోయి వాటి ఉనికినే పోగొట్టుకుంటున్నాయి. ఫలితంగా వర్షాకాలంలో ప్రతి నగరాన్ని, పట్టణాలను వరదలు ముంచెత్తి ప్రజలను భీతావహులను చేస్తున్నాయి. ఈ క్రమంలో కొన్ని ఉపనదులు, వాగులు అంతరించిపోతున్నాయి లేదా పునరుద్ధరించజాలని స్థాయికి చేరుకుంటున్నాయి. ఈ దుస్థితికి కారణం స్వాతంత్ర్యానంతర పాలకులకు నదుల పరిరక్షణ పట్టకపోవడమే, పట్టణాభివృద్ధి పట్ల విజన్ లేకపోవడమే.

నదుల్లోకి కాలుష్యం పలు విధాలుగా చేరుతున్నది. పెద్దనగరాల్లో వేల సంఖ్యలో వెలసిన పరిశ్రమల వ్యర్థజలాలు సమీపంలోని నదిలోకే మళ్ళిస్తారు. ఆవరణలోనే ఎఫ్లుయెంట్/సీవేజ్ ట్రీట్మెంట్ప్లాంటులను ఏర్పాటు చేసుకొని వ్యర్థ జలాలను, రసాయనాలను ట్రీట్ చేయాలనే నిబంధనలు ఉన్నా వాటిని పనిచేయించడం ఖర్చుతో కూడుకున్న పని కాబట్టి పారిశ్రామిక వేత్తలు వ్యర్థ జలాలను, రసాయనాలను వదిలించుకోడానికి భూగర్భాన్ని లేదా వాగులు, నదులను ఎంచుకుంటున్నారు. కొన్నేళ్ళ క్రితం ఎల్.బి.నగర్లో వున్న సిరీన్ కంపెనీ నేరుగా భూగర్భంలోకి బోర్లు వేసి కాలుష్యాన్ని, రసాయనాలను పంపడం వల్ల నలభై ఏళ్లయినా నేటికీ చైతన్యపురి, ఎల్.బి.నగర్ ప్రాంతాల్లోని బోర్లలో ముదురు ఆకుపచ్చరంగు రసాయన జలాలే కనిపిస్తున్నాయి. ఏ పనికి గూఆ ఈ నీటిని వినియోగించలేము. నార్కెట్పల్లి (నల్లగొండ)లోని మరొక కంపెనీ ఆవరణలో నుండి ఒక వాగు ప్రవహిస్తుంది. కొన్నేళ్ళ క్రితం ఆ కంపెనీ యజమానులు తమ ఆవరణలోని వాగులనే బోర్లు వేసి కాలుష్య జలాలను భూగర్భంలోని పొరల్లోకి పంపించారు. ఫలితంగా ఆ ప్రాంతంలోని భూగర్భ జలాలన్నీ కలుషితమై పోయాయి.

హైదరాబాద్కు పశ్చిమాన వున్న పటాన్ చెరువులోని పరిశ్రమల వ్యర్థ, రసాయనిక జలాలను నేరుగా నక్కవాగులోకి వదలడం వలన మంజీరా సంగమం దాకా నక్కవాగు కలుషితమై పరిసర గ్రామాల ప్రజల, పశువుల ఆరోగ్యాలపై తీవ్రమైన దుష్ప్రభావాలను కలిగించిన సంగతి తెలిసిందే.

ఏళ్ళు గడిచినా పరిస్థితిలో మార్పేమీ లేదు. ఈ కంపెనీలపై కేసులు తప్ప! ఇప్పుడు కూడా పరిశ్రమల వ్యర్థ, కాలుష్య జలాలు










హైదరాబాద్ పొలిమేరల్లోని చెరువుల్లోకి, వాగుల్లోకి, హుస్సేన్ సాగర్‌లోకి, నేరుగా మూసీ నదిలోకి ప్రవహిస్తూనే వున్నాయి. పరిశ్రమల ఆవరణల్లో భూగర్భంలోకి వదలడం లేదని గ్యారంటీ ఏమీ లేదు. కొన్ని పరిశ్రమలు వ్యర్థ జలాలను ట్యాంకుల్లో నింపుకుని నగరానికి తూర్పున వున్న మూసీ నదిలోకి నేరుగా విడుస్తున్నారు. జంటనగరాల్లోని డ్రైనేజీ ప్రవహిస్తున్నాది నేరుగా మూసీనదిలోకే కదా! మూసీనదిలోకి వదిలే వ్యర్థ జలాల్లో కనీసం మూడింట రెండు వంతులు శుద్ధి చేసే సౌకర్యం లేనందున నేరుగా విడిచి పెడుతున్నారు. ఘట్కేసర్ సమీపంలోని గ్రామాల నుండి మూసీ ప్రాజెక్టు వరకు నదికి ఇరువైపులా విస్తరించి వున్న పలు గ్రామాల ప్రజలు కాలుష్యంతో ఎన్నో బాధలు పడుతున్నారు. కాలుష్య జలాలతోనే పంటలు పండిస్తూ రోగాల పాలవుతున్నారు.



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత మూసీ ప్రక్షాళన కోసం కేసీఆర్ ప్రభుత్వం దీర్ఘకాలిక, భారీ వ్యయమయ్యే ప్రణాళికను సిద్ధం చేసింది. మూసీ క్యాచ్‌మెంట్‌లోని కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి నియోజకవర్గాల్లోని చెరువుల వద్ద ఎస్.టీ.పీ.లను నిర్మిస్తున్నది. వీటికోసం రూ.3600 కోట్లు వ్యయం చేస్తున్నది. హుస్సేన్‌సాగర్‌లోకి రసాయన జలాలను తెచ్చే సనత్‌నగర్ నాలాను నేరుగా మూసీలోకి దారిమళ్లించినా, సాగర్ జలాల శుద్ధి కోసం వందల కోట్లు ఖర్చవుతున్నా లక్ష్యసాధనకు మరెంత కాలం పడుతుందో అంచనాకు అందడం లేదు. కానీ ఒక ప్రయత్నం మాత్రం ప్రభుత్వం నుండి మొదలై మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కూడా నగరం మధ్యలోని మూసీ నదిలోని డంపింగ్స్‌ను, ఆక్రమణలను తొలగిస్తూ నది పరిరక్షణకు, నదిలో భవిష్యత్తులో రిక్రియేషన్ సౌకర్యాల అభివృద్ధికోసం సిద్ధమవుతున్నది. మూసీనదికి పూర్వవైభవం తేవడానికి ప్రభుత్వ ప్రయత్నాలు సఫలీకృతం కావాలని కోరుకుందాం.

### గంగానది ప్రక్షాళన

హిమాలయాల్లో జనించే స్వచ్ఛమైన నదులు ఉపనదుల్లో దాదాపు 30 శాతం జీవాన్ని కోల్పోయి మృత నదులుగా (Bilogically dead) మారిపోయినవి. కాలుష్యం పెరగడమే దీనికి కారణం. హిమాలయ నదుల్లో తలసరి మంచినీటి లభ్యత 1951లో 5177 క్యూబిక్ మీటర్లుండగా 2000 సంవత్సరం నాటికి 1342 క్యూ.మీ. తగ్గిపోయింది. ప్రస్తుతం ఇంకా తగ్గి వుంటుందనడం నిస్సందేహం.

2525 కి.మీ. పొడవైన గంగానది ఉత్తర భారతదేశానికి లైఫ్‌లైన్ వంటిది. హిందువుల ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రతీక. విదేశాల్లో వుండే భారతీయులు ఎంతో గర్వంగా "మేరా దేశ్ మే గంగా బహత్‌హై" అని చెప్పుకుంటారు. అంతగొప్పదైన, స్వచ్ఛమైన, పవిత్రమైన నది కాలుష్య నదిగా మారడం వలన త్రాగునీటి సంబంధిత వ్యాధులతో లక్షలాది మంది చిన్నారులు, పెద్దలు ప్రతి ఏటా మరణిస్తున్నారు. దేశంలోని 40 శాతం (11 రాష్ట్రాలు) జనాభా గంగానది పరీవాహక ప్రాంతంలో నివసిస్తున్నారు. భారీ పరిమాణంలో నీటిని సముద్రంలోకి తరలించే ప్రపంచ పెద్దనదుల్లో 5వ స్థానం గంగానదిది (19000 క్యూ.మీ/సెకండ్) నాల్గవ స్థానంలో కూడా మన దేశంలోని బ్రహ్మపుత్రానదిదే (20,000 క్యూ.మీ./ సెకండ్).

గంగానదిలోకి అత్యంత ఎక్కువ ప్రవాహాన్ని జోడించేది యమునానది (58.5 శాతం).

అలహాబాద్ త్రివేణిసంగం వద్ద యమునానది గంగానదిలో కలుస్తుంది. లక్షలకు మించిన జనాభావున్న వందకు పైగా నగరాలు, 50వేల నుంచి లక్షలోపు జనాభాగల 97 నగరాలు, 48 పట్టణాలు నుండి పారిశ్రామిక రసాయన వ్యర్థ జలాలు, గృహ సంబంధిత వ్యర్థ జలాలు గంగానది కాలుష్యానికి కారణమవుతున్నవి. గంగానది సముద్రంలో కలిసే ప్రాంతంలోని సుమారు 500 గ్రామాల్లో (పశ్చిమ



బెంగాల్) క్యాన్సర్ వ్యాధితో ఇంటికొక్కరు లేదా ఇద్దరు మరణిస్తున్నారు.

దేశం గర్వించదగ్గ గొప్ప పర్యావరణ శాస్త్రవేత్త, ప్రొ. గురుదాస్ అగర్వాల్ @ జి.డి. అగర్వాల్ @ సంత్ స్వామీసానంద్ తన 86వ ఏట గంగానది ప్రక్షాళన కోసం 111 రోజులు హరిద్వార్‌లో ఆమరణ నిరాహారదీక్ష చేసి 11-10-2918న ప్రాణాలర్పించారు. భగీరథ నదిపై డ్యాంల నిర్మాణాన్ని (2009లో) అడ్డుకుని 11 రోజులు నిరాహారదీక్ష చేసి సఫలీకృతులైనారు. ప్రొ.జి.డి. అగర్వాల్ 1979-80 మధ్యకాలంలో సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్‌కు మెంబర్ సెక్రటరీగా పనిచేసారు. రాజేంద్రసింగ్ (Water man) స్థాపించిన తరుణ్ భారత్ సంఘ్‌కు ఉపాధ్యక్షులుగా ఉన్నారు. ఆమరణ దీక్షను మాన్పించడానికి అప్పటి జలశక్తి, గంగా పునరుజ్జీవ శాఖామంత్రి నితిన్ గడ్కరీ చేసిన ప్రయత్నం విఫలమైంది. "ప్రభుత్వం గంగానది ప్రక్షాళన కోసం మాత్రమే దృష్టి పెట్టింది. నేను అవిరళ్, నిర్మల్ గంగ కోసం నిరాహారదీక్ష చేస్తున్నా"నని ప్రొ.జి.డి. అగర్వాల్ ప్రకటించారు. గంగానది క్యాచ్‌మెంట్‌లో, ప్రధాననదిపై ఎలాంటి అడ్డుకట్టలు (డ్యాంలు, హైడల్ పవర్ ప్రాజెక్టులు) నిర్మించరాదని ఆయన సంకల్పం. ఒక గొప్ప పర్యావరణ ఇంజనీర్‌ను దేశం కోల్పోయింది.

గంగానది ప్రక్షాళన కోసం కేంద్ర ప్రభుత్వం 2015లో 'నమామి గంగా' ప్రాజెక్టును ప్రారంభించింది. రూ. 30,578 కోట్ల వ్యయంతో 365 ప్రాజెక్టులను (గంగానది కాలుష్య నివారణ కోసం ఎస్.టి.పి.ల నిర్మాణం, నది తీరంలో మొక్కల పెంపకం, ఘాట్లు, స్నాన వాటికలు, గ్రామీణ పారిశుద్ధ్యం, క్రిమెటోరియం (అంత్యక్రియల కోసం)ల నిర్మాణం తదితరమైనవి) ప్రారంభించారు. వీటిని 9 రాష్ట్రాల్లో (గంగా బేసిన్) నిర్మిస్తున్నారు. వీటిలో 160 సీవరేజ్ ప్రాజెక్టులు (4930 ఎంఎల్‌డీ), 5137 కి.మీ. నది ఉపనదులలో కాలుష్య నివారణ చర్యలు రూ.24,633 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నారు. 2021 నాటికి ఆరేళ్ళలో కేవలం 964 ఎంఎల్‌డీలను శుద్ధిచేసే ఎస్.టి.పి.లను మాత్రమే నిర్మించారు. తెలంగాణ క్యాడర్ ఐఏఎస్ అధికారి శ్రీ అశోక్ కుమార్ నమామి గంగా బాధ్యతలను చేపట్టి గత 4 నెలల్లో మరో 945 ఎంఎల్‌డీల శుద్ధికోసం ఎస్‌టీపీలను నిర్మించడం ఆయన పట్టుదలకు, అంకిత భావానికి నిదర్శనం.

ఒక నది కాలుష్యమయమైతే దాని ప్రక్షాళన ఎంత కష్టమైనదో, వ్యయంతో కూడినదో తెలుపడానికే ఈ గంగానది ఉదాహరణ. మూసీ ప్రక్షాళన కోసం తెలంగాణ ప్రభుత్వం కూడా భారీ వ్యయంతో కూడిన ప్రణాళికను అమలు చేస్తున్నది. దేశంలోని నదులన్నీ ప్రక్షాళన చేయడానికి లక్షల కోట్లు వ్యయమవుతాయి. కాలుష్యాన్ని రానిచ్చేదెందుకు? భారీ వ్యయంతో ప్రక్షాలనెందుకు?

**దేశంలోని నదులు - ఉపనదులు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలు:**

1. అడవికి, ప్రైవేట్ భూములకు, గ్రామాలకు సరిహద్దులుంటాయి. కానీ నదుల సరిహద్దులను ప్రభుత్వాలు గుర్తించ నందున ఆక్రమణలకు గురవుతున్నాయి.
2. వాటర్ వేస్ అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వాలు పర్యావరణకు జరుగుతున్న ముప్పును గుర్తించడం లేదు. ఉదా: గోవాలోని మాండవి నదిలో 45 కి.మీ. వాస్కోడిగామా పోర్ట్ నుండి వేదాంత పిగ్ ఐరన్ కంపెనీ వరకు పెద్దపెద్ద షిప్పుల్లో బొగ్గుపొడిని ఎలాంటి కప్పు లేకుండా తరలించడం వలన 90 శాతం చేపల లభ్యత, ఉత్పత్తి తగ్గిపోయింది. చాలా రకాల చేపల జాతులు అంతరించాయి. వేలాది ఫిషర్‌మెన్ కుటుంబాలు రోడ్డున పడ్డాయి. బొగ్గుపొడి నదివెంట ఉన్న జీడిమామిడి తోటల ఆకులపై పడడం వలన వాటి ఉత్పత్తి బాగా తగ్గింది.
3. నదికి ఇరువైపులా అడవులను నరకడం వల్ల భూమి కోతకు గురవుతూ నది హద్దులు విస్తరించి రైతుల పొలాల పరిమాణం తగ్గుతున్నది.
4. నదుల్లోకి వ్యవసాయ ఎరువులు, పురుగుమందుల కాలుష్యం కూడా వచ్చి చేరుతున్నది. ఈ నీరు త్రాగినవారికి క్యాన్సర్ వంటి జబ్బులు వస్తున్నాయి.
5. నది క్యాచ్‌మెంట్‌లోని చిన్న చిన్న వాగులు, కుంటలు, చెరువులు ఆక్రమణలకు గురవుతున్నవి. ప్రభుత్వాలు వీటి పరిరక్షణకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. చట్టాలను అమలు జరపడం లేదు.
6. నదుల్లో, ఉపనదుల్లో, వాగుల్లో ఇసుకను యదేశ్చగా, నియమాలకు విరుద్ధంగా తీస్తుండడంతో భూగర్భజలాలు



అడుగంటుతున్నవి. వరుస కరువులు వస్తే ఆదుకునేది ఈ భూగర్భ జలాలే. ఇవి చాలా దిగువకు పడిపోవడం వలన ఫ్లోరైడ్ వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి తెలంగాణ ఒక మోడల్‌ని దేశానికందించింది. గతంలో నల్గొండ ఫ్లోరైడ్ బాధితుల గోస తెలిసిందే. కృష్ణా జలాలను ఇంటింటికీ (మిషన్ భగీరథ ద్వారా) అందించడం వల్ల ఈ సంవత్సరం ఫ్లోరైడ్ రహిత రాష్ట్రంగా జాతీయ అవార్డును తెలంగాణ సొంతం చేసుకుంది.

అన్ని రాష్ట్రాల్లో కూడా ఫ్లోరైడ్ నివారణ కోసం భూగర్భ జలాల స్థానంలో నదుల నీటిని అందిస్తే ఫ్లోరైడ్, ఇతర కాలుష్య కారకాల నుండి ప్రజలను కాపాడగలం.

7. నదులపై పెద్ద డ్యాంల స్థానంలో బ్యారేజీలను నిర్మించి ఏడాది పొడుగునా 'ఎన్విరాన్‌మెంటల్ ఫ్లో' ఉండేలా నదిలో నీరు ప్రవహించేలా చూడాలి. నదిలో ఇరు ప్రక్కలా ఉండే బయోడైవర్సిటీని పరిరక్షించడానికి నదిపై ఆధారపడ్డ వృత్తులు కొనసాగించడానికి ఈ నిరంతర ప్రవాహాలు దోహదపడతాయి.

8. రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ పేరుతో నదిలో ఎలాంటి నిర్మాణాలు, వాకింగ్/సైక్లింగ్ ట్రాక్‌లు నిర్మించడం, కాంక్రీట్ జంగిల్‌గా మార్చడం నదికి హానికరం. మూసీ నదిలో ఏకంగా బస్టాండ్, మెట్రో రైల్ స్టేషన్లు నిర్మించడం జరిగింది. భవిష్యత్తులో మూసీ ఉప్పొంగి హిమాయత్‌సాగర్, గండిపేటల గేట్లు పూర్తిస్థాయిలో తెరవాల్సి వస్తే మూసీ ఇరుప్రక్కల గల వాడలు, ఇండ్లు జలమయం కాక తప్పదు.

9. నదుల క్యాచ్‌మెంట్లలో ఎలాంటి రసాయ, కాలుష్య కారక పరిశ్రమలను అనుమతించరాదు. ఇప్పటికే ఉన్న వాటిని గుర్తించి దూర ప్రాంతాలకు తరలించి ఇ.టి.పి., ఎస్.టీ.పీ.లను నిర్మించుకొని పనిచేయించేలా చర్యలు తీసుకోవాలి. కాలుష్యాన్ని భూగర్భంలోకి విడిచే కంపెనీలను గుర్తించి వాటి లైసెన్సులను, అనుమతులను రద్దు చేయాలి. నది క్యాచ్‌మెంట్లలో రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించేలా ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబించేలా రైతులను చైతన్యపరచాలి.

10. నదులపట్ల, నీటి వినియోగం పట్ల విద్యార్థుల్లో అవగాహన పెంచడం కోసం అన్ని విద్యాసంస్థల్లో 'వాటర్ లిటరసీ సెంటర్ల'ను ప్రభుత్వాలు స్వచ్ఛంద సంస్థల, ఎన్.ఎస్.ఎస్. సహకారంతో ఏర్పాటు చేయాలి. విద్యార్థుల పాఠ్యపుస్తకాల్లో 'జలసంరక్షణ' పాఠాలు (సిలబస్‌లో) చేర్చాలి. కళాశాలల్లో డిప్లొమా కోర్సులు, సర్టిఫికెట్ కోర్సులను ప్రారంభించాలి.

వాటర్‌మాన్ ఆఫ్ ఇండియా డా॥ రాజేంద్రసింగ్ ఆధ్వర్యంలో అన్ని నదులపై, ఉపనదులపై, వాగులపై పౌర కమిటీలు, సంఘాలు ఏర్పాటవుతున్నాయి. ఫెడరల్ స్వభావం గల ఈ సంఘాల్లో స్వచ్ఛంద సంస్థలు, సీనియర్ సిటిజన్లు, విద్యార్థులు, జలసంరక్షణ కోసం పనిచేస్తున్నవారు చేరి పనిచేయాలి. ప్రజల్లో అవగాహన పెంచాలి. ప్రభుత్వాలు నదుల, జలాశయాల పరిరక్షణలో ఘోరంగా విఫలమైనప్పుడు భవిష్యత్ తరాల కోసం ప్రజలే స్వచ్ఛందంగా వీటి పరిరక్షణకు ముందుకు రావాలి.


వీచే గాలి, మోసే భూమి,పారే నది పవిత్రంగా, స్వచ్ఛతతో ఉన్నప్పుడే పర్యావరణ, మన శరీరాలు ఆరోగ్యంగా ఉంటాయి.

**- వి. ప్రకాశ్,** చైర్మన్
తెలంగాణ జలవనరుల అభివృద్ధి సంస్థ
m : 95539 55304
e: telangana.prakash@gmail.com

# ఆరోగ్యం కోసం యోగా

## జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం

**2014** సెప్టెంబరు 27న భారత ప్రధాని నరేంద్రమోడి ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రతి సంవత్సరం జూన్ 21న జరుపుకొనుట గురించి ప్రతిపాదన చేయడం, ఈ తీర్మానానికి 193 ఐరాస(ఐక్య రాజ్య సమితి) ప్రతినిధులలో 175 మంది మద్దతు ఇవ్వడం తెలిసిందే. భద్రతా మండలిలో శాశ్వత సభ్యులుగా ఉన్న అమెరికా, ఇంగ్లాండ్, చైనా, ఫ్రాన్స్, రష్యా వంటి దేశాలు సహ ప్రతినిధులు కూడా ఈ తీర్మానంపై విస్తృతమైన చర్చల తరువాత డిసెంబర్ 2014లో ఆమోదించారు.




దీంతో 2015 జూన్ 21న, మొదటి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా జరుపుకున్నారు. జూన్ 21నే యోగా దినోత్సవం జరుపుకోవడానికి గల కారణం ఏంటంటే.. జూన్ 21 ఉత్తరార్ధగోళంలో అత్యధిక పగటి సమయం ఉన్న రోజు ఇవాళ. ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో ఈ రోజుకు ఆయా ప్రత్యేకతలు కూడా ఉన్నాయి. ఎక్కువ పగటి సమయం ఉన్న రోజుగా గుర్తింపు పొందడంతో అదే రోజును అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితికి భారత ప్రధాని మోదీ సూచించారు.

"యుజ్" అనగా "కలయిక" అనే సంస్కృత ధాతువు నుండి ''యోగ'' లేదా ''యోగము'' అనే పదం ఉత్పన్నమైంది. "యుజ్యతేఏతదితి యోగః", "యుజ్యతే అనేన ఇతి యోగః" వంటి నిర్వచనాల ద్వారా చెప్పబడిన భావము. యోగమనగా ఇంద్రియములను వశపరచుకొని, చిత్తమును ఈశ్వరుని యందు లయం చేయుట. మానవుని మానసిక శక్తులన్నింటిని ఏకమొనర్చి సామాన్య స్థితిని చేకూర్చి భగవన్మయమొనరించుట. ఇలా ఏకాగ్రత సాధించడం వలన జీవావధులను భగ్నం చేసి, పరమార్థ తత్వమునకు వెళ్లడమే యోగ. "యోగము" అంటే సాధన అనీ, అదృష్టమనీ కూడా అర్థాలున్నాయి. భగవద్గీతలో అధ్యాయాలకు యోగములని పేర్లు.


హిందూ ఆధ్యాత్మిక సంప్రదాయంలో భాగమైన యోగాన్ని శాస్త్రీయంగా క్రోడీకరించిన ఆద్యుడు పతంజలి. క్రీస్తు పూర్వము 100వ శకము 500వ శకము మధ్య కాలములో ఈ రచన జరిగినట్లు పరిశోధకులు విశ్వసిస్తున్నారు. వేదములు, పురాణములు, ఉపనిషత్తులు, రామాయణము, భాగవతము, భారతము, భగవద్గీతలలో యోగా ప్రస్తావన ఉంది. పతంజలి వీటిని పతంజలి యోగసూత్రాలు గా క్రోడీకరించాడు.

భారతీయ తత్వం ప్రతిపాదిస్తున్న సార్వత్రిక విలువల్లాగే యోగా కూడా విశ్వవ్యాప్త భావననూ, ప్రాపంచిక దృక్పథాన్నీ బోధిస్తుంది. అందుకే యోగాకు సిద్ధాంతాలు, మతాలతో సంబంధం లేకుండా విశ్వవ్యాప్త గుర్తింపు, ఆమోదం లభించాయి.

21వ శతాబ్దపు ఉరుకులు, పరుగుల జీవితం వల్ల కలిగే ఒత్తిడుల నుంచి ఉపశమనం పొందేందుకు మానవాళికి యోగా ఒక సాధనమైంది. యోగాలో అంతర్లీనంగా ఉన్నటువంటి శక్తి, సనాతన జీవన విధానం నుంచి వారసత్వంగా వస్తోంది. ఆదియోగి అయిన పరమేశ్వరుడు యోగాను మొదటిసారిగా వినియోగంలోకి తీసుకొచ్చినట్లు మన శాస్త్రాలు చెబుతున్నాయి. అయితే, భారతీయ తత్వం ప్రతిపాదిస్తున్న సార్వత్రిక విలువల్లాగే యోగా కూడా విశ్వవ్యాప్త భావననూ, ప్రాపంచిక దృక్పథాన్నీ బోధిస్తుంది.

అందుకే యోగాకు సిద్ధాంతాలు, మతాలతో సంబంధం లేకుండా విశ్వవ్యాప్త గుర్తింపు, ఆమోదం లభించాయి. తూర్పున ఉన్న వ్లాదివస్తోక్ నుంచి పశ్చిమాన ఉన్న వాంకోవర్ వరకు, దక్షిణాన ఉన్న కేప్‌టౌన్ నుంచి ఉత్తరాన ఉన్న కోపెన్‌హాగన్ వరకు ప్రతి నగరం యోగాలోని శక్తినీ, రోగనిరోధక సామర్థ్యాన్నీ గుర్తించి వినియోగంలోకి తీసుకొచ్చింది. యోగాను దైనందిన జీవితంలో ఒక భాగంగా మార్చుకున్న వారందరూ... ఆనందకర జీవితాన్ని పొందుతున్న తీరే ఇందుకు నిదర్శనం. వివిధ వ్యాధులకు సరైన చికిత్స నుంచి మరికొన్ని సమస్యలు రాకుండా నివారించుకునేందుకు యోగా ఓ సాధనంగా మారింది. 21వ శతాబ్దపు ఉరుకులు, పరుగుల జీవితం వల్ల కలిగే ఒత్తిళ్ళ నుంచి ఉపశమనం పొందేందుకు ప్రపంచ వ్యాప్తంగా యోగా మానవాళి ఆరోగ్యానికి అత్యవసర, నిత్యావసర సాధనకు వేదికైంది.

– ఎసికె. శ్రీహరి
m : 9849930145
e : ackvs08@gmail.com








# ఆధ్యాత్మిక నిలయం హంపి

## 1986లో UNESCO ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు

**భా**రతదేశంలో ఉన్న చాలా ఆలయాలు చారిత్రక వారసత్వ సంపదకు పుట్టినిల్లుగా తారసపడడం అత్యంత సహజం. అయితే చారిత్రక విశేషాలతో పాటు పౌరాణిక ప్రాశస్త్యాన్ని కూడా కల్గిన మహత్తర ఆలయాలెన్నో మన దేశంలో ఉన్నాయి. అది మహత్తర ఆలయమే కాదు, మనం అత్యంత ఆనందోత్సాహాల మధ్య జరుపుకునే వసంతోత్సవానికి (హెూలీ) పునాది వేసిన పుణ్య స్థలమది. అదే కర్ణాటక రాష్ట్రంలోని హంపి.

13-15వ శతాబ్దంలో విజయనగర సామ్రాజ్య రాజధాని. ఇప్పుడు కర్ణాటక రాష్ట్రంలోని బళ్ళారి జిల్లాలోని ఒక చిన్న పట్టణం. విద్యారణ్యస్వామి ఆశీస్సులతో స్థాపించబడిన విజయనగర సామ్రాజ్యానికి విజయనగరం లేదా హంపి రాజధాని. దక్షిణ భారతదేశములోని అతి పెద్ద సామ్రాజ్యాలలో విజయనగరసామ్రాజ్యం ఒకటి. గోపురం నీడ ప్రధాన ఆలయంలోని ఒక చిన్న రంధ్రంలో నుండి క్రింద నుండి పైకి అనగా తలక్రిందులుగా కనపడటం అప్పటి









కళా చాతుర్యానికి నిదర్శనం.

హంపి అనగానే అద్భుతమైన కట్టడాలు, దేవాలయాలు స్ఫురణకు వస్తాయి. ప్రపంచ వారసత్వ సంపదగా రికార్డులకెక్కింది. హైదరాబాద్ నుంచి బళ్ళారి సుమారు 360 కిలోమీటర్లు దూరం. హైద్రాబాద్ నుంచి సుమారు ఎనిమిది గంటలు పడుతుంది. అక్కడ నుంచి మరో 75 కిలోమీటర్ల దూరంలో హంపి ఉంది. అందువల్ల బళ్ళారి నుంచి గంటన్నర సమయం పడుతుంది.


బెంగళూరు నుంచి హొస్పేటకు రెగ్యులర్ ఆర్టీసీ బస్సులున్నాయి. హొస్పేట నుండి హంపికి 12కిలోమీటర్ల దూరం. బెంగళూరు నుండి హొస్పేటకు రెగ్యులర్‌గా ట్రైయిన్స్ ఉన్నాయి. 12 కిలోమీటర్ల దూరంలోని హంపీ చేరుకోవడానికి ప్రైవేటు ఆటోలు, ట్యాక్సీలు, ఇతర ప్రైవేటు వాహనాలు ఉన్నాయి. పర్యాటకులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.



హంపి పరిసరాల్లోకి చేరుకోగానే అద్భుతమైన రాతి ద్వారాలు, కొండలు, గుట్టలు, కట్టడాలు విపరీతంగా ఆకర్షిస్తాయి. మరో లోకంలోకి అడుగుపెట్టడం లేదుకదా అన్న అనుమానం కూడా మనలో కలుగుతుంది. అంత అందమైన చిత్రమైన కట్టడాలను అంతకు ముందు మీరు ఎప్పుడూ చూసి ఉండరు. అలా నఖశిఖ పర్యంతం చూస్తూ ఉండిపోతాం. హంపిలో అందర్నీ బాగా ఆకర్షించే దేవాలయం విరూపాక్ష దేవాలయం.


విజయనగర రాజుల కళాభిరుచికి, వారి ధార్మిక ప్రవృత్తికి నిదర్శనంగా నిలిచిన దివ్య క్షేత్రమిది. ఈ దివ్య క్షేత్రంలో శివుడు విరూపాక్షేశ్వర స్వామిగా పూజాదికాలందుకుంటున్నాడు. హంపి ఆధ్యాత్మిక చారిత్రక వైభవానికి ప్రధాన సాక్ష్యం పంపా విరూపాక్ష దేవాలయమని తెలుసుకోవడానికి ఎక్కువ సమయం పట్టదు. హంపి విజయ నగర ప్రాంతంలో అత్యంత ప్రాచీనమైన పంపా విరూపాక్ష ఆలయం అంతు తెలియని అనేక ఆధ్యాత్మిక రహస్యాలకు నిలయం. విజయనగర స్థాపన, హరిహర బుక్కరాయల ధర్మరాజ్య స్థాపనాదీక్ష ఈ ఆలయం నేపథ్యం నుంచే ప్రారంభమైంది. ఈ ఆలయ రాజగోపురం దూరం నుంచే కనిపిస్తుంది. తొమ్మిది అంతస్థులతో ఈ గోపురం ఉంది.

ఈ తూర్పు గాలి గోపురం విరూపాక్ష దేవాలయానికి ప్రత్యేక ఆకర్షణ. దానిని కింద నుంచి చూడడం బలే ముచ్చటేస్తుంది. గోపురం లోపల ఎలాంటి అడ్డ నిలువు దూలాలు వాడకుండా పైదాకా సూచీ ముఖంగా నిర్మాణం చేపట్టారు. అష్టకోణాకృతిగా ఉండే ఈ రాజగోపురం నిర్మాణ సాంకేతిక నైపుణ్యం ఈనాటికీ అబ్బురమే. ఈ గోపురం 165 అడుగుల ఎత్తు, కింది భాగం 20 అడుగుల వెడల్పు, 50 అడుగుల పొడవు కలిగి పదకొండు అంతస్థులతో కనిపిస్తుంది. దీనిని బిష్టప్పయ్య గోపురమని పిలుస్తారు. విరూపాక్ష ఆలయానికి రెండు గోపురాలున్నాయి. మొదటి ప్రాంగణం నుంచి పశ్చిమ దిశకు వెళితే మరో గోపురం కనిపిస్తుంది. ఈ గోపురాన్ని రాయల గోపురమని పిలుస్తారు. ఈ గోపురం ద్వారా ప్రవేశిస్తే రెండో ప్రాకారం ఉంటుంది. ఇక్కడ ధ్వజస్తంభాలు, దీపస్తంభాలుంటాయి. ఎడమవైపున పాతాళేశ్వర, ముక్తి, నరసింహ, సూర్యనారాయణ స్వామి ఆలయాలు, కుడివైపున లక్ష్మీనరసింహస్వామి, మహిషాసుర మర్దని, వేంకటేశ్వర స్వామి ఆలయాలున్నాయి. దీనికి ఎదురుగా విరూపాక్షేశ్వరస్వామి వారి సన్నిధి ఉంది. ఆలయానికి ముందు రంగమండపం ఉంది. 1509లో శ్రీకృష్ణ దేవరాయలు దీనిని కట్టించారు.









7వ శతాబ్దం నుండి ఈ ఆలయం ఉందని స్థానికులు చెపుతారు. ప్రధాన దేవాలయానికి చాళుక్యులు, హొయసాల రాజుల పరిపాలన కాలంలో అనేక మార్పులు చేర్పులు జరిగాయని, అయితే ప్రధానాలయాన్ని మాత్రం విజయనగర రాజులే నిర్మించినట్లు తెలిసింది. విజయనగర రాజులు పతనమయ్యాక 16వ శతాబ్దం ప్రాంతంలో జరిగిన దండయాత్రల వల్ల హంపి నగరంలోని అత్యద్భుత శిల్ప సౌందర్యం పూర్తిగా నాశనమైపోయిందట. కానీ విరుపాక్ష-పంపా ప్రాకారం మాత్రం దండయాత్రల బారిన పడలేదు. ఆ సమయంలో విరుపాక్షునికి ధూప దీపనైవేద్యాలు నిర్విఘ్నంగా కొనసాగాయట. అనంతరం 19వ శతాబ్దంలో ఈ ఆలయాన్ని కొంతమేర జీర్ణోద్ధరణ చేసినట్లు అక్కడి ఆధారాల ద్వారా మనకు తెలుస్తుంది. హంపిని పూర్వం పంపావతి అని పిలిచేవారు. తుంగభద్ర నదీతీరంలో ఉన్న ఈ దివ్యాలయాన్ని ఎప్పుడు నిర్మించిందీ ఇతిమిద్ధమైన ఆధారాలు లేక పోయినప్పటికీ, క్రీ.శ. 1510 సంవత్సరంలో మాత్రం ఈ ఆలయం మొదటిసారిగా జీర్ణోద్ధరణ అయ్యిందని అక్కడి వారి చెపుతారు. హంపి దివ్య క్షేత్రం ఐదు పర్వతాల సముదాయం. మాతంగ, మాల్యవంత, హేమకూలు, బసవశృంగ, కిష్కింధ లాంటి ఐదు పర్వతాల నడుమ ఇది అలరారుతోంది. త్రేతాయుగంలో వనవాసకాలంలో శ్రీరాముడు ఇక్కడున్న పంపావతి అమ్మవారిని, విరూపాక్షేశ్వర స్వామిని దర్శించుకున్నట్టు ఇక్కడి ఆధారాల ద్వారా తెలుస్తుంది. అలాగే శ్రీరాముడు సుగ్రీవ, హనుమంతులను కలుసుకుని సుగ్రీవుని ఇక్కడే రాజుగా చేశాడట. ఆనాటి నుంచి రామలక్ష్మణులు ఈ క్షేత్రంలో ఉన్నారని చెబుతారు. అలాగే హనుమంతుడు సీతమ్మవారిని కనుగొని రాములవారికి తెలియ చేసిన క్షేత్రమిదేనట. ఆ కారణంగా ఈ క్షేత్రానికి కిష్కింధకాండ అనే పేరు వచ్చింది.



**పురాణ గాథ :**

ఇక్కడ శివుడు విరూపాక్షుడిగా పేరు పొందడానికి పురాణగాథ ఒకటి ప్రచారంలో ఉంది. ఒకప్పుడు ఇంద్రాది దేవతలు, మునులు అసురుల అకృత్యాలకు విసిగి బ్రహ్మదేవుడ్ని శరణువేడారట. అంతట బ్రహ్మదేవుడు శివ కుమారుని వల్లే ఈ సమస్య తీరుతుందని, అయితే శివుడు తపోనిష్టుడై పార్వతిని విడిచి వెళ్ళడం వల్ల కుమార సంభవం అసంభమని చెప్పాడట. దాంతో శివుడ్ని తిరిగి పార్వతి వైపు మళ్ళించడానికి ఒక్క మన్మథుడే అర్హుడని, మన్మథుడ్ని ఆ పనికి పురమాయించారట. మన్మథుడు తన మన్మథ బాణాలతో శివుడి తపస్సుని భంగపరచి, అతని మనస్సును మళ్ళించే ప్రయత్నం చేశాడట. దాంతో తపోభంగంతో కోపించిన మహాదేవుడు తన మూడో నేత్రంతో మన్మథుడ్ని భస్మం చేయగా, ఇంద్రాది దేవతలు శివుడిని ప్రార్థించగా శివుడు శాంతించి మన్మథుడ్ని రూపం లేకుండానే జీవించమని అనుగ్రహించాడట. ఆనాటి నుంచి





శివుడికి విరూపాక్షుడనే పేరు సార్థకమైంది. మన్మథుడు తిరిగి జీవం పోసుకున్న రోజుకు గుర్తుగా ఆనాటి నుంచి వసంతోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వచ్చింది.

గర్భాలయానికి సమీపంలో విద్యారణ్య స్వామి ప్రతిష్టించిన శ్రీచక్రం ఉంది. అలాగే పంపాదేవిగా పురాణకాలంలో భువనేశ్వరి దేవిగా చారిత్రక కాలం నుంచీ పూజలందుకుంటున్న దుర్గాదేవిని, పక్కనే ఉన్న మహాలక్ష్మి అమ్మవారి ఆలయాలను కూడా దర్శించ వచ్చు. దీనికి సమీపంలోనే పాతాళ మాధవ స్వామి ఉన్నాడు. ఈ ఆలయంలో ఉత్తర భాగాన మణక గోపురం ఉంది. దీనిని కనకగిరి గోపురమని పిలుస్తారు. ప్రధానాలయానికి వెనుక భాగంలో విద్యారణ్య స్వాముల వారి దేవాలయం ఉంది. దీనికి ఉత్తరాన మఠం ఉంది. దీనికి సమీపంలోనే లోక పావన తీర్థముంది. ఇక్కడ నుండి వెనుతిరిగి మహా ద్వారం గుండా బయటకు వస్తే గోపురానికి ఎదురుగా సుమారు రెండు కిలోమీటర్లు పొడవైన హంపి రాజవీధిని దర్శించుకోవచ్చు.



## దర్శనీయ స్థలాలు

### నగర ప్రవేశం


14వ శతాబ్దం నగర అవశేషాలు 26 చదరపు కి.మీ విస్తీర్ణంలో విస్తరించి ఉంటాయి. ఉత్తరం వైపు తుంగ భద్ర నది మిగతా మూడు వైపుల పెద్ద పెద్ద గ్రానైటు శిలలతో అప్పటి విజయనగర వీధుల వైభవాన్ని తెలుపుతూ ఉంటుంది. ఈ పట్టణంలోకి ప్రవేశిస్తుంటే కనిపించే విశాలమైన భవంతులు, పెద్ద పెద్ద ప్రాకారాలు అప్పటి నగర నిర్మాణ చాతుర్యాన్ని, సుల్తానుల అవివేక వినాశన వైఖరిని వెలిబుచ్చుతాయి.

నగరం యొక్క ప్రధాన అవశేషాలన్ని కమలాపుర్ నుండి హంపి వెళ్ళే రహదారిలో కనిపిస్తాయి. కమలాపుర నుండి హంపి వెళ్లే దారిలో కమలాపురకు మూడు కి.మీ. దూరంలో మల్యంవంత రఘునాధ స్వామి దేవాలయం వస్తుంది. ఈ దేవాలయం ద్రవిడ ఆలయ నిర్మాణ శైలిలో నిర్మించబడింది. ఆ ఆలయంలో వైవిధ్య భరితంగా చెక్క బడిన చేపలు, జలచరాలు పర్యాటకుల కళ్ళకు విందు.















## విరుపాక్ష దేవాలయం

800 గజాల పొడవు 35 గజాల వెడల్పు ఉన్న హంపి వీధులలో అత్యంత సుందరమైన ఇళ్ళున్నాయి. హంపి వీధికి పశ్చిమ చివర విరుపాక్ష దేవాలయం ఉంది. 50 మీటర్ల ఎత్తు ఉన్న తూర్పు గాలి గోపురం విరుపాక్ష దేవాలయంలోనికి స్వాగతం పలుకుతుంది. దేవాలయంలో ప్రధాన దైవం విరుపాక్షుడు (శివుడు). ప్రధాన దైవానికి అనుసంధానంగా పంపా దేవి గుడి, భువనేశ్వరి దేవి గుడి ఉంటుంది.

ఈ దేవాలయానికి 7వ శతాబ్దం నుండి నిర్విఘ్నమైన చరిత్ర ఉంది. విరుపాక్ష-పంపా ఆలయం విజయనగర సామ్రాజ్యం కంటే ముందు నుండి ఉన్నదని శిలాశాసనాలు చెబుతున్నాయి. 10-12 శతాబ్దానికి చెందినవి అయి ఉండవచ్చని చరిత్రకారుల అంచనా.

చరిత్ర ఆధారాల ప్రకారం ప్రధాన దేవాలయానికి చాళుక్యుల, హొయసల పరిపాలన మార్పులు చేర్పుల జరిగాయని అయితే ప్రధాన ఆలయం మాత్రం విజయనగర రాజులే నిర్మించారు. విజయనగర రాజుల పతనమయ్యాక దండయాత్రల వల్ల 16వ శతాబ్దానికి హంపి నగరంలోని అత్యాద్భుత శిల్ప సౌందర్యం నాశమైపోయింది.

విరుపాక్ష-పంపా ప్రాకారం మాత్రం 1565 దండయాత్రల బారి పడలేదు. విరుపాక్ష దేవాలయంలో దేవునికి దూపనైవేద్యాలు నిర్విఘ్నంగా కొనసాగాయి. 19వ శతాబ్దం మెదలులో ఈ ఆలయం పైకప్పు పై చిత్రాలకి, తూర్పు, ఉత్తర గోపురాలకి జీర్ణోద్ధరణ జరిగింది.

ఈ దేవాలయానికి 3 ప్రాకారాలు ఉన్నాయి. 9 ఖానాలతో 50 మీటర్ల ఎత్తు ఉన్న తూర్పు గోపురములోని రెండు ఖానాలు రాతితో నిర్మించబడ్డాయి మిగతా 7ఖానాలు ఇటుకలతో నిర్మించబడ్డాయి. ఈ తూర్పు గోపురం నుండి లోపలికి ప్రవేశిస్తే బయటి నుండి ఆలయంలోకి వెళ్ళే మొదటి ప్రాకారం స్తంభాలు లేకుండా ఆకాశం కనిపించేటట్లు ఉంటుంది. ఈ ప్రాకారాన్ని దాటి లోపలికి వెళ్తే స్థంబాలతో కూడి కప్పబడిన వసారా ఉంటుంది. స్తంభాలతో కూడి ఉన్న వసారాలో చిన్న చిన్న దేవాలయాలు ఉంటాయి. దీన్ని కూడా దాటి లోపలి ప్రాకారంలోకి వెళ్ళితే గర్భగుడి వస్తుంది.

తుంగభద్రా నది నుండి ఒక చిన్న నీటి ప్రవాహం ఆలయంలోకి ప్రవేశించి గుడి వంట గదికి నీరు అందించి బయటి ప్రాకారం ద్వారా బయటకు వెళ్తుంది.

ఈ ఆలయ అభివృద్ధిలో శ్రీ కృష్ణదేవరాయల పాత్ర ఎంతో ఉన్నదని లోపలి ప్రాకారం ఉన్న స్థంబాల వసారాలోని శిలాశాసనాలు చెబుతున్నాయి. ఈ లోపలి ప్రాకారంలోని స్తంభాల వసారాని 1510 సంవత్సరములో కృష్ణదేవరాయలు కట్టించాడని కుడా శిలాశాసనాలు చెబుతున్నాయి. విరుపాక్ష దేవాలయంలోని బయటి ప్రాకారంలో ఏకశిలలో చెక్క బడిన నంది ఒక కి.మీ. దూరం వరకు కనిపిస్తుంది.

## విఠల దేవాలయ సముదాయం

హంపికి ఈశాన్య భాగంలో అనెగొంది గ్రామానికి ఎదురుగా ఉన్న విఠల దేవాలయ సముదాయం అప్పటి శిల్ప కళా సంపత్తికి ఒక నిదర్శనం. ఈ దేవాలయం మరాఠీలు విష్ణుమూర్తిగా ప్రార్థించే విఠలుడిది. ఈ ఆలయం 16 వ శతాబ్దానికి చెందినది. విఠలేశ్వర దేవాలయం ఆకర్షణీయమైన విశేషం సప్త స్వరాలు పలికే ఏడు సంగీత స్తంభాలు. ఈ దేవాలయంలోనే పురందరదా ఆరాధనోత్సవాలు జరుతాయి.

## శిలా రథం

ఈ ఏక శిలా రథం విఠల దేవాలయ సముదాయానికి తూర్పు భాగంలో ఉంది. ఇంకో విశేషం ఏమంటె ఈ రథానికి కదిలే చక్రాలు ఉంటాయి.

### గజ శాల

పట్టపు ఏనుగులు నివాసం కొరకు వాటి దైనందిన కార్యకలాపాల కొరకు రాజ ప్రసాదానికి దగ్గరలోనే గజశాల ఉంది. ఏనుగులు కవాతు చేయడానికి వీలుగా ఈ గజశాలకు ఎదురుగా ఖాళీ ప్రదేశం ఉంది. ఈ గజశాల గుమ్మాలు కొప్పు ఆకారంలో ఉండి ముస్లిం కట్టడ శైలి చూపుతున్నాయి. మావటి వారు సైనికులు ఉండడానికి గజశాలకు ప్రక్కన సైనిక స్థావరాలు ఉన్నాయి.

### గుళ్ళు తిరగడం

హంపిలో బహుశ అందరూ చేసే మొదటి పని, అద్భుతమైన గుళ్ళు అన్నిటిని చూడటం. పురాతన పుణ్యక్షేత్రం కావడం వల్లన విరూపాక్ష గుడి ఒక అందమైన కళాఖండం. అందువలన దీనిని ఏడాది అంతా పర్యాటకులు మరియు యాత్రికులు సందర్శిస్తూ ఉంటారు. మీరు చూడాల్సిన మిగతా గుళ్ళలో కృష్ణ గుడి, అచ్యుతరాయ గుడి మరియు దాని సంత స్థలం, విఠల గుడి ఇంకా కొండ మీద ఉన్న హేమకుట కట్టడం ముఖ్యమైనవి.

### గుట్టలు ఎక్కడం

హంపి ఎన్నో లెక్కలేనన్ని కొండలకి, గుట్టలకి నిలయం కాబట్టి, కొండలు, గుట్టలు ఎక్కడానికి ఇది అద్భుతమైన ప్రదేశం. కొన్ని స్థానిక సేవా సిబ్బందులు, భద్రతా కొలమానాలతో గుట్టలు మరియు కొండలు ఎక్కడానికి సౌకర్యాలు కలిగిస్తారు. ఇంకెందుకు ఆలస్యం, మీలో అణచిపెట్టి ఉన్న అడ్రినాలిన్ బయటకు తీసి ఇలాంటి ఒక సాహసానికి ప్రయత్నించండి.


### విరుపాపూర్ గడ్డి దగ్గర

హిప్పీ జీవన శైలి గడపండి. హిప్పీ ద్వీపం అని ప్రేమగా పిలవబడే విరుపాపూర్ గడ్డి, హంపీకి కొన్ని కిలో మీటర్ల దూరంలో ఉంటుంది. విదేశీ యాత్రికుల రాకపోకలతో, దాని నిర్మలమైన అందంతో ఈ ప్రదేశం అందరి దృష్టిని ఆకట్టుకొంది. హంపీ నుంచి ఈ హిప్పీ ప్రదేశం చేరుకోవడానికి పట్టణం మధ్య నుంచి తెప్పలో నదిని దాటాలి.

### హంపీ బజార్‌లో షాపింగ్...

విజయనగర సామ్రాజ్య సమయంలో హంపీ బజార్ ఒక




ముఖ్యమైన మార్కెట్ స్థలంగా ఉండేది. ఇప్పుడు ఆ మార్కెట్‌కి పూర్వపు వైభవం లేనప్పటికీ, ఇంకా కొన్ని పురాతన వస్తువులు అమ్మే మార్కెట్‌గా కొనసాగుతుంది. వివిధ దేశాల నుంచి హిప్పీ జనాల ఆకర్షణ పెరగడం వలన వివిధ ఉల్లాసకరమైన, ప్రాచీనమైన ఆభరణాలు, కళాఖండాలు ఇక్కడ మీకు దొరుకుతాయి. నాణేలు, అరుదైన నగలు, మట్టి వస్తువులు తదితరమైనవి కొనుగోలు చేయవచ్చు.

హేమకుట కొండ సూర్యాస్తమయాన్ని చూసి తీరాల్సిన ప్రదేశం. హేమకుట కొండ ఒక ఎత్తైన ప్రదేశంలో ఉన్న విగ్రహాల నిధి. ఈ విగ్రహాలన్నీ విజయనగర నిర్మాణ శైలిలో కాకుండా వేరే విధంగా కట్టబడటంచే జైన్ మందిరాలు అనుకొని పొరపడతారు. ఈ కొండ మీద షుమారు 50 విగ్రహాలు, గుళ్ళు, గ్యాలరీలు ఉన్నాయి. ఇవి విజయనగర పరిపాలన కంటే ముందే కట్టబడ్డాయి. కొండ మీదకు నడిచి వెళ్ళి అద్భుతమైన సూర్యాస్తమయం, హంపీ యొక్క విస్తృత వ్యూ దృశ్యాన్ని వీక్షించవచ్చు.

అవశేషాలను కలిగిన హంపి ఆలయ శిధిలాలను, స్మారక చిహ్నాలను కఠినమైనవిగా, గొప్పవిగా అభివర్ణిస్తూ 1986లో యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా హంపిని గుర్తించింది.

-సువేగా,
m : 9030 6262 88
e: desk.deccan@gmail.com



# బిద్రీ దశాబ్దాల హస్తకళ

భారతీయ మెటల్ క్యాస్టింగ్ యొక్క అత్యుత్తమ సంప్రదాయాల్లో ఒకటి బీద్రి. హైదరాబాద్‌కు సుమారుగా 145 కి.మీ దూరంలో, బహమని, బీదరీ సామ్రాజ్యాల రాజధానిగా ఉన్న బీదర్ నగరంలో మొదటగా ఈ కళ రూపుదిద్దుకుంది. ఈ కళ మూలాలు ఎక్కడో ఇంకా తేలనప్పటికీ, ఇస్లామిక్ ప్రపంచంలో ఇది పరిపూర్ణతను సంతరించుకుంది. అక్కడి నుంచి అది దక్షిణ భారతదేశానికి చేరుకుంది. దక్కన్ పాలకులు ఈ కళను పెంచి పోషించారు. ఈ మెటల్ వర్క్ శైలి, డెకొరేటివ్ ఎలిమెంట్స్ రెండూ కూడా హిందూ, ముస్లిం హస్త కళాకారుల స్థానిక సంప్రదాయాలు, హస్తకళానైపుణ్యాలచే ప్రభావితమయ్యాయి. ముస్లింలు ఈ కళను బాగా ఆదరించి పెంచి పోషించారు. అత్యున్నత స్థాయి హస్తకళానైపుణ్యం బీద్రీ కళలో కనిపిస్తుంది

కొన్ని దశాబ్దాల క్రితం క్షీణించిన ప్రపంచ ప్రఖ్యాత కళాత్మక మెటాలిక్ వర్క్ (బిద్రీ హస్తకళ) ప్రస్తుతం అనేక వినూత్న డిజైన్‌లు, కొత్త నమూనాలను ప్రవేశపెట్టిన తర్వాత పునరుద్ధరణ మార్గంలో ఉంది. ఈ డిజైన్‌లు తాజా ఇల్లు, జీవనశైలి అవసరాలు, అంతర్గత ప్రదేశాలకు అనుగుణంగా భారతీయ నుండి అంతర్జాతీయ థీమ్‌లను సూచిస్తాయి. భారతదేశంలోని కర్ణాటక రాష్ట్రంలోని బీదర్, తెలంగాణలోని హైదరాబాద్ బిద్రివేర్‌కు ప్రసిద్ధ కేంద్రాలు. భారతదేశంలోని కొన్ని ఇతర కేంద్రాలలో కూడా ఇది ఆచరణలో ఉంది. అద్భుతమైన కళాఖండాల కారణంగా, బిడ్రివేర్ భారతదేశ హస్తకళల మార్కెట్ నుండి ఒక ముఖ్యమైన ఎగుమతి హస్తకళ వస్తువుగా పరిగణించబడుతుంది. అలానే సంపదకు విలువైన చిహ్నంగా పరిగణించబడుతుంది.



బిద్రీ అనేది ఒక లోహ కళ. ఇది నల్లని వస్తువులపై బంగారు, వెండి తీగల అల్లిక ద్వారా చేసే కళ. ఇది ప్రధానంగా బీహార్‌లో ప్రారంభమైనా తరువాత తెలంగాణలోని హైదరాబాద్‌కు విస్తరించింది. ఈ కళకు భారతదేశం భౌగోళిక గుర్తింపు లభించింది. బిద్రి సామానుకు తెలంగాణలోని హైదరాబాద్ ప్రసిద్ధి చెందింది.

ప్రత్యేకమైన కళాకృతిని మొదట పెర్షియన్ కళాకారులు బహుమతిగా ఇచ్చారు. పర్షియా నుండి నైపుణ్యం కలిగిన బిద్రీ కళాకారులు బీదర్‌కు వచ్చి రాజ కుటుంబాల కోసం కళాఖండాలను రూపొందించడానికి బిద్రీ కళాకారులకు శిక్షణ ఇచ్చారు. కళ్లను కట్టిపడేసే మొఘల్ మూలాంశాలు క్రాఫ్ట్ యొక్క సాంప్రదాయిక కోణాన్ని మార్చకుండా కళాత్మకంగా చెక్కబడ్డాయి. హైదరాబాద్‌లో మార్కెటింగ్, ఎగుమతి అవకాశాలు ఎక్కువగా ఉన్నందున హస్తకళాకారులు బీదర్ నుండి వలస వచ్చారు.

### చరిత్ర

బిద్రీవేర్ అనేది ప్రఖ్యాత మెటల్ హస్తకళ, ప్రస్తుతం కర్ణాటకలో ఉన్న బీదర్ నుండి దాని పేరు వచ్చింది. ఇది బహమనీ సుల్తానుల పాలనలో 14వ శతాబ్దంలో ఉద్భవించిందని నమ్ముతారు. కాబట్టి 'బిడ్రివేర్' అనే పదం బీదర్ ప్రాంతం పేరు పెట్టబడిన ప్రత్యేకమైన మెటల్‌వేర్ తయారీని సూచిస్తుంది. 14-15 శతాబ్దాలలో బహమనీ



సుల్తానులు బీదర్‌ను పాలించారు. బిద్రివేర్‌ను మొదట ప్రాచీన పర్షియాలో అభ్యసించారు. తర్వాత దానిని ఖ్వాజా మొయినుద్దీన్ చిస్తీ అనుచరులు భారతదేశానికి తీసుకువచ్చారు. పెర్షియన్, అరబిక్ సంస్కృతుల మిశ్రమం కారణంగా కళారూపం అభివృద్ధి చెందింది. స్థానిక శైలితో కలయిక తర్వాత, దాని స్వంత కొత్త, ప్రత్యేకమైన శైలి సృష్టించబడింది. 1947కి ముందు నిజాం హైదరాబాద్ రాష్ట్రంలో భాగమైన ఔరంగాబాద్‌లో హైదరాబాద్ నిజాం ఈ కళారూపాన్ని ప్రవేశపెట్టాడు.

మొదట ఈ కళ ఫర్షియా నుండి బహమనీ సుల్తానుల ద్వారా 14వ శతాబ్దంలో బీహారుకు చేరింది. బీహార్ పలు ప్రాంతాలలో అనేక మంది ఈ కళా కారులు వలసలు రావడం ద్వారా బీహార్‌లో ఈ కళను చేసే వారు అధికంగా ఉండేవారు. వారు హైదరాబాద్ నవాబుల వద్దకు ఈ వస్తువులు అమ్మకమునకు తీసుకు రావడం చేసేవారు. అలా మొదలైన వారి అమ్మకాలు అధికంగా ఉండటం వలన క్రమముగా హైదరాబాద్ చుట్టుప్రక్కల పలు ప్రాంతాలలో స్థిరనివాసాలు ఏర్పాటు చేసుకోవడ ద్వారా ఈ కళ హైదరాబాద్‌లో ఎక్కువగా అభివృద్ధి చెందింది.



### తయారీ విధానం

బిద్రీ అనేది ఎనిమిది దశల ప్రక్రియ. అవి మౌల్డింగ్, ఫైల్ ద్వారా సున్నితంగా చేయడం, ఉలి ద్వారా డిజైన్ చేసే ప్రక్రియ. దాని తర్వాత ఉలి, సుత్తిని ఉపయోగించి చెక్కడం జరుగుతుంది. ఇక్కడ స్వచ్ఛమైన వెండి పొదగడం జరుగుతుంది. మట్టి, అమ్మోనియం క్లోరైడ్‌ను ఉపయోగించడం ద్వారా బఫింగ్, చివరకు ఆక్సీకరణం చేయడం ద్వారా ఇది మళ్లీ సున్నితంగా మార్చబడుతుంది. అందువల్ల బిద్రివేర్ కాస్టింగ్ ద్వారా 1:16 నిష్పత్తిలో రాగి, జింక్ లోహాల మిశ్రమం నుండి తయారు చేయబడుతుంది.

బిద్రీ కళ ప్రధానంగా అలంకరణకు వాడు వస్తువులపై ఉంటుంది. కుందెలు, బొత్తములు, కుండలు, పాత్రలు వంటి వాటిపై చేస్తారు. వీటి తయారీకి కావలసిన ఒక రకమైన మట్టి ఎక్కువగా బీహార్ పరిసర ప్రాంతాలలో దొరుకుతుంది. కాపర్, జింక్ మిశ్రమంతో చేసిన లోహం మీద వెండి లేదా బంగారు తీగలను చొప్పిస్తూ వీటిని చేస్తారు. ద్రవరూపంగ ఉండే ఈ మిశ్రమాన్ని కావలసిన ఆకారంలోకి వచ్చేలా అచ్చులలో పోస్తూ చల్లార్చుతారు. తరువాత అవి నలుపు రంగుకు మారేలా కాపర్ సల్ఫేట్ పూత పూస్తారు. దానిమీద కావలసిన డిజైన్లు గీస్తారు. సన్నని సూదులతో డిజైన్ వెంబడి రంధ్రాలు చేస్తూ వాటి గుండా సన్నని వెండి తీగలను చొప్పిస్తూ అవి ఊడకుండా చిన్నగా సుత్తితో కొడుతూ గట్టిగా అతుక్కొనేలా చేస్తారు. ఆపై మళ్ళీ మొత్తంగా ఆ వస్తువులను సానబెడతారు. అప్పుడు నల్లని పొర ఊడిపోయి తెల్లని డిజైన్ మెరుస్తూ కనిపిస్తుంది. తరువాత ఆ కళాఖండము నల్లగా మెరిసేందుకు బీదర్ ప్రాంతాలలో దొరికే ఒకవిధమైన మట్టిని వాడుతారు. అమ్మోనియం క్లోరైడ్, కాపర్ సల్ఫేట్, నైట్రేట్ సోడియం, క్లోరైడ్, పొటాషియం నైట్రేట్‌ల మిశ్రమంతో ఈ మట్టిని కలిపి ఆ వస్తువులకు మొత్తంగా పూసి వాటిని వేడి చేస్తారు. ఆ మిశ్రమం వెండి, బంగారు తీగలను తప్ప మిగిలిన భాగాన్ని అంతటినీ నల్లగా మారుస్తుంది.

తయారీదారులు పూలు, ఆకులు, రేఖాగణిత నమూనాలు, శైలీకృత గసగసాల మొక్కలు, మానవ బొమ్మలు మొదలైన డిజైన్‌లను రూపొందిస్తారు. కొన్ని దేశాల్లో పెర్షియన్ గులాబీల రూపకల్పనకు, పవిత్ర ఖురాన్ నుండి అరబిక్ లిపిలోని భాగాలకు విపరీతమైన డిమాండ్ ఉంది. పాన్ హోల్డర్‌లు, హుక్కాలు, కుండీల తయారీకి అలాగే గిన్నెలు, ఆభరణాల పెట్టెలు, చెవిపోగులు, ట్రేలు మరియు ఇతర నగలు, షోపీస్ వస్తువుల తయారీకి కూడా ఉపయోగించబడుతుంది.

లేపాక్షి ద్వారా ప్రభుత్వం అన్ని ఉత్పత్తులను మార్కెట్ చేస్తుంది.


–సువేగా,
m : 9030 6262 88
e: desk.deccan@gmail.com

# సాదత్ హసన్ మంటో ఐదవ విచారణ

బ్రిటిష్ వాళ్ల కాలంలో ఉన్న కోర్టులు, స్వాతంత్రం వచ్చిన తరువాత వున్న కోర్టుల కన్నా చాలా బాగా పనిచేసాయి. ఈ విషయం మన అనుభవం లోకి రాలేదు కానీ, అవి మంటో అనుభవంలో వున్నవే. మంటో వాటిని చూశాడు ఇబ్బందులు కూడా పడ్డాడు. బ్రిటిష్ వాళ్లు వెళ్లిపోయిన తర్వాత మంటో సమస్యలు మరింత పెరిగాయి. కొత్తగా ఆవిర్భవించిన పాకిస్థాన్లో అతను ఒక విభిన్నమైన 'మోరల్ కోడిని' చూశాడు. అసహనంతో ఉన్న "రాజ్యాన్ని" చూశాడు. కొత్త కేసులని ఎదుర్కొన్నాడు.

అతని రాతలు అసభ్యకరంగా ఉన్నాయని మంటోపై చాలాసార్లు బ్రిటిష్ ఇండియాలో కేసులు పెట్టారు. అతను విచారణని ఎదుర్కొన్నాడు. అయితే బ్రిటిష్ ఇండియా తర్వాత అతని కష్టాలు మరింత పెరిగాయి.

"తండా ఘోస్ట్" కథ తరువాత మంటో చాలా ఇబ్బందులు పడ్డాడు. ఐదు విచారణలను ఎదుర్కొన్నాడు. దాని మీద ఓ వ్యాసం రాసాడు. కొత్త కేసు మొదలైంది. విచారణ లాహెూర్ లో జరిగింది.



**మంటో మాటల్లో ..**

నేను రాసిన రాతలకి నేను నాలుగుసార్లు విచారణని ఎదుర్కొన్నాను. ఐదవ విచారణ గురించి అది మొదలైన విధానం గురించి నేను మీకు చెప్పదలుచుకున్నాను. నాలుగు విచారణలు ఎదుర్కోవడానికి కారణం నేను రాసిన నాలుగు కథలు వరుసగా

1. కాళీ శల్వార్ (బ్లాక్ లెగ్గిన్స్)
2. ధ్రువ్ (స్మోక్)
3. భూ
4. తండా ఘోస్ట్ (కోల్డ్ మీట్)

ఈ నాలుగింటి తో పాటు నేను రాసిన ఒక వ్యాసం కూడా విచారణ ఎదుర్కోవడానికి దారితీసింది.

ఊపర్ నీచే ఔర్ దర్మియా (above, neechey and in between) కాళీ శల్వార్ మీద విచారణ కోసం నేను ఢిల్లీ నుంచి లాహెూర్‌కి మూడు సార్లు వచ్చాను. దువాన్, భూ కేసులు మరీ బాధ పెట్టాయి. నేను చాలా కష్టపడాల్సి వచ్చింది. బాంబే నుంచి లాహెూర్‌కి తిరగాల్సి వచ్చింది.

'తండా ఘోస్ట్'తో అది పరాకాష్టకు చేరుకుంది. అప్పటికే నేను పాకిస్థాన్‌లో స్థిరపడ్డాను. ఆ కేసు కోసం ప్రత్యేకంగా ప్రయాణాలు చేయాల్సిన అవసరం లేదు.

అయినా కేసు విచారణ జరిగిన పద్ధతిని నేను భరించలేక పోయాను. సున్నిత మనస్కులు ఎవరూ ఆ బాధని భరించలేరు. మరీ ముఖ్యంగా నా లాంటి వ్యక్తి.

అన్ని అవమానాలకు కేంద్రం కోర్టు. అన్ని అవమానాలని మౌనంగా భరించాల్సి ఉంటుంది. అక్కడికి ఎవరూ వెళ్లకుండా ఉండాలని నేను అల్లాని ప్రార్థిస్తాను. దాన్నే మనం కోర్ట్ ఆఫ్ లా అని అంటున్నాం. అలాంటి స్థలాన్ని నేనెప్పుడూ చూడలేదు. నేను పోలీసులని ఇష్టపడను. తీవ్రమైన నేరాలు చేసిన వ్యక్తులతో ప్రవర్తించినట్టుగా నాతో పోలీసులు ప్రవర్తించారు.

కరాచీలో ఉన్న ఓ మ్యాగజైన్. దాని పేరు పాయల్ ఈ మాష్రిక్. (message of the east) నా వ్యాసాన్ని నా పర్మిషన్ లేకుండా అందులో ప్రచురించారు. లాహెూర్ లోని ఓ పత్రికలో నుంచి ఆ వ్యాసాన్ని వారు తీసుకున్నారు. దాని మీద కరాచీ ప్రభుత్వం వారెంట్‌ను జారీ చేసింది.

నేను ఇంట్లో లేనప్పుడు, ఇద్దరు సబ్ ఇన్స్‌పెక్టర్‌లు, నలుగురు కానిస్టేబుల్స్ మా ఇంటిని చుట్టుముట్టారు 'నా భర్త ఇంట్లో లేడు. మీకు అవసరమైతే అతని నేను పిలిపిస్తాను' వాళ్లతో చెప్పింది నా భార్య. కానీ వాళ్లు ఆమె చెప్పిన విషయాన్ని ఏ మాత్రం నమ్మలేదు.

నేను ఇంట్లోనే ఉన్నానని వాళ్లు అనుమానించారు. అబద్ధం చెబుతోందని అనుకున్నారు.

అప్పుడు నేను చౌదరి నజీర్ అహ్మద్ సవేరా దగ్గర వున్నాను. అతను సవేరా పత్రికకి యజమాని. ఓ కథ రాయమని నన్ను కోరాడు. ఓ కథ రాయడానికి నేను సిద్ధమయ్యాను. ఓ పది వాక్యాలు రాశాను. సరిగ్గా అప్పుడే రషీద్ నాకు తమ్ముడి వరస అవుతాడు. అతను అక్కడికి వచ్చాడు. కొన్ని క్షణాలు ఆగి 'కథ రాస్తున్నావా..?' అని అడిగాడు.

"ఇప్పుడే కథ రాయడం మొదలు పెట్టాను" అన్నాను నేను. అది పెద్ద కథగా మారే అవకాశం ఉంది.

"ఓ చెడు వార్త చెప్పడానికి వచ్చాను. పోలీసులు మీ ఇంటి చుట్టు ముట్టారు. నువ్వు ఇంట్లో లేవు అని చెప్పినా కూడా వాళ్లు నమ్మడం లేదు. ఇంట్లోకి వెళ్ళే మాదిరిగా ఉన్నారు" అని చెప్పాడు.

అహమ్మద్ రాహీ, హమీద్ అక్తర్ అన్న నా మిత్రులని తీసుకొని ఇంటికి బయల్దేరాను. ఇంటికి బయలుదేరే ముందు చౌదరి రాశీద్‌తో ఒక మాట చెప్పాను. "పత్రికల వాళ్ళు అందరికి ఈ విషయం తెలియ


చేయండి. అక్కడ ఏం జరుగుతుందో తెలుసుకొని మరుసటి రోజు పేపర్లో వచ్చే విధంగా చూడండి" అని చెప్పాను.

నేను ఇంటికి చేరుకోగానే పోలీసులు ఇంటి బయట కనిపించారు. నా బంధువులు హమీద్ జలాల్, మా బావ మరిది జహీరుద్దీన్ పోలీసు వారి కార్ల దగ్గర నిల్చుని ఉన్నారు.

"మీరు ఇంటిని సోదా చేస్తే చేయండి. కానీ మంటో ఇంట్లో లేడు" అని వాళ్లు చాలా మర్యాదపూర్వకంగా పోలీసులకి చెబుతున్నారు.

అబ్దుల్ మాలిక్ కూడా అక్కడ ఉన్నాడు. ఎవరో పోలీసులతో మాట్లాడుతూ ఉన్నాడు. అతను ఓ ఫేక్ కమ్యూనిస్ట్.

సబ్ ఇన్స్‌పెక్టర్ మా ఆవిడని, మా చెల్లెలిని కూడా బెదిరించినట్టు నాకు తెలిసింది. వాళ్లు బలవంతంగా ఇంట్లోకి వెళ్లడానికి ప్రయత్నం కూడా చేశారని కూడా తెలిసింది. నన్ను చూసి వాళ్లు కొంత శాంతించినట్లు అనిపించింది. వాళ్లని ఇంట్లోకి ఆహ్వానించాను.




ఇద్దరు పోలీసు సబ్ ఇన్స్‌పెక్టర్లు చాలా కఠినంగా ఉన్నారు.

"ఎందుకు వచ్చారు" అని వాళ్లను అడిగాను.

తమ దగ్గర వారెంట్ ఉందని, ఇల్లు సోదా చేయడానికి వచ్చామని, ఆ వారెంట్ కరాచీ ప్రభుత్వం ఇచ్చిందని" చెప్పారు.

నేను ఆశ్చర్యపోయాను. నేను గూఢచారిని కాదు. స్మగ్లర్‌ని, మాదకద్రవ్యాలను అమ్మే వ్యక్తిని అంతకన్నా కాదు. నేను ఒక రచయితని. ఇప్పుడు నా ఇల్లు సోదా చేయాల్సిన అవసరం ఏముంటుంది. వాళ్లకి ఎక్కడ ఏమి దొరుకుతుంది.

"నీ లైబ్రరీ ఎక్కడుంది..?" అని నన్ను వాళ్లు ప్రశ్నించారు.

"పాకిస్తాన్‌లో నా లైబ్రరీ ఏమీ లేదు" అని వాళ్లకు చెప్పాను.

"నేను నా వెంట కొన్ని పుస్తకాలు తెచ్చుకున్నాను అందులో మూడు డిక్షనరీలే. ఎక్కువగా ఏమీ లేవు" అని వాళ్లకు చెప్పాను.

నా లైబ్రరీని బాంబేలో వదిలిపెట్టి వచ్చాను అని కూడా చెప్పాను.

ఏదైనా ప్రత్యేకంగా వెతుకుతున్నట్లైతే బొంబాయి అడ్రస్ ఇస్తాను. అక్కడ మీరు వెతుక్కోవచ్చు అని చెప్పాను.

నేను చెప్పే మాటలు వాళ్ళకి రుచించలేదు. నా ఇంట్లో సోదా చేయడం మొదలుపెట్టారు. నా ఇంట్లో ఆరు పుస్తకాలు, ఎనిమిది ఖాళీ బీరు సీసాలు తప్ప మరేమీ లేవు. ఓ చిన్న బాక్స్‌లో కాగితాలు మాత్రం ఉన్నాయి. అవి పేపర్ క్లిప్పింగ్స్. ఆ కాగితాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆ పేపర్ క్లిప్పింగ్స్‌ని పోలీసులు జప్తు చేశారు.

ఆ దశలో వారెంటు చూపించమని పోలీసులని అడిగాను. వాళ్లు నిరాకరించారు. ఓ కానిస్టేబుల్ చాలా దూరం నుంచి వారంట్‌ని చూపించాడు.

"ఏమిటి ..?" అని అడిగాను.

"దానివల్లే ఇక్కడిదాకా వచ్చాం" అని వాళ్ళు చెప్పారు.

అది చూడాలని నేను ఒత్తిడి చేశాను. వాళ్ళు గట్టిగా పట్టుకున్నారు తప్ప చూపించలేదు.

"కనీసం చదవండి" అని అడిగాను.

దాన్ని నేను పరిశీలనగా చూశాను. అది నా అరెస్టు వారెంట్.

జామీన్ దార్‌ల కోసం నా మనసు ఆలోచించడం మొదలు పెట్టింది. అధికారులు నేను చెప్పిన జామీన్ దారులను ఆమోదించడానికి నిరాకరించారు.

మా అల్లుడు ఒకతను గెజిటెడ్ ఆఫీసర్. మా బావ మరిది కూడా.

"మీరిద్దరూ ప్రభుత్వ ఉద్యోగులు. ఇలాంటి వ్యక్తికి మీరు జామీను ఇస్తే మీరు డిస్మిస్ అవుతారు" అని వాళ్ళని బెదిరించారు పోలీసులు.

ఆ తరువాత నన్ను అరెస్టు చేశారు. ఆ బెయిల్ మీద విడుదలయినాను. వాయిదా వాయిదాకి నేను కరాచీకి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో ఆరోగ్యం బాగా లేదని డాక్టర్ సర్టిఫికేట్ పెడితే హాజరు మినహాయింపు లభించేది. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేకుండా పోయింది.

నాకు బెయిల్ ఇవ్వడం కోసం చాలా మంది మిత్రుల కోసం చూశాను. కానీ వాళ్ళు ఎవరు వాళ్ళ ఇళ్లలో కనిపించలేదు.

చివరికి మహమ్మద్ తుఫైల్ జామీను ఇచ్చాడు. అతను నక్వ్యాష్ అనే పత్రిక యజమానీ సంపాదకుడు కూడా. తన తన దగ్గర ఉన్న అన్ని పుస్తకాలని ఐదు వేల రూపాయల విలువ గల వాటిని జామీను గా ఇచ్చాడు.

కోర్టు సంతృప్తి చెందలేదు.

తుఫెయిల్ సాహెబ్ మా ఇంటికి వచ్చాడు. ఆరోజు నేను కరాచీ వెళ్ళాలి ఐదు గంటలకి. రెండు సెకండ్ క్లాస్ టికెట్లు తీసుకొని వచ్చాడు. ఓ స్నేహితుడిని నా వెంట పంపించాడు. అతని పేరు నాసిర్ అన్వర్. అతను కరాచీలో జామీన్ తెస్తాడని చెప్పాడు.

రైల్వే స్టేషన్ దాకా వచ్చి అతను వెళ్ళిపోయాడు.

కరాచీలో ఏం జరిగింది ఎలా జరిగింది..

ఆ తరువాత..

-మంగారి రాజేందర్ (జింబో)
m : 9440483001
e : rajenderzimbo@gmail.com



# తెలంగాణాలో సాగునీటి ప్రాజెక్టులు – పర్యావరణ పునరుద్ధరణ

**మిషన్ కాకతీయ:**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే తెలంగాణ ఉద్యమ ఆకాంక్ష, తెలంగాణా ప్రజల స్వప్నం అయిన చెరువుల పునరుద్ధరణ కార్యక్రమాన్ని మిషన్ కాకతీయ పేరుతో, మన ఊరు మన చెరువు ట్యాగ్ లైన్‌తో బృహత్తరమైన ఫ్లాగ్ షిప్ ప్రోగ్రాంని రూపకల్పన చేసారు ముఖ్యమంత్రి కెసిఆర్. ఆ ప్రోగ్రాంని కేవలం ప్రభుత్వ కార్యక్రమంగా కాక ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యంతో నడిచే ఒక ప్రజా ఉద్యమ కార్యక్రమంగా జరగాలని ఆయన బావించారు. ఈ నాలుగేండ్లలో మిషన్ కాకతీయ కార్యక్రమం నాలుగు దశల్లో అమలయింది. తెలంగాణా గ్రామీణ ప్రాంతాల్లో చెరువుల పునరుద్ధరణ జరిగిన తర్వాత గొప్ప మార్పు కనిపిస్తున్నది. సుస్థిర వ్యవసాయం ఇప్పుడు సాధ్యం అవుతున్నది. చెరువుల్లో చేపల పెంపకం గణనీయంగా పెరిగింది. గ్రామీణ ప్రజల వలసలు తగ్గిపోయినాయి. పశువులకు, గొర్లు, మేకలకు నీటి తావులు ఏర్పడ్డాయి. మేతకు దూర ప్రాంతాలకు తోలుకుపోయే అగత్యం తగ్గింది. పశు పక్ష్యాదులకు నీటి తావులు ఏర్పడినాయి. భూగర్భ జలాల్లో వృద్ధి కనిపిస్తున్నది. చేపల పెంపకం రెట్టింపు అయ్యింది. రాష్ట్రంలో గతంలో ఎన్నడూ కనబడని పక్షి జాతులు చెరువుల వద్ద దర్శనమిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రానికి వలస పక్షుల రాక గతంలో కంటే పెరిగినట్టు ఇటీవల రాష్ట్ర అటవీ శాఖ వారు నిర్వహించిన "బర్డ్ వాచ్" కార్యక్రమాల్లో తేలింది. మిషన్ కాకతీయ ప్రభావాలు, ఫలితాలను సంక్షిప్తంగా తెలుసుకుందాం.

**మిషన్ కాకతీయ ఫలితాలు :**

1) చెరువుల కింద మొత్తం ఆయకట్టు : 21 లక్షల ఎకరాలు
2) నాలుగు దశల్లో పునరుద్ధరణ పొందిన చెరువులు : 27,625
3) పూర్తి అయిన చెరువుల కింద స్థిరీకరించబడిన ఆయకట్టు : 15.05 లక్షల ఎకరాలు
4) చెరువుల్లో నుంచి తరలించిన పూడిక మట్టి : 25 కోట్ల క్యూబిక్ మీటర్లు
5) చెరువుల్లో పెరిగిన అదనపు నీటి నిల్వ సామర్థ్యం:9 టిఎంసిలు

**మిషన్ కాకతీయ ప్రభావాలు :**

1) పెరిగిన సాగు విస్తీర్ణం : 57.50%
2) ఖరీఫ్ లో పెరిగిన వరి సాగు విస్తీర్ణం : 4.7%, రబీలో : 26%
3) పెరిగిన వరి పంట దిగుబడి : 4.1%
4) పెరిగిన పత్తి పంట దిగుబడి : 4.7%
5) పూడిక మట్టి చల్లుకున్నందు వలన తగ్గిన రసాయనిక



ఎరువుల వాడకం : 30%

6) పూడిక మట్టిని పొలాల్లో చల్లుకున్నందు వలన పెరిగిన పంట దిగుబడి ఈ విధంగా నమోదు అయ్యింది :

వరి దిగుబడి ఎకరాకు 2 నుంచి 5 క్వింటాళ్ళు
పత్తి దిగుబడి ఎకరాకు 2 నుంచి 4 క్వింటాళ్లు
కందుల దిగుబడి ఎకరాకు 0.5 నుంచి 1.5 క్వింటాళ్లు
మక్క దిగుబడి ఎకరాకు 4 నుంచి 5 క్వింటాళ్లు

7) పెరిగిన చేపల ఉత్పత్తి : 62%

8) చెరువుల్లో సగటున 10 నెలల పాటు నీటి నిల్వలు ఉంటున్నందున భూగర్భ జలాల మట్టం గణనీయంగా పెరిగినట్లు భూగర్భ జల శాఖ నిర్ధారించింది.

9) చెరువుల కట్టలను బలోపేతం చేసినందు వలన చెరువుల వరద నష్టాలు గణనీయంగా తగ్గిపోయినాయి. వేల సంఖ్యలో ఉండే నష్టాలు వందల్లోకి తగ్గిపోయినాయి.

**ప్రాజెక్టులతో చెరువుల అనుసంధానం :**

అయితే ముఖ్యమంత్రి ఆలోచన చెరువుల పునరుద్దరణతోనే ఆగిపోలేదు. మిషన్ కాకతీయ విజన్ సఫలం కావాలంటే వానలు పడినా పడకపోయినా ప్రతీ ఏడు కనీసం 10 నెలల పాటు చెరువుల్లో నీరు నిలువ ఉండాలి. రెండు పంటలకు నీరు అందాలి. భూగర్భ జలాలు పైకి రావాలి. ఇందుకు చెరువులను భారీ, మధ్యతరహా ప్రాజెక్టులతో అనుసంధానం చేసినప్పుడే సాధ్యం అవుతుందని ముఖ్యమంత్రి భావించారు. తెలంగాణ రాష్ట్రంలో గత ఐదేండ్ల పాలనా కాలంలో అనేక భారీ, మధ్యతరహా, ఎత్తిపోతల ప్రాజెక్టులు నిర్మాణం పూర్తి చేసుకొని 2020 వర్షా కాలానికి నీటి సరఫరాకు సిద్దం అయినాయి. ముఖ్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన తెలంగాణా జీవధార కాళేశ్వరం ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చినందువలన వందలాది చెరువులను నింపే అవకాశం వచ్చింది. వీటిని చెరువులతో అనుసంధానం చేయడం ద్వారా చెరువులన్నీ రెండు పంటలకు నీరివ్వగలిగే స్థితి వచ్చింది. వర్షాలు పడినా పడకపోయినా చెరువులను నింపితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ సుస్థిరం అవుతుందన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి ఈ భారీ కార్యక్రమానికి రూపకల్పన చేసారు. ప్రాజెక్టులను చెరువులతో అనుసంధానం వలన రాష్ట్రంలో వేలాది చెరువులు నిండినాయి. ఈ కార్యక్రమం అద్భుత ఫలితాలను ఇచ్చింది. ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారానే శ్రీరాం సాగర్ ప్రాజెక్టు మొదటి దశ, రెండో దశ ఆయకట్టు పరిధిలో సుమారు 1200 చెరువులు నిండినాయి. అట్లనే దేవాదుల, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్ సాగర్, ఎల్లంపల్లి, తదితర భారీ మధ్యతరహా ద్వారా సుమారు 12 వేల చెరువులు నింపినట్టు ప్రాజెక్టుల ఇంజనీర్లు సమాచారం ఇచ్చినారు. చెరువుల అనుసంధానం కూడా జయప్రదం కావడంతో చెరువుల కింద రబీ పంటకు నికరంగా నీరు అందే పరిస్థితి ఏర్పడింది. చెరువులలో నీటి నిల్వ బాగా పెరిగినందు వలన రాష్ట్రంలో భూగర్భ జలాలు పైకి లేచినాయి. ప్రభుత్వం 24 గంటల నాణ్యమైన ఉచిత కరెంటు ఇస్తున్నందున 30 లక్షల బోరు బావుల కింద 50 – 55 లక్షల ఎకరాల్లో సాగు సుస్థిరం అయ్యింది.

**వాగుల పునర్జీవనం కోసం వాగులపై చెక్ డ్యాంల నిర్మాణం:**

చెరువుల అనుసంధానం తో పాటు తెలంగాణా రాష్ట్రంలోని అన్ని ప్రధాన వాగులు, వంకలు పునర్జీవనం పొందాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాజెక్టుల కింద 1.25 కోట్ల ఎకరాల్లో సాగునీరు సరఫరా చేసిన తర్వాత వాగుల్లోకి, నదుల్లోకి వచ్చే 20% పడవాటి (Regenerated) నీటిని ఎక్కడికక్కడ ఒడిసి పట్టడానికి రాష్ట్రంలో ప్రాజెక్టుల ఆయకట్టు పరిధిలో ఉండే అన్ని వాగులపై, నదులపై చెక్ డ్యాంలని నిర్మించాలని ముఖ్యమంత్రి తలపోశారు. ప్రాజెక్టులన్నీ పూర్తి అవుతున్న కారణంగా దాదాపు రాష్ట్రమంతా (కొన్ని ఎత్తైన ప్రాంతాలు మినహా) ఆయకట్టు ప్రాంతంగా



మారబోతున్నది. ఈ ఆయకట్టు నుండి వచ్చే పడవాటి నీరు (Regeneratedwater) తిరిగి ఈ వాగుల్లోకి చేరుతాయి. వీటిని ఎక్కడికక్కడ నిల్వ చేసుకోగలిగితే ఆ ప్రాంతాల్లో ఆ వాగులు పునర్జీవనం చెంది భూగర్భ జలాలు రీచార్జ్ కావడంతో పాటు అనేక రకాలుగా ఈ నీరు గ్రామీణ ప్రాంతాల్లో వినియోగంలోనికి రానున్నాయి. ఈ పడవాటి నీటిని వొడిసి పట్టడానికి చెక్ డ్యాంల నిర్మాణాన్ని చేపట్టాలని ముఖ్యమంత్రి సాగునీటి శాఖ అధికారులను ఆదేశించారు. రోడ్డు భవనాల శాఖ, పంచాయతిరాజ్ శాఖ వారు వాగులపై నిర్మిస్తున్న బ్రిడ్జిలను చెక్ డ్యాంలతో సహా నిర్మించాలని ఇదివరకే ఆదేశాలు ఇచ్చినందున ఆ శాఖలు కూడా చెక్ డ్యాంల నిర్మాణాలు చేపట్టినాయి. వాటిని కూడా అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినారు. ముఖ్యమంత్రి సూచించిన ఈ రెండు కార్యక్రమాల అమలు కోసం సాగునీటి శాఖ విస్తృత అధ్యయనం చేసింది. సర్వే ఆఫ్ ఇండియా వారి మ్యాపులతో పాటు నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ (NRSA) వారి ఉపగ్రహ చిత్రాల సహకారంతో సమాచార సేకరణ సేకరణ చేసి విశ్లేషణ జరిపినారు.

రాష్ట్రంలోని నదులను, వాగులను మొత్తం 8 స్థాయిల్లో వర్గీకరించడం జరిగింది. చెక్ డ్యాంల నిర్మాణానికి స్థలాలను 4 ఆ పైన స్థాయి కలిగిన నదులపై ఎంపిక చేయాలని, ప్రాజెక్టుల ఆయకట్టు ప్రాంతాల్లో ఉన్న వాగులను ప్రథమ ప్రాధాన్యత కింద ఎంపిక చేయాలని ఇంజనీర్లకు సూచించారు. ఇప్పటికే నిర్మించబడిన చెరువులు, జలాశయాలకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా తగినంత నీటి లభ్యత ఉన్న వాగుల పైననే చెక్ డ్యాంలను ప్రతిపాదించాలని, చెక్ డ్యాంల మధ్య దూరాన్ని అక్కడి స్టానిక పరిస్థితులను బట్టి నిర్ణయించాలని, ప్రాజెక్టుల ఆయకట్టు ప్రాంతాల్లో షేక్ హాండ్ చెక్ డ్యాంలు ప్రతిపాదించాలని, ఆయకట్టులో లేని వాగులపై అక్కడి స్థానిక పరిస్థితుల ఆధారంగా ప్రతిపాదించాలని సూచించారు. మంచి రాతి పునాది కలిగిన స్థలాలను ఎంపిక చేయాలని, 3 మీటర్ల లోతున భూగర్భ జలాలు లభ్యం అవుతున్న ప్రాంతాల్లో చెక్ డ్యాంలను ప్రతిపాదించరాదని, భూగర్భ జలాలను అధికంగా తోడేసిన (over-exploited) గ్రామాలకు అధిక ప్రాధాన్యం కల్పించాలని భూగర్భ జల శాఖ వారు సూచించారు. ఈ అంశాలన్నిటిని కలిపి మార్గ నిర్దేశనాలు జారీ చేయడం జరిగింది.

ఇంజనీర్లు సేకరించిన సమాచారం, నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ (NRSA) పటాల అధ్యయనం తర్వాత రాష్ట్రం మొత్తంలో 559 మండలాల్లో సుమారు 48,845 చిన్న నీటి వనరులున్నాయని తేలింది. వీటిలో 27,814 చెరువులు, కుంటలు 12,154 గొలుసుల కింద ఉన్నట్టు తేలింది. ఈ చెరువులను నింపడానికి ప్రాజెక్టుల కాలువలకు ఎక్కడెక్కడ తూములు నిర్మించాలన్న దానిపై స్పష్టత వచ్చింది. గొలుసులకు బయట ఉన్న16,771 చెరువులు, కుంటలను నింపడానికి ప్రత్యామ్నాయ మార్గాలను ఇంజనీర్లు అధ్యయనం చేసినారు. ప్రతీ మండలానికి ఒక ఇర్రిగేషన్ చిత్రపటాన్ని రూపొందించి క్షేత్ర స్థాయి ఇంజనీర్లకు అందజేయడం జరిగింది. ఈ పటాల్లో ఆ మండలంలో ఉన్న చెరువులు, కుంటలు, భారీ, మధ్య తరహా ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలు, వాటి ఆయకట్టు వివరాలు, కాలువల అలైన్మెంట్ తదితర వివరాలు ఉంటాయి. తూముల నిర్మాణానికి, ఫీడర్ చానళ్ళ పునరుద్దరణకు అంచనాలు రూపొందించే పని ఇప్పటికే పూర్తి అయ్యింది. ప్రతీ చెరువుకు ఫీడర్ చానల్ తప్పని సరిగా ఉంటుంది కనుక వీటికి ఎటువంటి భూసేకరణ అవసరం ఉండదు. అయితే తూముల ద్వారా వాటి సహజ ఫీడర్ కు నీరు చేర్చడానికి కొన్ని సందర్భాల్లో కొద్దిపాటి భూసేకరణ అవసరం పడుతుంది. వాటి వివరాలు కూడా సేకరించమని ఇంజనీర్లను ఆదేశించడం జరిగింది.

### చెక్ డ్యాంల నిర్మాణం :

రాష్ట్రం మొత్తంలో ఉండే నదులను, వాగులను, వంకలను 8 స్థాయిల్లో (Orders) వర్గీకరించడం జరిగింది. 4 నుంచి 8 స్థాయి కలిగిన వాగులను పెద్ద వాగులుగా పరిగణించాలి. ఇవి రాష్ట్రంలో 683 ఉన్నట్టు, వారి పొడవు 12,183 కిలోమీటర్లు ఉన్నట్టు అధ్యయనంలో తేలింది. వీటిలో నీటి ప్రవాహాలు ఎక్కువగా ఉంటాయి కనుక ప్రథమ ప్రాధాన్యతలో ఈ వాగులపై చెక్డ్యాంలను ప్రతిపాదించాలని సూచించడం జరిగింది. చెక్డ్యాంల నిర్మాణం రెండు

దశల్లో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినారు. పూర్తి అయిన భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల ఆయకట్టు ప్రాంతాల్లో ఉండే వాగులను మొదటి దశలో ఎంపిక చేసుకోవాలని, రెండవ దశలో ఒకటి రెండు సంవత్సరాల్లో నిర్మాణం పూర్తి చేసుకోబోతున్న ప్రాజెక్టుల ఆయకట్టు ప్రాంతాల్లో ఉండే వాగులపై చెక్ డ్యాంలను ప్రతిపాదించాలని ముఖ్యమంత్రి సూచించినారు.

ఈ వాగులపై ఇప్పటికే 510 చెక్ డ్యాంలు, 245 ఆనకట్టలు, 29 కత్వాలు, 1 మాటు ఉన్నట్టు తెలుస్తున్నది. అని స్థాయిల వాగులపై ఇప్పటికే నిర్మాణం అయి ఉన్న చెక్ డ్యాంల సంఖ్య 2,376 ఉన్నట్టు అధ్యయనంలో తేలింది. అయితే చిన్న స్థాయి వాగుల పైననే పెద్ద సంఖ్యలో చెక్ డ్యాంల నిర్మాణం జరిగినట్టు తెలుస్తున్నది. నాగార్జున సాగర్, శ్రీరాంసాగర్, నిజాంసాగర్, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, జూరాల, కడెం, కొమురం భీం తదితర భారీ మధ్య తరహా ప్రాజెక్టుల కమాండ్ ఏరియాల్లో ఉన్న పెద్ద స్థాయి వాగులపై ఇంకా సుమారు 1235 చెక్ డ్యాంల నిర్మాణానికి అవకాశం ఉన్నట్టు అధ్యయనంలో విశ్లేషించారు. చెక్ డ్యాంల స్థల ఎంపిక దగ్గర నుంచి ప్రతీ దశలోనూ



భూగర్భ జల శాఖతో సమన్వయము చేసుకోవాలని క్షేత్ర స్థాయి ఇంజనీర్లకు సూచించినారు. భూగర్భ జల శాఖ ఎంపిక చేసుకున్న చెక్ డ్యాంల వద్ద రీచార్జ్ గొట్టాలను అమర్చాలని కూడా సూచించారు. ఈ ప్రాథమిక అధ్యయనాల తర్వాత ప్రభుత్వం ప్రాజెక్టులతో చెరువుల అనుసంధానానికి అవసరమయ్యే అదనపు తూముల నిర్మాణానికి (3500), ప్రాజెక్టుల ఆయకట్టు ప్రాంతాల్లో ఉన్న వాగులపై చెక్ డ్యాంల (1235) నిర్మాణానికి రూ. 4296 కోట్లకు పరిపాలనా అనుమతి మంజూరు చేస్తూ తేదీ 8.3.2019న జిఓ 8ని జారీ చేసింది ప్రభుత్వం. దానితో పాటూ వీటి నిర్మాణానికి పాటించవలసిన మార్గనిర్దేశాలాలని కూడా జారీ చేసింది. 2019 వర్షాకాలం నాటికి 80% అదనపు తూముల నిర్మాణం దాదాపు పూర్తి అయ్యింది. ప్రాజెక్టుల ద్వారా చెరువులను నింపే కార్యక్రమం జయప్రదంగా అమలు అవుతున్నది.

మొత్తం 1235 చెక్ డ్యాముల్లో మొదటి దశలో 635 చెక్ డ్యాంలు, మిగిలిన 600 చెక్ డ్యాంలు రెండో దశలో నిర్మాణానికి ఎపిక చేయాలని ముఖ్యమంత్రి సాగునీటి శాఖ అధికారులను ఆదేశించినారు. మొదటి దశ చెక్ డ్యాంల నిర్మాణం 2021 జూన్ నాటికి పూర్తి చేయాలని, ముఖ్యమంత్రి సాగునీటి శాఖ అధికారులను ఆదేశించినారు. వీటికి తోడు రోడ్డ భవనాల శాఖ వారు తెలంగాణా రాష్ట్రంలో నిర్మిస్తున్న వంతెనల వద్ద సుమారు 200 చెక్ డ్యాములను నిర్మిస్తున్నారు. తెలంగాణా వ్యాప్తంగా వాగులు, వంకలు, మంజీరా, మానేరు, కడెం, స్వర్ణ, హల్ది వాగు, మున్నేరు, డిండి, ఆలేరు, ఆకేరు లాంటి నదులు కూడా సజీవం కానున్నాయి. మొదటి దశ చెక్ డ్యాంలు పూర్తి అయిన ప్రాంతాల్లో పర్యావరణంలో గొప్ప మార్పులు చోటు చేసుకున్నాయి. వాగులు పునరుజ్జీవనం చెందాయి. భూగర్భ జలాల మట్టాలు గణనీయంగా పెరిగినాయి. గ్రామీణ ప్రాంతాల్లో పశువులకు, మేకలు, గొర్లకు, వన్య ప్రాణులకు, పక్షులకు తాగునీటి సమస్య తీరింది. అడవులు తిరిగి పునరుజ్జీవనం పొందడానికి చెక్ డ్యాములు దోహదం చేయనున్నాయి. బహుముఖ ప్రయోజనాలున్న చెక్‌డ్యాంల నిర్మాణాలు తెలంగాణా గ్రామీణ ప్రాంతాల రూపురేఖలు మారనున్నాయి.

**కాళేశ్వరం ప్రాజెక్టుతో గోదావరి నది పునరుజ్జీవనం – గోదావరి జలాల సమగ్ర వినియోగం:**

గోదావరి ట్రిబ్యునల్ అవార్డు ఆధారంగా గోదావరి జలాల్లో ఉమ్మడి రాష్ట్రానికి 75% విశ్వసనీయత కలిగిన నికర జలాల కేటాయింపులు 1480 టిఎంసిలు ఉంటాయని లెక్క గట్టి అందులో 968 టిఎంసి లను తెలంగాణా ప్రాజెక్టులకు కేటాయించింది. ఉమ్మడి రాష్ట్రం ఈ కేటాయింపులు చేసినప్పటికీ ప్రాజెక్టులు పూర్తి కాకపోవడం చేత అవన్నీ కాగితాలకే పరిమితం అయినాయి. వాస్తవ వినియోగం ఏనాడూ 400 టిఎంసి లకు మించ లేదు. తెలంగాణా ప్రభుత్వం ఈ అంశాలను కూలంకషంగా మధించి గోదావరి జలాల గరిష్ట వినియోగం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతోనే సాధ్యం అవుతుందని భావించి కాళేశ్వరం ప్రాజెక్టును రూపకల్పన చేసింది. నాలుగేండ్ల రికార్డు సమయంలో పూర్తి అయిన కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణా కోటి ఎకరాల మాగాణిగా మారేందుకు దోహద పడనున్నది. ఎండిపోయిన గోదావరి నది 5 బ్యారేజిల (ఎల్లంపల్లి, సుందిళ్ళ, అన్నారం, మేడిగడ్డ, సమ్మక్క) నిర్మాణంతో సజీవం అయింది. ఎల్లంపల్లి తుపాకుల గూడెం బ్యారేజిల మధ్యన 200 కిలోమీటర్ల గోదావరి నది సజీవం అయినందున పర్యావరణం వృద్ధి అవుతుంది. వట్టిపోయిన శ్రీరాంసాగర్, నిజాంసాగర్, సింగూరు, దిగువ మానేరు తదితర జలాశయాలు, మంజీరా, మానేరు, కూడెల్లి వాగు, హల్దీ వాగు, మోహి తుమ్మెద వాగు తదితర వాగులన్నీ జలకళతో నిండినాయి. ఈ వాగులు, నదులపై చెక్‌డ్యాంలు పొంగి పొరలుతున్నాయి. అవితమ ప్రతిపాదిత లక్ష్యాలను నేరవేర్చ గలుగుతాయి. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సుమారు 45 లక్షల ఎకరాలకు (శ్రీరాంసాగర్, నిజాంసాగర్, సింగూరు, చెరువుల కింద ఆయకట్టు స్థిరీకరణ కలుపుకొని) సాగునీరు అందుతుంది. 1 కోటి 80 లక్షల ప్రజానీకానికి తాగునీరు అందిస్తుంది. పరిశ్రమలకు స్థాపనకు నీరు అందిస్తుంది. తెలంగాణ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ఒక ప్రగతి యంత్రంగా (Growth Engine) మారనున్న కాళేశ్వరం ప్రాజెక్టు.

– శ్రీధర్‌రావ్ దేశ్‌పాండే
e : rrigationosd@gmail.com

# అంతర్జాతీయ ప్రమాణాలతో
# దేశీయ అవసరాలు తీర్చుతున్న ఈసీఐఎల్

వ్యూహాత్మక ఎలక్ట్రానిక్స్‌లో స్వయం సంవృద్ధిని సాధించి, దేశీయ అవసరాలు తీర్చాలన్న లక్ష్యంతో ఏర్పడిన ప్రెస్టీజియస్ సంస్థ ఎలక్ట్రానిక్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా. ఈసీఐఎల్‌గా అందరికీ సుపరిచితమై ప్రపంచఖ్యాతినార్జించిన ఈ సంస్థ అణు శక్తి విభాగం ఆధ్వర్యంలో 11 ఏప్రిల్, 1967లో మన హైదరాబాద్‌లోని కుషాయి గూడ ప్రాంతంలో ఆవిర్భవించింది. దూసుకుపోయే క్షిపణులు, విమానాల కాక్‌పిట్ వాయిస్ రికార్డర్లు, అణువిద్యుత్‌ను సృష్టించే రియాక్టర్లు, రేడియేషన్‌ను గుర్తించే డిటెక్టర్లు, వినోదాలు పంచే టీవీలు, వైద్య చికిత్సకు ఉపయోగించే ఉపకరణాలు... మరీ ముఖ్యంగా దేశంలో ఓటింగ్ ప్రక్రియను సులభతరం చేసిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ – ఈవీఎంల తయారీ వంటివి ఈసీఐఎల్ సొంతం. ఈసీఐఎల్ సంస్థ ఐదు దశాబ్దాలుగా దేశీయ ఎలక్ట్రానిక్స్ ప్రగతిలో ఎంతో కీలకపాత్ర పోషిస్తోంది.



**ఈసీఐఎల్ ఆవిర్భావం**

దేశంలో న్యూక్లియర్ ఎనర్జీ వినియోగానికి సంబంధించి పాలసీ, ఫ్రేమ్‌వర్క్ రూపకల్పన కోసం 1960లో 'ఆటమిక్ ఎనర్జీ కమిషన్'ను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలోనే డాక్టర్ హోమీ జే బాబా సారథ్యంలో 'ఆటమిక్ ఎనర్జీ ఎస్టాబ్లిష్‌మెంట్ ట్రోంబే– ఏఈఈటీ' ఏర్పాటు అయింది. అత్యంత ప్రతిభావంతుడైన హోమీ బాబా, న్యూక్లియర్ ఎనర్జీని మరింత వినియోగంలో తెచ్చేందుకు దేశీయంగా ఎలక్ట్రానిక్ ఎక్విప్ మెంట్‌లను తయారు చేయాలని తలచారు. ఈసీఐఎల్ ఏర్పాటులో... అదే సమయంలో హోమీ బాబాతో కలిసి పనిచేసిన ఎ.ఎస్.రావు కీలక పాత్ర పోషించారు. ఈ ఎక్విప్‌మెంట్స్ తయారీకి దేశంలో అణువైన ప్రదేశాన్ని ఎంపిక బాధ్యతను తీసుకున్న ఏఈఈటీ హైదరాబాద్‌ను సూచించింది. ఎలక్ట్రానిక్స్ రంగంలో అభివృద్ధి చెందిన దేశాలకు ధీటుగా.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో... అలా ఈసీఐఎల్ ఏర్పాటై తన కార్యకలాపాలు ప్రారంభించింది. ఈ సంస్థ ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన ఎ.ఎస్.రావు, మొదటి మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేసి... ఈసీఐఎల్ సృష్టించిన అద్భుతాలకు సాక్ష్యంగా నిలిచారు.

పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డి)కి సంబంధించి.. ఈసీఐఎల్ ప్రారంభమైన తొలి దశాబ్దకాలం స్వర్ణయుగంగా చెప్పుకోవచ్చు. బాబా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్, ఏఈఈటీల నుంచి పరిశోధనా విధానాలను అందిపుచ్చుకుంది. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని ఈసీఐఎల్ పరిశోధకులు అనేక అద్భుతాలను సృష్టించారు. ముఖ్యంగా అసిలోస్కోప్స్, స్పెక్ట్రోమీటర్స్, అల్ట్రాసోనిక్ ఫ్లా డిటెక్టర్స్, రైల్వేలకు అసవరమైన 'ఈ టైప్ ఎక్సైటేషన్ సిస్టమ్స్, ఇంకా కొన్ని మెడికల్ ఎక్విప్‌మెంట్స్‌ను ఈసీఐఎల్ తయారు చేసింది. డయాడ్స్, ట్రాన్సిస్టర్స్, పవర్ ట్రాన్సిస్టర్స్ వంటి యాక్టివ్ కాంపోనెంట్స్‌తోపాటు మౌల్డెడ్ మెటల్ ఫిల్మ్ రెసిస్టర్స్, పొటెన్షియోమీటర్స్, టాంటాలమ్ కెపాసిటర్స్‌ను ఉత్పత్తి చేసింది.

**ఈసీఐఎల్ అభివృద్ధి అడుగులు-**

80, 90వ దశకాల్లో ఈసీఐఎల్ తన సాంకేతికకు మరింత మెరుగులు దిద్దింది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లను మరింత ఆధునీకరించింది. వీసీ బేస్డ్ స్పెక్ట్రోమీటర్స్, వీసీ బేస్డ్ మల్టీ ఛానెల్ ఎనలైజర్, ఫైర్ సేఫ్టీ అలారమ్ సిస్టమ్స్, కంప్యూటరైజ్డ్ లేజర్ ఐడెంటిటీ కార్డ్ ప్రింటింగ్ సిస్టమ్‌లను ఈసీఐఎల్ అభివృద్ధి చేసింది. ఇన్సాట్ శాటిలైట్ సిరీస్ మాదిరిగానే 120 ఎర్త్ స్టేషన్ యాంటెనాలను, 40 వీ–శ్యాట్ టెర్మినల్స్‌ను ఎగ్జిక్యూట్ చేసింది. బ్యాంకింగ్ రంగంలో కస్టమర్లకు వీలుగా ఉండే ఆఫీస్ ఆటోమేషన్‌ను అభివృద్ధి చేయడం లోనూ ఈసీఐఎల్ కీలక పాత్ర పోషించింది. ఒకప్పుడు మినియేషన్ కాంపోనెంట్స్‌ను తయారుచేసిన సంస్థ... తరవాతి కాలంలో బహుళ పరికారల సంస్థగా ఆవిర్భవించింది. ఆకాశ్, త్రిశూల్, బ్రహ్మోస్ వంటి మిసైల్స్‌కు అవసరమైన సీ41 సహకారాన్ని అందించింది. చంద్ర యాన్ మిషన్‌కు అవసరమైన 32 మీటర్ డీప్ స్పేస్ నెట్‌వర్క్ యాంటె న్నాను తయారు చేసింది ఈసీఐఎల్ నిపుణులే.

2000 సంవత్సరం తర్వాత... స్టాండర్డ్ అప్లికేషన్స్ దశ నుంచి స్ట్రాటజిక్ అప్లికేషన్స్ వైపు ఈసీఐఎల్ అడుగులు వేసింది. ముఖ్యంగా ఆటమిక్ ఎనర్జీ, డిఫెన్స్, స్పేస్, సివిల్ ఏవియేషన్ రంగాలకు సంబంధించిన పరికరాల తయారీలో ఈసీఐఎల్ మరింత అభివృద్ధి సాధించింది. వీటితోపాటు పౌర సేవలు, ఈ గవర్నెన్స్ అప్లికేషన్స్‌పై కూడా ఈసీఐఎల్ తన మార్క్ పనితీరు చూపించింది. అటు... టెలీ కమ్యూనికేషన్స్ కోసం స్టోర్ అండ్ ఫార్వార్డ్ టెలిగ్రాఫ్ సిస్టమ్స్, డిఫెన్స్‌కు సంబంధించి ఆటోమేటిక్ మెసేజ్ సిస్టమ్స్, వీఎస్ఎన్ఎల్ కోసం మెసేజ్ రీ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్, అంతరిక్ష రంగానికి సంబంధించి శాటిలైట్ ట్రాకింగ్ సిస్టమ్, కల్పాక్కం అణు విద్యుత్ కేంద్రంలోని ఫాస్ట్ బ్రీడర్ టెస్ట్ రియాక్టర్ కోసం కంప్యూటర్ కంట్రోల్ సిస్టమ్స్, ఇండియన్ ఎయిర్‌లైన్స్ కోసం ఫ్లైట్ డాటా ఎనలైజర్, కమర్షియల్ డాటా ప్రాసెసింగ్

సిస్టమ్ వంటివి ఈసీఐఎల్ తీసుకొచ్చింది.

**ఈసీఐఎల్ నిర్వహణ - కార్యకలాపాలు:** ఈసీఐఎల్ నిర్వహణ బాధ్యత కంపెనీ సీఎండి ఆధ్వర్యంలో నడుస్తుంది. రియర్ అడ్మిరల్ సంజయ్ చౌబె కొత్త చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు సంజయ్ చౌబె ఈసీఐఎల్‌లో టెక్నికల్ డైరెక్టర్‌గా పనిచేశారు. ఆయనతోపాటు మరో ఐదుగురు డైరెక్టర్ ఈసీఐఎల్ నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తుంటారు. ఈ సంస్థ ప్రధాన కార్యాలయం హైదరాబాద్ కాగా... చెన్నై, ముంబయి, కోల్‌కతా, ఢిల్లీ, బెంగళూరులో జోనల్ కార్యాలయాలున్నాయి. ప్రస్తుతం ఈ సంస్థలో 2,375 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.

**ఈసీఐఎల్ రూపకర్త - తొలి మేనేజింగ్ డైరెక్టర్-ఎ.ఎస్.రావు**

ఈసీఐఎల్ పేరు చెప్పగానే ఖచ్చితంగా గుర్తుకుతెచ్చుకోవాల్సిన వ్యక్తి ఎ.ఎస్.రావుగా సుప్రసిద్ధులైన అయ్యగారి సాంబశివరావు. ఈసీఐఎల్ వ్యవస్థాపకుల్లో ముఖ్యవ్యక్తి. ఈయన పేరుమీదుగానే ఈసీఐఎల్ ఉద్యోగులు నివసించే ప్రాంతానికి ఎ.ఎస్.రావు నగర్‌గా నామకరణం చేశారు. సెప్టెంబర్ 20, 1914న పశ్చిమగోదావరి జిల్లా మొగల్లులో ఎ.ఎస్.రావు జన్మించారు. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో సైన్స్‌లో మాస్టర్ డిగ్రీ చేసిన ఆయన.. అక్కడే అధ్యాపకుడిగా ఆరు సంవత్సరాలపాటు వివిధ పరిశోధనలు చేశారు.



1940లో స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో మాస్టర్ డిగ్రీ చేయడానికి ప్రతిష్టాత్మక సంస్థ టాటా అందించే ఉపకార వేతనాలకు ఎంపికయ్యారు. ఆ తర్వాతి కాలంలో... ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్‌లో కాస్మిక్ కిరణాలపై ఎ.ఎస్.రావు అద్భుత విజయాలు సాధించారు. ఆసియా ఖండంలోనే మొదటిసారిగా భారత్ రూపొందించిన అప్సర అణు రియాక్టర్‌కు కంట్రోల్, మానిటరింగ్ పరికరాలను సమకూర్చారు. బార్క్‌లో ఎలక్ట్రానిక్స్ గ్రూప్‌కి డైరెక్టర్‌గా పనిచేసినపుడు డిజైన్, డెవలప్‌మెంట్ ఇంజినీరింగ్ అంశాల మీద సాంబశివరావు పరిశోధనలు చేశారు. ఆ తర్వాత అణుశక్తి విభాగంలో అణు శాస్త్రవేత్తగా చేరారు. అక్కడే హోమీ బాబా, విక్రమ్ సారాభాయి వంటి ప్రముఖులతో పరిచయాలు ఏర్పడ్డాయి. అలా కేంద్ర ప్రభుత్వం అటమిక్ ఎనర్జీ కమిష న్‌ను ఏర్పాటు చేయడం.. డాక్టర్ హోమీ బాబా, ఎ.ఎస్.రావు వంటి కీలక శాస్త్రవేత్తల కృషి ఫలితంగా ఈసీఐఎల్ ఏర్పాటైంది. సంస్థ మొదటి చైర్మన్‌గా విక్రమ్ సారాభాయి, తొలి మేనేజింగ్ డైరెక్టర్‌గా ఎ.ఎస్.రావు బాధ్యతలు చేపట్టారు. మొదటి పదేళ్లలో ఈసీఐఎల్‌కు చుక్కానిగా ఉండి ఉత్పత్తి సామర్థ్యాన్ని, వ్యాపారాన్ని, ఉపాధి సామర్థ్యాన్ని పెంచడంలో... ఎ.ఎస్.రావు ముఖ్య భూమిక పోషించారు. అదే సమయంలో రావును కేంద్ర ప్రభుత్వం 1971లో ఎలక్ట్రానిక్స్ కమిషన్‌లో ముఖ్య సభ్యుడిగా చేర్చుకుంది. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో బ్లాక్ అండ్ వైట్ టీవీలు, కంప్యూటర్‌లతోపాటు అణు శక్తి, విమానయాన, టెలి కమ్యూనికేషన్, రక్షణ రంగాలకు... ఎ.ఎస్.రావు హయాంలోనే ఆవిష్కరణలు జరిగాయి.

**ఎ.ఎస్.రావుకు పురస్కారాలు:** శాస్త్ర విజ్ఞాన అభివృద్ధితోపాటు ఐక్యరాజ్య సమితిలో అణుశక్తి ఉపయోగాలు వంటి అంశాలపై జరిగే చర్చల్లో భారత్ తరపున.. ఎ.ఎస్.రావు పాల్గొనేవారు. అనేక విజ్ఞాన పత్రికలకు సంపాదకునిగా, సలహా మండలి సభ్యునిగా పనిచేశారు. పలు అంతర్జాతీయ సైన్స్ జర్నల్స్‌కు కూడా సంపాదకునిగా వ్యవహరించారు. 1960లో పద్మశ్రీ, 1965లో శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డు, 1972లో పద్మభూషణ్ పురస్కారంతోపాటు అనేక జాతీయ అవార్డులు ఎ.ఎస్.రావుకు వరించాయి. ఈసీఐఎల్ ఉద్యోగులు 1980లో సొసైటీని ఏర్పాటు చేసి సుమారు 120 ఎకరాల్లో డాక్టర్ ఎ.ఎస్.రావు నగర్ పేరుతో కాలనీ ఏర్పాటు చేశారు. దేశ సేవలో తరించిన ఎ.ఎస్.రావు... అక్టోబర్ 31, 2003న తుదిశ్వాస విడిచారు.

**అంతర్జాతీస్థాయి పరిశోధనల్లో ఈసీఐఎల్:** విశ్వరహస్యాల ఛేదనలోనూ.. ఎలక్ట్రానిక్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కూడా పాలుపంచుకుంటోంది. విశ్వ ఆవిర్భావానికి సంబంధించి ఇప్పటికీ అంతుచిక్కని అనేక రహస్యాలను కనుగొనేందుకు జర్మనీలోని డాంస్టాడ్ పట్టణంలో ఓ ప్రయోగశాలను నిర్మిస్తున్నారు. దీనికి అవసరమైన శక్తిమార్పిడి యాంత్రాలు (పవర్ కన్వర్టర్స్)ను రూపొందిం చేందుకు ఈసీఐఎల్ సిద్ధమైంది. ఈ ప్రయోగ శాలను ఫెసిలిటీ ఫర్ యాంటీ ప్రొటాన్ అండ్ అయాన్ రీసెర్చ్– ఫెయిర్‌గా వ్యవహరి స్తున్నారు. ఈ ప్రయోగాల్లో పాలు పంచుకు నేందుకు... ఐరోపాలోని పలు దేశాలతోపాటు భారత్ కూడా 36 మిలియన్ యూరోలను అందిస్తోంది. ఈ సహకారంలో భాగంగానే ఈసీఐఎల్ సాంకేతిక పరికరాలను తయారుచేసే ఆర్డర్‌ను సొంతం చేసుకుంది. బాబా అణు పరిశోధన కేంద్రం, రాజా రామన్న ఉన్నత సాంకేతిక పరిశోధ నాలయం, వేరియబుల్ ఎనర్జీ సైక్లోట్రోన్ సంస్థల సహకారంతో పవర్ కన్వర్టర్స్ (శక్తి మార్పిడి యంత్రాలను)ను ఈసీఐఎల్ తయారు చేస్తోంది. పరికరాల సరఫరాతోపాటు వీటి నిర్వహణ బాధ్యత కూడా ఈసీఐఎల్ చేపట్టనుంది.

**అణు ఇంధన అక్రమ రవాణాకు ఈసీఐఎల్ చెక్:** అణు ఇంధన పదార్థాల అక్రమ రవాణాకు చెక్ పెట్టేందుకు ఈసీఐఎల్ అత్యాధునిక 'రేడియోలాజికల్ డిటెక్షన్ ఎక్విప్‌మెంట్– ఆర్‌డిఈ' ను రూపొందించింది.

**ఈసీఐఎల్ భవిష్యత్తు లక్ష్యాలు:** శాస్త్ర సాంకేతిక వ్యూహాత్మక ఎలక్ట్రానిక్స్ రంగంలో భారత స్వయం సంవృద్ధిని సాధించడంలో ఎంతగానో కృషి చేస్తున్న సంస్థ ఈసీఐఎల్. ఇప్పటికే దేశంలోని చాలా రాష్ట్రాల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ల ద్వారా ఎన్నికల ప్రక్రియల్లో ఈసీఐఎల్ భాగస్వామ్యమై ఉంది. 2019 సాధారణ ఎన్నికల్లో ఓటింగ్ యంత్రాలకు వీవీప్యాట్ (ఓటర్ వెరఫయబుల్ పేపర్ ఆడిట్ ట్రయిల్)లను ఈసీఐఎల్ అందించింది. ఈవీఎమ్‌లు ట్యాంపరింగ్‌కు గురవుతున్నాయని ఆరోపణల నేపథ్యంలో వీవీప్యాట్‌లను ఈసీఐఎల్ రూపొందించింది. అణుశక్తి రియాక్టర్లకు సంబంధించిన కమాండ్ అండ్ కంట్రోల్స్ తయారీ కోసం ఆవిర్భవించిన ఈసీఐఎల్, యాభై ఏళ్లుగా తన విజయ ప్రస్థానాన్ని కొనసాగిస్తూ... భద్రతా వ్యవస్థలు, రక్షణ, వైమానిక రంగాలు, ఈ–గవర్నమెంట్ కార్యక్రమాలు అనేక ప్రజాహిత కార్యక్రమాల్లో తనదైన ముద్ర వేసుకుంటూ ముందుకు సాగుతోంది.

–ఎం.డి.కరీం, m: 9618644771
e:karreemmd786@gmail.com



# 2వ జగదేకమల్లుని రాజ్యకాలాన్ని పెంచిన వాడపర్తి శాసనం

యాదగిరిగుట్ట-భువనగిరి జిల్లా భువనగిరికి సమీపంలోని వడపర్తి గ్రామంలో కళ్యాణీచాళుక్యుల పాలనాకాలంనాటి కొత్త శాసనం లభించింది. పాలకుడు ప్రతాపచక్రవర్తి 2వ జగదేకమల్లుని ఏలుబడిలో భువనగిరి దండనాయకుడుగా పనిచేసిన విద్ధమయ్య వేయించిన ఆలయదాన శాసనమిది. వడపర్తిలో శంభునిమర్రి అని గ్రామస్తులు పిలుచుకునే పొలంలో నల్లశానం రాయి మీద చెక్కివున్న శాసనం, శాసనంలో పేర్కొన్న 'వైజరాజ చెరువు' రాచకాలువ పక్కన పొలాలలో లభించింది.

### వాడపర్తి చారిత్రక విశేషాలు:

వాడపర్తిలో చరిత్రపూర్వయుగంలోని రాతిచిత్రాలు, పెదరాతియుగం సిస్టు సమాధులు, డోల్మన్లు, మెన్హర్, సాతవాహనుల కాలంనాటి ఇటుకలు, కుండపెంకులు అగుపించాయి.

వడపర్తిలోని ఈశ్వరిగుట్టమీద ఉన్న గుడిలో ఉన్నది శైవదేవతగా భావిస్తున్న ఈశ్వరి కాదు సరస్వతి. గుట్టమీద దేవాలయ శిథిలాలున్నాయి. రాచకాలువ దగ్గర కూడా దేవాలయ శిథిలాలెన్నో ఉన్నాయి. గుట్టమీద ఉన్న విడి శిల్పాలలో శైవద్వారపాలకులు, వైష్ణవ దేవాలయ ధ్వజస్తంభం, మహాపాదం, చాళుక్యశైలిలో చెక్కిన మైలారదేవుడు, భద్రకాళి, వినాయకుడున్నారు.


వడపర్తి శాసనంలో పేర్కొనబడిన వైజరాజు చెరువు రాచకాలువున్న చెరువే. రాచకాలువ నుంచి నీరు భువనగిరి చెరువుకు చేరుతుంది. బీబీనగర్, వడపర్తి, భువనగిరి, రాయగిరిలోని చెరువులు గొలుసు చెరువులు.

### శాసనం-చాళుక్యుల ప్రశస్తి:

బాదామీ చాళుక్యుల నుంచి కళ్యాణీ చాళుక్యుల వరకు తమను 'హారీతిపుత్రుల'మని చెప్పుకున్నారు. మానవ్యసగోత్రులు (ఇది బ్రాహ్మణగోత్రం)గా చెప్పబడిన వీరు క్షత్రియలక్షణాలున్న బ్రాహ్మణులు. పవిత్రక్షత్రియులుగా శాసనాలలో పేర్కొనబడ్డారు. వారు ద్వివర్ణులని జి.పి.భట్(1988)తన గ్రంథంలో రాసారు. చాళుక్యులు హారీతి పుత్రులని పేర్కొన్నశాసనాలు ఈ శాసనంతో యాదగిరిగుట్ట-భువనగిరి జిల్లాలో రెండవది లభించినట్లైంది. అది కూడా ఒక్క విద్ధమరసరు వేయించినవే రెండు శాసనాలు(చందుపట్ల, వడపర్తి-రెండు గ్రామాల మధ్యదూరం 20 కి.మీ.లలోపే) కావడం విశేషం. చందుపట్ల శాసనంలో చాళుక్యవంశీయుల వంశవృక్షం చెప్పబడ్డది. కొల్లిపాకనాడులోని ఆలేటి కంపణం-40కి చెందిన భువనగిరి దుర్గాధిపతి మహాప్రధాన, దండనాయకుడు విద్ధమరసరు లేదా విద్ధమయ్య చందుపట్ల (చంద్రపట్టణం)లో విద్ధేశ్వరస్వామిని ప్రతిష్ఠించి చేసిన భూదానాలు ప్రస్తావించబడ్డాయి. (నల్గొండ జిల్లా శాసన సంపుటి, శాసన సంఖ్యలు-37, 43)

### శాసన విషయం-చరిత్ర:

భువనగిరిపట్టణానికి సమీపంలోని వడపర్తి(వాడపత్తి) గ్రామీణులు (80 సం.లు పైబడిన)సంకూరి బొంతప్ప, బొమ్మ వెంకటయ్యగారలు నిర్మిస్తున్న కొత్తశివాలయం దగ్గరకు చేర్చబడ్డ శంభునిమర్రి పొలంలో దొరికిన వడపర్తి శాసనంలో కళ్యాణిచాళుక్యుల వంశవృక్షం, ప్రశంసవుంది. చివరి చాళుక్యరాజుకు ముందువాడైన ప్రతాపచక్రవర్తి రెండవ జగదేకమల్లునిపాలనలో సంధి-విగ్రహి, మహాప్రధాన, దండనాయకుడు విద్ధమయ్యరసరు ప్రతిష్ఠించిన 'స్వయంభూ కందర్పేశ్వర' దేవునికి ధాతసంవత్సర (క్రీ.శ.1156) అక్షయతృతీయ సందర్భంగా అంగరంగభోగాలకు, గంధాక్షత, ధూప, దీప నైవేద్యాలకు, నృత్త, గీత, వాద్యాదులకు కొంతభూమి, ఒక పూదోట, 4 గద్యలు దానం చేసినట్లుగా ఈ శాసనం వల్ల తెలుస్తున్నది. వడపర్తి గావుండ(గ్రామాధికారి) కొమనయ్యపేరు కూడా ప్రస్తావించబడ్డది.


చరిత్రగ్రంథాలలో చెప్పబడినట్లు క్రీ.శ.1138-1151కాక ఈ శాసనంవల్ల రెండవజగదేకమల్లుని రాజ్యకాలం క్రీ.శ.1156 వరకు పెరిగింది. దానశాసనాలు సాధారణమే కాని ఈ శాసనం విద్ధమయ్యరసరున్న కాలాన్ని తెలియజేస్తున్నది. ఈ శాసనంతో విద్ధమయ్య త్రిభువనమల్లదేవ 6వ విక్రమాదిత్యుడు, 3వ సోమేశ్వరుడు, 2వ జగదేకమల్లదేవుల పాలనాకాలంలో భువనగిరి దండనాయకుడుగా పనిచేసినట్లు తెలుస్తున్నది.

ఈ శాసనాన్ని నకలుతీయడంలో మా చరిత్రబృందం సభ్యులు వేముగంటి మురళీకృష్ణ, ఆవుల వినోద్ కుమార్, చకిలం సురేందర్ (ఈనాడు విలేకరి), చంటి సహకరించారు. ఈ కార్యక్రమంలో వడపర్తి గ్రామస్తులు సంకూరి బొంతప్ప, బొమ్మవెంకటయ్య, బరిగె నర్సింహ, కసగోని మల్లయ్య, జూపల్లికృష్ణలు సహాయ, సహకారాలందించారు.

**వడపర్తి(వాడపత్తి) శాసనం:**

వంశం: కళ్యాణీ చాళుక్యులు

రాజు: ప్రతాపచక్రవర్తి జగదేకమల్లుడు-2(1138-1151)

కాలం: దాత నామ సం. అక్షయ తృతీయ, క్రీ.శ.1156 ఏప్రిల్ 24

భాష: సంస్కృతం, కన్నడం

లిపి: తెలుగన్నడం

**శాసనపాఠం:**

**మొదటిపక్క:**

5 పంక్తులంత రాయి విరిగిపోయింది.




1. హారీతిపుత్రరుం కౌశికీవర ప్రసా
2. దలబ్ద శ్వేతాత పత్రాది రాజ్య చిహ్నారుం
3. నవ్తవూతృకా పరిరక్షితరుం కార్తికే
3. య వరప్రసాదలబ్ద మయూరపింఛ
4. కుంతధ్వజరుం భగవన్నారాయణ ప్రసాద
5. సంచిత వరవరాహలాంఛనే క్షణక్షణ వ
6. శీకృతారాతి రాజమండలరుం సమస్త భువనా
7. శ్రయ సర్వలోకాశ్రయ విష్ణువర్ధన విజయా
8. దిత్యాది విశేషాభిదానరు మెనిసి నెగల్ద రాజ
9. రత్నంగళుద్భవ భూమియాద చాళుక్యవంశ...
10. తారడోలం శ్రీమచ్చాళుక్యవంశలలామం క్రోధ
12. ద్వర్ధన రామ్నయోధ్యధామం సత్యాశ్రయ నిజ
13. ం-సోమం సింహాసనాధిపతియ వేనేగల్దం తా
14. మచ్చాపాదానేందిత్త జయసింహ మ
15. హీపాలనాదియోగకరుం రాజ్యంగెయ్యు
16. త్తిమిరలనన్తరం విక్రమాదిత్యదేవనమగం
17. కం॥బడతైలనేం హరట్టిరన్నునుదిదో బా
18. లాండం-తెది బ్రబాప్పరే నూర్మడి తైలనె
19. బెనంగెల్దదర్దంత ద్రాష్టకూటసింహాసన
20. మం తత్పుత్రం సత్యాశ్రయం తదనుజం దశ
21. వర్మాం తదపత్యం విక్రమాదిత్యం తదనుజం జ
22. యసింహం తత్తనూజ నాహవమల్ల భూవల్లభం
23. తదాత్మజం భువనైకమల్లం తదనుజం త్రి
24. భువనమల్ల జగద్పాలణం ॥శ్లో॥ ఆతన తన
25. యం భువనవినుతం భూలోకమల్ల భూయా చ
26. న్ద నుత్తమపుత్రం శౌర్యగర్భితం జగదేకమల్లనోన
27. జగతివిదుం ఇడియపెదెసడియ
28. ఖడోయపనోదివిక్రాంతం తదన్పుత్ర-యాం-

**రెండవపక్క:**

29. ఋచా
30. ళుక్యభరణం శ్రీమత్రృతాప చక్ర
31. వర్తి జగదేకమల్లదేవర రా...
32. జ్యముత్తరోత్తరాభివృద్ధి ప్ర
33. వర్ధ చంద్రార్కతారం కల్వ(చేడె)
34. ద నెలవీడినుండ సుఖ సు
35. వినోదదిం రాజ్యంగే
36. రే తత్పాదపద్మోపజీవి సమ-
37. చ మహాశబ్ద మహాసా-






38. పతి మహాప్రధానం సేనాధిప(తి)
39. త వేర్గడే కన్నడ సంధి విగ్రహిది
40. దండనాయకం విద్దమరసరు–
41. భువనగిరియ దండనాయకయ
42. ది రాజయ్యంగడు వాడపతితియు
43. ప శ్రీస్వయంభూ కందర్పేశ్వర దేవర్గె
44. వభ హెూమం మాడిసి శ్రీమత్ర్పాతాప(చ)
45. క్రవర్తి చాళుక్య జగదేకమల్ల ము
46. ద వినేయసి ధాతృ సంవత్సరద(అక్ష)
47. య తృతీయ మహాపర్వదందు తా–
48. వాడపత్తితియ గావుండోర్మల్లిగ
49. యుం మాణికేయనాయక సమిర్ద్దొరె
50. ర్గె గంధాక్షత పుష్ప ధూప దీప –
51. దృక్కం నృత్త గీత వాద్యాది బొరక
52. సలద ఖండస్పుదిత జీర్ణోద్ధార
53. దొ సబెసక్కమా వాడపత్తితియ
54. దా దేవర దేగులద(నైతిత్యదల్లిద
55. ముంగిడి నిదానర్మెంబరాదొనీయు
56. ఆరావిద గర్ద్యేయ ఈశానద గొదిన
57. గోత్తుఅగ్నేయద లోప్యసఅగలు
58. (నైరిత్వదల్లిబేర్దం వాయవ్యద

మూడవపక్క:

59. ఋల్కడె సు
60. ఋగటింగెరు–
61. – చ్మముము నల్తియ
62. ఎమత సుంకద విత్తిదు
63. ఋ–గటింగెరధేరదు(?) ఋ
64. ఋ–మం దేవర దేగులదు
65. ఋ–ణ భాగద పూదోంటు
66. మానిన్తి నితుమం ధారా (పూ)
67. ర్వకం మాడికొద్దరు..........(సు)



68. వర్నామేకంగామేకాం భూమేర
69. (ప్యద్ధ)ర్మంగుళం హరం నరకమా(ప్నోతి)
70. –ఱి యామదా భూతసంప్లవషు
71. మదంశజః పరమ బాపరిమ–
72. వాపా పాదజ తమవసో భూ
73. విభూపాఃయేపాదయం రిమమద
74. మిమం సమస్తం దేతేభ్యోమయా విధభి
75. రాజాటిరేఫమూర్ధో– స్వదత్తాం పరదత్తాం
76. వాయోహరేతు వసుంధరా షష్టిర్వర్ష
77. సహస్రాణి మిష్టాయాం జాయతే క్రిమిః
78. ర్గె రంగవల్లియ నిక్కువమాసు
79. –ఱయల్లి మత్తురు1 దేవరు
80. –గకం వైజరాజంగేకెరెయ విత్తుత భూ

– శ్రీరామోజు హరగోపాల్,
m : 99494 98698
e: akshara25@gmail.com


## అపురూప చరిత్రకు అరుదైన సాహిత్యాధారం

# "భద్రగిరిశతకం"

కొన్ని చారిత్రక సంఘటనలకు సరైన ఆధారాలు లభించక పోతే అది మరుగున పడతాయి లేదా పుక్కిటిపురాణాలుగా తేలికైపోతాయి. భద్రాద్రి ఆలయంపై ధంసా దాడిజరగటం మూల విగ్రహాలను గోదారి దాటించి ఐదేళ్ళపాటు పోలవరంలో దాయడం, ధంసా మరణం తర్వాత మళ్ళీ తిరిగి మూలవిరాట్టును స్వస్థానానికి చేర్చడం, కళ్యాణం జరిపించడం భద్రాద్రి ఆలయ చరిత్రలో ఒక ప్రత్యేక ఉద్విగ్న ఘట్టం. కానీ పరిస్థితులకు ఎదురీది దీన్ని నమోదు చేయడం సాహసం. దాడికి భయపడి విగ్రహాలను దాచిన సమయం నుంచి 'రాముల దేవారు' తిరిగి మళ్ళీ భద్రచలానికి 'వేంచేపు' చేసేంత వరకూ జరిగిన సంఘనలను శతకరూపంలో నమోదు చేసే సాహసాన్ని పేరయ్య కవి చేసాడు. దానిలో అనేక చారిత్రక వ్యక్తులు, ప్రదేశాలను వాడుక పదాలు, ఆహార అలవాట్లు, ఆచార వ్యవహారాలనూ నమోదయ్యాయి.



తాళపత్రాలలో రాసిన పాత శతకాన్ని ఆధారంగా చేసుకుని పిఠాపురం మహారాజా వారి సారధ్యంలో శతావధానులు, చరిత్ర పరిశోధకులైన శేషాద్రి రమణ కవులు 1928లో దీనిని పరిష్కరించారు. వీటిని చెన్నపురి వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్ అచ్చువేసారు. అయినప్పటికీ పూర్తి శతకం అందలేదు. అనేక పద్యపాదాలు అసంపూర్ణంగానే వున్నాయి. తెలుగు మహాసభల సందర్భంగా సంగిశెట్టి శ్రీనివాస్ సంపాదకత్వంలో మరోసారి ఈ శతకం తెలుగువారి ముందుకొచ్చింది.



శ్రీరస్తు:

భద్రగిరిశతకము.

భల్లాపేరయ్యవిరచితము.

చెన్నపురి:

వావిళ్ల. రామస్వామి శాస్త్రులు. అండ్ సన్స్ వారిచే

ప్రకటితము,

1928

All Rights Reserved.

*"భద్రగిరివాస శ్రీరామభద్ర దాస పోష బిరుదాంక రఘుకులాంబుధి శశాంక"* మకుటంతో 108 పద్యాల ఈ శతకం సాగుతుంది. ప్రధానంగా చారిత్రక అంశాల చుట్టూ తిరుగుతూ కొన్ని పౌరాణిక అంశాలను ప్రస్తావిస్తుంది.

### ఎవరీ భల్లా పేరయ్య కవి :

నిజానికి ఈ కవి పేర మరే ఇతర రచనలూ అందుబాటులోకి రాలేదు. ఈ శతక వివరాల ప్రకారం ఆయనది కౌండిన్య గోత్రం, తండ్రి పెద్దన, తాత లింగన, భల్లా వంశము పేరయ నామధేయమన్నాడు. ఒక పద్యంలో రాముడు పోలవరం రావడాన్ని 'ఈ దరికికి వచ్చి" అనడం వల్ల ఆయన గోదావరి నదికి భద్రాచలం అవతలివైపు ఒడ్డు బహుశా పోలవరం అనే విషయం సూచన ప్రాయంగా తెలుస్తుంది.

*/ రమణ కౌండిన్య గోత్ర పవిత్రుడను లింగసకు బౌత్రుడను బెద్దనకును బుత్ర*
*వరుడ బేరయు నామ ధరుడ*
*భల్లావంశవనధి సోముడ బుధవగ్గ మలర*

ధంసా అంటే ఏమిటి? ఇబ్రహిం ఖాన్ అనే అతనికి ఫాజిలు బేగు అనే పేరు కూడా వుండేదని అతనికి చాలా శక్తివంతమైన పదవి వుండేదని జాల్దుంగు అనే పేరు కూడా తెచ్చుకున్నాడని అతనికి ధంసా అనే బిరుదు వుండేదని పద్యంలో తెలియజేసారు.

*/రమణ తోడుగ నిభరహిము ఖానుని సరి యేల పుట్టించెనో యిలను బ్రహ్మ*
*పుట్టించె గాక యీపుడమి లోపల నేల ఫాజీలుబేగని పలుకు జేసె*
*పల్కు జేసిన వాడు పదవి చాల యొసంగి ధరను జాల్దుంగను పేరయేల*
*తెచ్చె దెచ్చినవాడు దృఢచిత్తుగా జేసి ధంసాయను కితాబు ధరణి నొసగె/*

ఔరంగాజేబు గోలుకొండ రాజ్యాన్ని గెలిచిన తర్వాత తన ప్రతినిధిగా "గాజియుద్దీన్" ను నియమించాడు. 1707లో ఔరంగజేబు

మరణించిన తర్వాత 1724లో "నిజామ్ ఉల్ ముల్క్" ను దక్కను సుబేదారుగా నియమించాడు అసఫ్ జా. 1) ఆర్కాటు 2) కడప 3) కర్నూలు 4) రాజమహేంద్రవరము 5) శ్రీకాకుళము అను ఐదు రాష్ట్రాలుగా పరిపాలనా సౌలభ్యం కోసం విభజించుకుని వాటికి అయిదుగురు నవాబులను అధికారులుగా నియమించాడు. ఫ్రెంచివారు, ఇంగ్లీషువారు తమ వర్తకాలను పెంచుకోవడంతో ఆగక తమ పరిపాలనా కేంద్రాలుగా మార్చుకునే ప్రయత్నాలు చేస్తున్న కాలం అది. మరాటీ దండులు, తురుష్క దోపిడీ ముఠాలూ అడ్డగోలుగా దోచుకుంటున్న రోజులవి. ఆయా సర్కారుల్లో పరిపాలనా విధానం చూస్తే, ఫౌజుదార్లు లేదా ఖిల్లాదార్లు దేశముఖ్, దేశపాండ్యాలకు సహాయంగా శిస్తులు వసూలు చేసే బాధ్యులుగా పనిచేసేవారు. కొన్నిసార్లు తమ బలం పెంచుకుని స్వతంత్ర పాలకులుగా తమను ప్రకటించుకునే వారు. క్రీ.శ 1748లో నిజాం ఉల్ ముల్క్ చనిపోయిన తర్వాత ఆయన రెండవ కొడుకు నాసరు జంగు రాజ్యపాలనలోకి వచ్చాడు కానీ ఫ్రెంచివారు ఆయన మనవడు ముజఫరు జంగును బలపరిచి వాడి సహాయంతో క్రీ.శ 1750 లో నాసరుజంగును చంపించారు. 1751 లో ముజఫరు జంగు ఒకదాడిలో హతుడయ్యాడు. దానితో నిజాం మరో కొడుకు సలాబతు జంగు పరిపాలనలోకి వచ్చాడు. అతని ఇద్దరు తమ్ముళ్ళు నిజామలీ, బసాలతుజంగు అనే వాళ్లు ఒకరు ఔరంగాబాదులోనూ, మరొకరు గుంటూరులోనూ తమ అధికారాలను నడిపించుకుంటూ వచ్చారు. నిజామలీ ఇంగ్లీషువాళ్ళకు, బసాలతుజంగు ఫ్రెంచివాళ్లకు అనుకూలంగా వుంటూ తమకు అదనపు బలాన్ని సమకూర్చుకుంటూ వారి వాణిజ్య అవసరాలకు ఉపయోగపడేవారు. క్రీ.శ 1759లో ఇంగ్లీషువాళ్లచేత ఫ్రెంచివాళ్లు తరమబడ్డారు. దాంతో నిజామలీఖాన్ బలం పెరిగి అతని అధికారం స్థిరంగా మారింది. ఈ సమయంలో భద్రాచల ప్రాంతము అశ్వారావు బహద్దరు ఆధీనంలో వుంది. దేవాలయ నిర్వహణ వారి ఆధీనంలోనే వుండేది.


పిఠాపురం రాజా

*/ ఈపాటి దొరనౌట యెఱుగక మిము నమ్మి యశ్వరాయడు భూపలాయనంబు*

*నొందె / / తగు గుమస్తా యనదగు నశ్వరాయని కరుణ నిండారగా గాంచలేక తొలగి పోతిరి /*

వరంగల్ కు దాదాపు 50 కిలోమీటర్ల దూరంలోని వేల్పుకొండ ప్రాంతం నిజాం ఆధీనంలో వున్నప్పుడు రాజ్యంలో వసూలైన పన్నులను జాగీర్దార్లు సక్రమంగా పంపని పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనిని సరిచేసేందుకు నిజాం తమ దగ్గరి బంధువు సైనిక అధికారి అయిన జాఫర్ ఉద్ దౌలాను వేల్పుగొండకు వెళ్లి విషయాన్ని చక్కబెట్టుకు రమ్మన్నాడు. ఎదిరించిన జాగీర్దార్ల మెడలు వంచేందుకు అనేక మందీమార్బలాన్ని పెంచుకున్నాడు. ఆ బలాన్ని స్థిరంచేసుకునేందుకు తన పేరుమీదుగా జాఫర్ గఢ్ కోటగట్టాడు. కేవలం పన్నులు ద్వారా వచ్చే సొమ్ములు చాలక దాడులు దోపిడీలు చేసుకుంటూ చేస్తూ. జమిందారులనూ జమీలనూ దోచుకున్నాడు. అక్కడితో ఆగక దేవాలయాలను కొల్లగొట్టడం విగ్రహాలనూ నిర్మాణాలను ధ్వంసమూ చేయించాడు. ధంసా అనే మాటకు ఉర్దూ పారసీకాలలో ఎక్కడా బిరుదుగా అర్థం కనిపించదు. ధ్వంసయుతుడు కావడంతో ధంసాగా జనశృతి. ఖమ్మం దగ్గరలో ధంసలాపురం, ధంసా పేరుతో చెరువులు బట్టి చూస్తే ఇది బిరుదనామమేమో అనిపిస్తుంది. ధంసా ప్రస్తావన భద్రాద్రి శాసనంలో కూడా కనిపిస్తుంది. పేరయ్య కవి ఇతని బలాన్ని బలగాన్నీ వర్ణించినట్లే దండయాత్ర చేసిన ప్రాంతాలలో నడిపిన దుశ్చర్యలను సైతం భల్లా పేరయ్య కళ్ళకు కట్టినట్లు వివరించారు.

*/చెక్కులు నిమురక సీతోర్మిళాదుల గని యూర కుందురే మనసు నిల్పి*

*పాఱి పోవగనైన బట్టలు నాకక విడుతురే వైష్ణవ వితతి నెల్ల*

*బిరుసు గడ్డంబుల బెఱుకక రిత్తగ నాదరింతురె వసిష్ఠాది మునుల*

*ముక్కులు గఱువక ముని మొనకట్టి పోనిత్తురే కపి నాయ కోత్తములను/*

సీత ఉర్మిళలు కనిపించినా సరే బుగ్గలు నిమరకుండా ఊరుకుంటారా? అనడం ద్వారా అప్పట్లో ఆడవాళ్ల స్వాభిమానానికి ఎంత భంగం కలిగించేలా వీరి దుశ్చర్యలు వుండేవో అర్థం అవుతుంది. అదేవిధంగా

*/హనుమంతు ముట్టి స్వహంగవేణిలి చేత, నెమరి పెట్టెలమాయ జమరె నొకడు*

*గరుడాళువారిచెక్కులు చెక్కు ముక్కులు, నొక్కి మట్టసముగా జెక్కెనొకడు*

*ఎంబెరు మానారు నింటిలోన నమాజు చదివియు దసిబిసి సలిపెనొకడు*


*వరుసబన్నిద్ద ఆళ్వారి నొక్కుమ్మడి దేడిక్కులాడించి వీడెనొకడు/*

అంటూ మతపరంగా పవిత్రంగా చూసుకునే అనేక విషయాలలో వీరి దుందుడుకు దురాగతాలను కూడా కళ్ళకు కట్టాడు కవి.

*సర్వధారను పేరి సంవత్సరంబున ధంసాకు వెఱచి యిద్దరికి వచ్చి*

*పోలవరంబులో బొలుపొంద నైదేండ్లు వనవాస మొనరించి వరుస తోడ*

*శాక్తేయమత యుతు సంహార మొనరించి మంత్రాంగ శక్తి*


శేషాద్రి రమణ కవులు



పిఠాపురం రాజా


*యిమ్మహిని వెలయ*
*తగ పూసపాటి విజయ రామరాజ సీతా రామరాజులతో రయమున*
*విజయ సంవత్సరంబున విజయము గను భద్రగిరి కేగి తౌనయ్య భద్రము గను*
*శ్రీరామ చంద్రులు సీతా సమేతులై వచ్చి భద్రాద్రిన వాసమునకు*
*జయనామ వత్సర చైత్రశుద్ధాష్టమి తరువాతి దినమందు దగ వివాహ మరయ*


అనే పద్యాల ఆధారంగా శ్రీరాముడు 1768-69 సంవత్సరంలో భద్రగిరి వదిలిపెట్టి పోలవరం వలస వెళ్ళాడని అక్కడ 1773-74 వరకూ వున్నాడు ఇదే ధంసా కాలం కూడా, 1775లో మళ్ళీ భద్రాద్రిలోనే సీతారామచంద్రుల కళ్యాణం జరిగిందని స్పష్టం అవుతోంది. అంటే ఈ శతక రచన కూడా క్రీ.శ 1770 లో ప్రారంభం అయ్యి 1775 వరకూ జరుగుతూనే వున్నదని కూడా తెలుస్తుంది. ప్రారంభంలో రాముడిని నిందిస్తున్న సాకుతో తెలుగు పౌరుషాన్ని రెచ్చగొట్టినట్లు మాట్లాడిన భల్లాపేరయ్య కవి చివరి పద్యాలలో రాముడి శౌర్యాన్ని పొగుడుతూ తన పొరపాట్లువుంటే మన్నించమనటం కనిపిస్తుంది.


ఇటువంటి అరుదైన చారిత్రక సంఘటనల సాహిత్య ఆధారాలను సంరక్షించుకోవాలి, వాటిపై సమగ్రమైన లోతైనా పరిశోధనలు జరగాలి. ఆయా అంశాల నుంచి మరింత చరిత్రను పునర్నించుకోగలగాలి.

- కట్టా శ్రీనివాస రావు,
m : 9885133969
e : Katta.khammam@gmail.com










చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో బాలచెలిమి ప్రచురించిన 'గాడిద తెలివి', 'అంతరిక్ష దొంగలు' (2018 నవంబర్), 'గుల్లేరు బాలుడు', 'టంగ్ యంగ్' (2018 డిసెంబర్) అనే నాలుగు కథల పుస్తకాలు వెలువడినందుకు సంతోషం వ్యక్తం చేస్తున్నాము. ప్రతులు కావల్సిన వారు ఈ క్రింది చిరునామా నుండి పొందవచ్చును.

విడి ప్రతి వెల: రూ.30/-
'Bhoopathi Sadan' 3-6-716, Street No.12, Himayathnagar, Hyderabad-500029, Telangana. Mob: 9030626288
మరియు
● Nava Telangana ● Manchi Pustakam
● Nava Chetana ● Navodaya Book House

ప్రకృతే నియంత్రిస్తుంది! **14** ప్రకృతే శాసిస్తుంది!!

# అనునిత్యం అవిటిదైపోతున్న అవని!

(గత సంచిక తరువాయి)

విష్ణు పురాణాల్లో మూడవ అవతారంగా చెప్పబడే వరాహావతారం గాథ తెలిసిందే! హిరణ్యాక్షుడు భూమిని చాపలా చుట్టి పాతాళంలోకి విసరాలని చూడగా, పాతాళంలో వరాహా వతారంలో వున్న విష్ణువు తన మోరచే ఆపి తిరిగి భూమిని పైన నిలిపారని చెపుతారు. శాస్త్రీయ దృక్పథం ముందుకు వస్తున్నకాలంలో, భూమి గుండ్రంగా వుందన్న వాస్తవాన్ని జీర్ణించుకోలేని కొన్ని శక్తులు ప్రపంచ వ్యాపితంగా భూమి బల్లపరుపుగా వుందనే కల్పిత గాథల్ని ఈ విధంగా ముందుకు తెచ్చాయి.

అయితే నేటి 21వ శతాబ్దంలో నాటి హిరణ్యాక్షుడు లేకున్నా యావత్ భూగోళాన్ని కబళించి స్వంతం చేసుకునేవారి సంఖ్య విశ్వవ్యాపితమైంది. వీరి విషకౌగిలిలో చిక్కుకున్న నేలతల్లి ఊపిరి సలుపలేక సతమత మవుతున్నది. తన సహజ కవచ కుండలాలైన విభిన్న భూభాగాలు, జలభాగాలు సహజత్వాన్ని కోల్పో తున్నాయి. ఈ స్థితి ఇలాగే కొనసాగితే నివాసయోగ్య ధరిత్రి అతిత్వరలోనే నిర్వీర్యంగా మారుతుంది.



సుందర్బన్‌లో 2050 నాటికి ఎరుపు(మసక) రంగు భాగం కనుమరుగైతుంది

**సమన్యాయమే భూతల్లి విధానం!**
**(Balancing Act of Earth)**

సమస్త జీవకోటికి, సూక్ష్మ జీవులకు, మొక్కలకు, జంతువులకు, పక్షులకు, జలచరాలకు ప్రాణవాయువును, నీటిని, మొక్కలకు కార్బన్ డయాక్సైడ్‌ను, తగినంతగా వేడిమిని అందించి వాటి మనుగడకు భూమి కన్నతల్లి పాత్రనే పోషిస్తుంది. నిజానికి భూమాతకు అన్ని జీవులు సమానమే! అపకారులు, ఉపకారులు, క్రూర జంతువులు, విషజంతువులు, కీటకాలు అంటూ వ్యత్యాసం వుండదు. ఇవి మానవుడు ఏర్పర్చుకున్న కృత్రిమ భావాలు మాత్రమే! తన సౌఖ్యాన్నే పరమావధిగా భావించి సృష్టించుకున్న మాయమాటలివి. భూమి మానవుడికి ప్రత్యేక స్థానమంటూ ఏమీ ఇవ్వలేదు. అన్ని జీవులకు ప్రాణం పోసినట్లే మానవుడికి ఊపిరి పోసింది. ఈ జీవకోటి మనుగడకు, బతికిబట్టకట్టడానికి భూవ్యవస్థ ఓ నిర్దిష్ట ప్రామాణికతను ఏర్పర్చుకున్నది. అవి ఈ కింది విధంగా వున్నాయి.

**1. సముద్రాల్లోని ఏకకణఫైటో ప్లాంక్‌టన్ (Phyto plankton)** జీవులు కిరణజన్య సంయోగక్రియ ద్వారా జీవరాసికి కావల్సిన 50 శాతం ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేస్తాయి. మొక్కలు మాత్రమే జీవకోటికి కావల్సినంత ఆక్సిజన్‌ను అందించలేవు. చాలామంది భావించినట్లు మొక్కలు ఆక్సిజన్‌ను సృష్టించవు. గాలిలో మిశ్రమ రూపంలో ($N_2+O_2+$ జడవాయువులు $+ CO_2$) వున్న ఆక్సిజన్‌ను కిరణజన్య సంయోగ క్రియద్వారా గ్రహించి, కార్బన్ డయాక్సైడ్‌ను స్వీకరించి, ఆక్సిజన్‌ను బయటకు వదులును. తిరిగి శ్వాసక్రియ సందర్భంగా మొక్కలు కూడా జంతువర్గంలా ఆక్సిజన్‌ను గ్రహించి, కార్బన్ డయాక్సైడ్‌ను వదులును. ఈ ప్రక్రియ రాత్రుల్లో అధికంగా వున్నందున, రాత్రుల్లో చెట్లకింద నిద్రించరాదనేది ఓ సూక్తి!

**2. చిత్తడి నేలలు** మొక్కల్లో కార్బన్‌ను నిలువచేసే (carbon sink) గోదాముల్లా, ఉత్ప్రేరకాలుగా పనిచేస్తాయి. అంటే ఈ నేలలు కార్బన్ స్థాపకాలన్న మాట! అలాగే పొడుగాటి వేరు వ్యవస్థగల గడ్డిజాతిని కలిగి భూమి కోతను (soil erosion) అరికడుతాయి. ఈ గడ్డి ఎన్నో రకాల భూచరాలకు, పక్షులకు, ఉభయచరాలకు, సరీసృపాలకు, నేలను గుల్లభారించే వానపాముల్లాంటి అన్నెలిడా (annelida) లకు నిలయంగా ఉండి, చక్కని ఆహారపు గొలుసును ఏర్పరుస్తాయి. మానవులు వీటి ఆధారంగా అనేక రకాల వృత్తుల్ని కొనసాగిస్తూ జీవనం సాగిస్తారు. వాతావరణ సమతుల్యతను కాపాడంలో చిత్తడి నేలలు విశేషకృషి చేస్తాయి.

**3. ధృవప్రాంతాలు** 90 శాతం స్వచ్ఛమైన నీటిని మంచు రూపంలో నిలువచేస్తాయి. నిజానికి ఇవి భూగోళపు శీతలీకరణ కేంద్రాలని ఇంతకు ముందు కథనాల్లో చూసాం. అలాగే ప్రత్యేకమైన జంతువులకు (ధృవకుక్కలు, ఎలుగుబంట్లు, పెంగ్విన్‌లు మొ॥) ఇవి నిలయాలు. అన్నింటికి మించి ఇంకా కలుషితానికి గురికాక, భూ చరిత్రను తెలిపే పురాతన భాండాగారాలు (archives).

**4. ఎడారులు, పొడినేలలు (dry lands)** కూడా భూమండలాన్ని నియంత్రిస్తాయి. వీటి ఆవాసంగా వుండే బాక్టీరియాలు వాతావరణంలోని కార్బన్‌ను భూపొరల్లో నిక్షేపిస్తాయి. ఇది కిరణజన్యసంయోగక్రియకు దోహదం చేసి, యావత్ జీవకోటికి ఆహారాన్ని అందిస్తాయి.



రాయల్ పులులు. మిగిలినవి ఎన్ని??

**5. ఉష్ణమండల ప్రాంత వర్షపు అడవులు** (Tropical rain forests) వాతావరణంలో వెలువడే 50 శాతం కార్బన్‌ను గ్రహించే అతిపెద్ద భూగోళపు శుద్ధి కర్మాగారా కేంద్రాలు. అన్నింటికి మించి జలచక్రాన్ని తీర్చిదిద్దే మహారణ్యాలు. ఇవే వాతావరణ మార్పులకు దోహదం చేసి, రుతువులకు కారణభూతమైతాయి. మేఘాల్ని సృష్టించడంలో, వర్షాల్ని కురిపించడంలో వీటి కృషి అద్వితీయం.

జీవకోటి గ్రహించే మొత్తం ఆక్సిజన్‌లో 28 శాతం ఆక్సిజన్‌ను కార్బన్‌డయాక్సైడ్ నుంచి కిరణజన్య సంయోగక్రియ ద్వారా ఈ ప్రాంతపు చెట్లు విడదీసి అందిస్తాయి.

**6. జలావరణ** వ్యవస్థల గూర్చి తెలిసిందే! మహానదులు, సరస్సులు, సముద్రాలు ఉష్ణోగ్రతను నియంత్రించి భూ, సముద్ర జీవుల మనుగడకు కారణమైతున్నది. కార్బన్‌ను గ్రహించి, గాలిని శుభ్రంచేసే అతిపెద్ద యంత్రాంగాలు ఈ సముద్రాలే! భూమిపై నియమిత పద్ధతుల్లో, అవసరానికి అనుగుణంగా వర్షాల్ని కురిపించుటలో సముద్రాల పాత్ర వెలకట్టలేనిది.

అతిపెద్ద జీవావరణ వ్యవస్థకు ఇవి ఆవాసప్రాంతాలు కూడా!

ఇంత పటిష్టంగా, నిర్దిష్టంగా నిర్మాణమైన భూ, జల, వాయు జీవావరణ వ్యవస్థలను మానవుడు ధ్వంసం చేసుకుంటూ పోతున్నాడు. ఆశ్రయమిచ్చిన ఆవాసాన్నే తగలబెట్టుకుంటున్నాడు.

ఈ సందర్భంగా కొన్ని వాస్తవాల్ని కూడా చూడాలి! అయినా మనకు జ్ఞానోదయం కాకపోవచ్చు! ఈ మధ్యన తరచుగా జరుగుచున్న కొన్ని ప్రకృతి విపత్తుల్ని చూద్దాం!

**నిత్యకృత్యమైన తుఫానులు:**

తేమతో కూడుకున్న తీవ్రమైన గాలులు సుడులు తిరిగి తీవ్ర భీభత్సాన్ని కలుగజేస్తాయి. వీటి తీవ్రతను బట్టి, ప్రాంతాలను బట్టి వీటికి పేర్లు పెడుతారు. ప్రతీ సముద్రానికి ఓ పరివాహక ప్రాంతం వుంటుంది. అనేక దేశాలు, ప్రాంతాలు ఈ పరివాహక ప్రాంతంలో వుండడంతో, ఈ దేశాలు సూచించే పేర్లను వరుసక్రమంలో ఈ సముద్రాల్లో ఏర్పడే తుఫానులకు ఆ పేర్లు పెడుతూ వుంటారు. భూమధ్యరేఖ మధ్య అక్షాంశాల ప్రాంతాల్లో ఈ తుఫానులు అత్యధికంగా సంభవిస్తూ ఉంటాయి. వీటి తీవ్రతను బట్టి వీటిని తుఫానులుగా (cyclone), చండమారుతము, చక్రవాతముగా (hurricane), తీవ్ర తుఫానుగా (tornado), సునామీగా (tsunami), అల్పపీడనం (depression)గా పిలుస్తారు. వీటి వేగాన్ని బట్టి వీటి తీవ్రతను గుర్తిస్తారు.

---

మానవుడి దాష్టికానికి భూసంపదలు, జలసంపదలు ఎలా ధ్వంసమైపోతున్నాయో ఈ కింది ఉదాహరణలే తార్కాణం!

**మంచుకొండలకు వీడ్కోలు:**

ఆల్ప్స్ పర్వత శ్రేణుల్లో స్విస్‌కు ఉత్తర తూర్పున గల పిజోల్ (Pizol) మంచుపర్వతం పెరుగుతున్న భూతాపానికి 2006 నుంచి 90 శాతం కరిగి 280,000 చదరపు అడుగులకు చిక్కిపోయింది. 8,850 అడుగుల ఎత్తుగల ఈ మంచు శిఖరం త్వరలో కనుమరుగైతుందని గ్రహించిన 250 మంది స్విస్ పర్యావరణ కార్యకర్తలు సెప్టెంబర్ 22, 2019న దాని దగ్గరికి వెళ్ళి తుది వీడ్కోలు (Funeral march) జరిపారు. ఇలాంటి సంఘటననే ఐస్‌లాండ్ (Ice land) లో గల ఓక్‌జోకుల్ (Okjokull) మంచు శిఖరం కనుమరుగైనందుకు స్థానికులు వీడ్కోలు చెప్పడం పెద్ద వార్త అయింది. భూగోళంపై కనుమరుగైన మొదటి శిఖరం ఇదే! భూతాపం ఇలాగే కొనసాగితే, హిమాలయ పర్వత శ్రేణుల్లోని ప్రధాన మంచు శిఖరాలకు ఇదే పరిస్థితి ఏర్పడుతుంది.

---

సాధారణ తుఫానులు – గం.కు – 63– 88 కి.మీ. వేగం

తీవ్రమైన తుఫానులు – గం.కు – 87–164 కి.మీ. వేగం

అతి తీవ్రమైన తుఫానులు – గం.కు–118–185 కి.మీ. వేగం

తీవ్రాతి తీవ్రమైన తుఫానులు – గం.కు–185 కి.మీ.కు పైన వేగం.

వాతావరణంలో చలి, పొడి, వేడి గాలులతో, తేమలో అసమతుల్యత ఏర్పడినప్పుడు ఇవి రూపొందుతాయి. ఎండ తీవ్రతను బట్టి వందల సంఖ్యలో ఇవి రోజు ఏర్పడినా తీరాన్ని చేరేవి చాలా తక్కువ. ఒకవేళ దాటినా వేగం తక్కువగా వుంటే తేలికపాటు వర్షాలు



*తరుగుతున్న మడ అడవులు. ప్రకృతి భీభత్సం*

### కొల్లేటి కన్నీటి గాథ

కొల్లేరు అనగానే విదేశీ పక్షుల విడిది అని, అందాల ప్రకృతి సీమ అని మనసును మురిపిస్తుంది. రాజకీయ చదరంగంలో, బడా వ్యాపారుల కండ్లల్లో చిక్కుకున్న ఈ సరస్సు చిక్కి శల్యమైతున్నది. ఆసియాలోనే అతిపెద్ద మంచినీటి సరస్సుగా పేరుగాంచిన ఈ సరస్సు రొయ్యల, చేపల చెరువుల పేరున ఆక్రమణలకు గురైతూనే ఉన్నది. 308 చ.కి.మీ. వైశాల్యంగా గుర్తించిన (నిజానికి ఇది తక్కువే!) ఈ సరస్సు నేడు 245 చ.కి.మీ.కు కుంచించుకపోయింది. దాదాపు 11 వందల రొయ్యల, చేపల చెరువులు ఆక్రమించిన సరస్సు భాగమే 103 చ.కి.మీ. గా గుర్తించారు. కేవలం 2021-2022 వార్షిక సంవత్సరంలోనే 2,029 ఎకరాలు ఆక్రమణకు గురికాగా, మొత్తం ఆక్రమణ జరిగింది 15,742 ఎకరాలుగా అధికారిక లెక్కలు తెలుపుతున్నాయి.

ప్రకృతి సహజ సిద్ధంగా గోదావరి, కృష్ణా నదుల మధ్యన ఏర్పడిన ఈ మంచినీటి సరస్సుపై రాజకీయ వ్యాపార ధోరణితో, పక్షుల సంరక్షణ ప్రాంతాల ఆకృతులను (Contours) అయిదు ($5^+$) నుంచి మూడు ($3^+$) కు తగ్గిస్తూ 2009 లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేయడం గమనార్హం! ప్రస్తుతం 33,987 హెక్టార్లుగా వున్నట్లు ప్రభుత్వ లెక్కలు చూపుతున్నాయి.

ఇలాంటి పరిస్థితే పులికాట్, చిలుకా లాంటి సరస్సులకు దాపురించింది.

*తెల్లేటి సరస్సు పేరుతో ఈ మధ్యన వచ్చిన తెలుగు సినిమా (Republic)ఈ కొల్లేటి సరస్సు మృత్యుగాథనే! వీలైతే చూడండి!*

పడవచ్చు. కాబట్టి నష్టం వుండదు. తీవ్రత ఎక్కువైతేనే అపార నష్టాన్ని కలిగిస్తాయి.


అమెరికాలోని దాదాపు 48 రాష్ట్రాలు ఈ అక్షాంశాలలో వుండడంతో నిరంతరం సుడిగాలులకు (tornado) గురవుతూ వుంటాయి. కారణం మెక్సికో గల్ఫ్ (gulf) ప్రాంత వేడినీరు, అమెరికా తూర్పు ప్రాంత రాకీ (Rocky) పర్వతాల నుండి వీచే పొడిగాలి, ఉత్తర అమెరికా ఉత్తర ప్రాంతపు సగభాగం నుంచి వీచే చల్లనిగాలితో మిలితమైన చోట ఈ టొర్నడోలు ఏర్పడును. పశ్చిమ అప్పలాచియన్ (Appalachian) పర్వత ప్రాంతాల్లో ఇవి తరుచుగా సంభవించును. ఇలాంటి భిన్న గాలుల కలయిక మిగతా భూగోళంపై లేనందున, ఈ తీవ్ర టొర్నడోలు ఉత్తర అమెరికాకే పరిమితంగా వుంటున్నాయి. అమెరికాలో సర్వసాధారణంగా ప్రతి సంవత్సరం 1200 టొర్నడోలు సంభవిస్తున్నట్లు ఆదేశ నేషనల్ ఓసియానిక్ ఎట్మాస్‌పియర్ అడ్మినిస్ట్రేషన్ (NOAA) గణాంకాలు చెపుతున్నాయి.


టొర్నడోలు ఎప్పుడు, ఎక్కడ, ఏ రోజు సంభవిస్తాయో గుర్తించడం చాలా కష్టం. ఇప్పటికి వీటిని పసిగట్టే యాంత్రిక శక్తి అందుబాటులోకి రాలేదు. కాని అత్యధికంగా సాయంత్రం 4 నుంచి 9 గం॥ మధ్యన సంభవిస్తున్నట్లు రికార్డులు తెలుపుతున్నాయి. ఎక్కువగా అమెరికా దక్షిణప్రాంతంలో మార్చి, మే మధ్య కాలంలో సంభవించడం గమనార్హం. ప్రపంచమంతా ఇలాంటి సుడిగాలులల వేసవిలో సంభవించడం చూస్తూనే వుంటాం. కాని, వీటి తీవ్రత తక్కువగా వుంటుంది. అయితే న్యూజిలాండ్ ఉత్తరభాగం లోని అక్‌లాండ్ ప్రాంతంలో సంవత్సరానికి 20 ఏర్పడుతున్నట్లు వాతావరణశాఖ తెలుపుతున్నది. (మన రాజకీయ నాయకులు అకస్మాత్తుగా చేసే పర్యటనల్ని సుడిగాలి పర్యటన అని పత్రికలు రాయడం తెలిసిందే!)


గత సంవత్సరం అమెరికాలో (డిసెంబర్ 10,11 తేదీలలో కెంటుకి (Kentucky) ఇలియానిస్ (Illionis), అర్కాన్‌సస్ (Arkansus), మిస్సౌరి (Missouri), ఓహి మరియు మిస్సిస్సిప్పి (Mississipi) రాష్ట్రాలలో సంభవించిన టొర్నడో అతి పెద్దదని, ఇది గంటకు 310 కి.మీ. వేగంతో వీచి, వేలాది ఆవాసాలను, ఇండ్లను ధ్వంసం చేసిందని వాతావరణ శాఖ తెలిపింది. కార్లే కాకుండా, పెద్ద వాహనాలు సైతం ఆటబొమ్మలా ఎగిరిపోవడం టివిలో మనందరం చూసాం!.

**(తరువాయి వచ్చే సంచికలో)**

**- డా॥ లచ్చయ్య గాండ్ల,**
m : 9440116162
e : drglachaiah@gmail.com




రకరకాల కారణాలతో తెలంగాణ ప్రముఖుల చరిత్రలు అంతగా వెలుగులోకి రాకుండా పోయాయి. ఆయా ప్రముఖులపై ప్రజలకు ఒక అవగాహన కల్పించేలా వివిధ వ్యాసాల సంకలనంతో మనిషి పేరిట తెలంగాణ రిసోర్స్ సెంటర్ కొన్ని పుస్తకాలను ప్రచురించింది.




పై పుస్తకాలు లభించు చిరునామా :

టీఆర్‌సి 3-6-712/2, స్ట్రీట్ నెం.12, హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029

ఫోన్ : 9030 6262 88. Email: trchyd@gmail.com

# అడవిని కాచే ఆడపులి!

ఒక చెట్టును నరికెయ్యడానికి ఎంతో సమయం అక్కర్లేదు. కానీ ఒక చిన్న మొక్క పెరిగి వృక్షంగా మారడానికి ఎన్నో ఏళ్ళు పడుతుంది. అందుకే ఒక్క చెట్టు కూడా అక్రమ నరకివేతకు గురికాకుండా కాపాడాలన్నది మా లక్ష్యం" అంటున్నారు జార్ఖండ్‌కు చెందిన గిరిజన మహిళ కందోనీ సోరెన్. 'జంగిల్ కీ షేర్నీ' అంటూ స్థానికులు పిలుచుకొనే ఆమె సారథ్యంలో 45 మంది మహిళలు సంఘటితమై... తమ చుట్టూ ఉన్న అడవిని రక్షిస్తున్నారు.



కందోనీ స్వగ్రామం జార్ఖండ్ రాష్ట్రం జంషెడ్‌పూర్ జిల్లాలోని సడక్‌ఘుటు. చుట్టూ కొండలతో ఆహ్లాదంగా... అడవిని ఆనుకొని ఉండే ఆ ఊరంటే ఆమెకు ఎంతో ఇష్టం. కానీ క్రమంగా ఆ ఊరు కళతప్పుతూ వచ్చింది. దీనికి కారణం చెట్లను అక్రమంగా నరికి తరలించుకుపోయే మాఫియా. అంతేకాదు వన్య ప్రాణుల్ని చర్మాల కోసం, సరదా కోసం చంపే వాళ్ళు కూడా ఉన్నారు. "మా ఊరుకు దగ్గర్లోని అడవి చాలా దట్టంగా ఉండేది. ఆ తరువాత కొందరి స్వార్థం వల్ల, అనాలోచిత చర్యల వల్లా అడవికీ, పర్యావరణానికీ తీవ్రమైన నష్టం కలిగింది. గిరిజనులకు అడవే ఇల్లు. దాన్ని నాశనం చెయ్యడంతో పాటు... వారి దారికి అడ్డంగా ఉన్న ఇళ్ళను కూడా అక్రమార్కులు కూల్చేశారు.

**అడవిని కాచే ఆడపులి!**

ఇది ఇలాగే కొనసాగితే అడవీ, అందులోని జంతువులూ మిగలవు. అందుకే వాటిని కాపాడాలనుకున్నాను" అని చెబుతున్నారు కందోనీ. ఈ సమస్య గురించి గ్రామ పెద్దలతో ఆమె చర్చించారు. అడవిని రక్షించుకోవాల్సిన అవశ్యకతను వివరించారు. కానీ పెద్దగా స్పందన లభించలేదు. దీంతో స్వయంగా ఏదైనా చెయ్యాలన్న ఆలోచనతో 'హరియాలీ సక్కమ్' (పచ్చని ఆకు) పేరిట వన రక్షణ సమితిని ఆమె ప్రారంభించారు. దాదాపు 45 మంది మహిళలు దీనిలో సభ్యులు. వాళ్ళు నాలుగు బృందాలుగా ఏర్పడి... గ్రామం చుట్టూ వంద హెక్టార్లకు పైగా విస్తరించి ఉన్న అడవి రక్షణ బాధ్యతలను విడతలవారీగా నిర్వహిస్తున్నారు.

చంపుతామని బెదిరించారు...కందోనీ ప్రతిరోజూ అడవి అంతా తిరుగుతారు. చెట్లను నరుకుతున్న వాళ్ళతో అనేకసార్లు ఆమె ఘర్షణలు పడ్డారు. చంపుతామనే బెదిరింపులు కూడా మాఫియా నుంచి వచ్చాయి. కానీ ఆమె వాటిని లెక్క చెయ్యలేదు. క్రమంగా గ్రామస్తులు ఆమె ప్రయత్నాలను గుర్తించారు. వర్షపాతానికీ, పర్యావరణ సమతుల్యానికీ చెట్లు ఎంత ముఖ్యమో వారికి ఆమె వివరించారు. దీంతో గ్రామస్తులు కూడా భాగస్వాములు కావడం ప్రారంభించారు. "అడవిలో ప్రతి మూలా ఆమెకు తెలుసు. చెట్టు ఎక్కడైనా నరుకుతున్నట్టు తెలిస్తే... వెంటనే అక్కడ వాలిపోతుంది. దట్టమైన ఈ అడవిలో ఆమె ఎంతో వేగంగా పరుగెడుతుంది. చెట్లూ, కొండలూ అవలీలగా ఎక్కుతుంది. అందుకే ఆమెను 'జంగిల్ కీ షేర్నీ' (అడవిలో ఆడపులి) అని పిలుచుకుంటాం అంటారు ఆ గ్రామస్తులు. ఉత్త చేతుల్తో అడవిని కాపాడడం సాధ్యం కాదని కందోనీకి తెలుసు. అందుకే సంప్రదాయ ఆయుధాలైన విల్లు-బాణాలు, కత్తుల లాంటివి సమితి సభ్యుల దగ్గర ఉంటాయి. అత్యవసర సమయాల్లో వాటిని ఉపయోగించడానికి అధికారుల నుంచి అనుమతి కూడా తీసుకున్నారు. "ప్రభుత్వం మీద భారం పడేసి కూర్చోవడం వల్ల ప్రయోజనం లేదు. అంతా అయిపోయాక... ఏం జరిగిందో తెలుసుకోడానికి దర్యాప్తులు చేస్తే ఉపయోగం ఏముంటుంది? అదీ కాకుండా మాఫియాతో కొందరు సిబ్బంది లాలూచీ పడడం మామూలైపోయింది. అందుకే... మేమే అడవి రక్షణ బాధ్యత తీసుకున్నాం. స్థానికుల సహకారం లేకుండా ఇది జరగడం అసాధ్యం" అంటున్నారు కందోనీ. ఆమె చొరవ అధికారుల మన్ననలు కూడా అందుకుంటోంది. గతంలో అక్కడ ఎన్నో అక్రమ కార్యకలాపాలు,



ఘర్షణలు జరిగేవి. ఇప్పుడు అంతా ప్రశాంతంగా ఉంది. ఏదైనా సంఘటన జరిగితే ధైర్యంగా ఎదుర్కొని, పోలీసులకు సమాచారం అందించే చైతన్యం గిరిజనుల్లో నెలకొంది.


శ్రమ ఫలితాన్నిస్తోంది... నాలుగేళ్ళ క్రితం జంషెడ్‌పూర్ పోలీస్ విభాగంలో హోమ్‌గార్డుగా కందోనీకి ఉద్యోగం వచ్చింది. ఆ పని చేస్తూనే... మిగిలిన సమయాన్ని అడవిలో గస్తీ కోసం కేటాయించారు. ఈ మధ్యే ముసబానీలోని యురేనియం కార్పొరేషన్ లిమిటెడ్‌లో గార్డుగా ఆమెను నియమించారు. అయినప్పటికీ మధ్యాహ్నం అయ్యేసరికల్లా అడవికి చేరుకుంటారు. మా శ్రమ ఫలిస్తోంది. ఇప్పుడు దురాలోచనల్తో అడవిలోకి ఎవరూ అడుగుపెట్టే పరిస్థితి లేదు. అడవిలో సాగును, ఔషధ మొక్కల పెంపకాన్నీ ప్రోత్సహిస్తున్నాం" అని చెబుతున్నారామె.

– దక్కన్‌న్యూస్

m : 9030 6262 88

e: desk.deccan@gmail.com

## పర్యావరణంపై ప్రత్యేక వ్యాసాలు




**మ**న **దక్కన్‌ల్యాండ్** మాసపత్రికలో పర్యావరణం, వారసత్వం, విపత్తుల నివారణ, గ్రామీణ పట్టణ ప్రణాళిక, వ్యవసాయ రంగం, వైద్య, విద్య, సహజ వనరుల పరిరక్షణ మరియు సద్వినియోగం, జీవ వైవిధ్యం, జీవన విధానంపై కథనాలు, వ్యాసాలు, ఇంటర్వ్యూల పట్ల దృష్టి సారించాలని దక్కన్‌ల్యాండ్ ఎడిటోరియల్ బోర్డు భావిస్తున్నది. ఇందుకు మీ అందరి సహాయ సహకారాలు కోరుతున్నాం. పర్యావరణ, జీవ వైవిధ్య పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యం చాలా అవసరం.

**రచయితలు పై అంశాల మీద లోతైన విశ్లేషణలు, విషయాలతో తమ కథనాలను పంపగలరు.**

**చిరునామా :**

TELANGANA RESOURCE CENTRE

**DECCAN LAND : "CHANDRAM"** 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029. Telangana
**Fax: 040-27635644 Mobile: 9030626288**
E-mail:desk.deccan@gmail.com www.deccanland.com





# ఆవాలు.. లాభాలు..

- తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం • ఎకరాకు 5-6 క్వింటాళ్ల దిగుబడి
- క్వింటాలుకు రూ. 7 వేల ధర • మెట్ట ప్రాంతాల రైతుకు లాభం

తెలంగాణ ప్రాంతంలోని మెట్ట ప్రాంత రైతులు ఆవాలపై ఆసక్తి చూపుతున్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉండడంతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందుతున్నారు. ప్రైవేట్ వ్యాపారులు నేరుగా ఇంటి వద్దకే వచ్చి కొనుగోలు చేస్తామంటూ ముందస్తు ఒప్పందం చేసుకుంటున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఈ పంట 85 నుంచి 90 రోజుల మధ్య చేతికి వస్తుంది. ఈ పంట తర్వాత మూడో పంటగా నువ్వులు సాగు చేసుకునే అవకాశం ఉండడంతో రైతులు ఈ పంటపై ఆసక్తి చూపుతున్నారు. ఆవాలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. క్వింటాలుకు బహిరంగ మార్కెట్లో రూ. 6 నుంచి రూ.7 వేల దాకా ధర పలుకుతుంది. ఎకరానికి 5 నుంచి 6వేల క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. రూ.30 వేల నుంచి రూ. 40 వేల దాకా ఆదాయం పొందవచ్చు. కేవలం రూ.5 వేల పెట్టుబడితో తక్కువ సమయంలో ఎక్కువ ఆదాయం పొందే వీలున్నది.

### పోటీపడుతున్న ప్రైవేట్ సీడ్ కంపెనీలు

నిర్మల్ జిల్లాలో ఆయా మండలాల్లో ఈ యాసంగి సీజన్‌లో రైతులు హైబ్రిడ్ రకంతో పాటు సాధారణ రకాల ఆవాలను సాగు చేయడంతో ప్రైవేట్ కంపెనీలు కొనుగోలు చేసేందుకు ముందస్తు ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. మార్కెట్‌లో ఆవాలకు మంచి డిమాండ్ ఉండడం, వినియోగం కంటే తక్కువగా పంట సాగు చేస్తుండడంతో రైతుల వద్దకు వచ్చి ఆవాలను తమకే విక్రయించాలని కోరుతున్నారు. నిర్మల్ జిల్లాలో ఇప్పటికే నిర్మల్, కుంటాల, సారంగాపూర్, సోన్, మామడ, తదితర మండలాల్లో ప్రైవేట్ సీడ్ కంపెనీల సిబ్బంది ఆవాలను సాగు చేస్తున్న రైతుల వివరాలు తెలుసుకొని రూ.7 వేలకు కొనుగోలు చేస్తామని ఒప్పంద పత్రాలను రాయించుకుంటున్నారు. నాణ్యత లోపిస్తే రూ.6,500 వరకు ఇచ్చి కొనుగోలు చేస్తామని రైతులకు చెప్పుతుండడంతో రైతులు మార్కెట్‌తో సంబంధం లేకుండా ప్రైవేట్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. ఇది వరకు ఆవాలు విక్రయించేందుకు స్థానికంగా మార్కెట్ లేకపోవడంతో నిజామాబాద్, ధర్మాబాద్, భోకర్, భైంసా మార్కెట్లకు వెళ్లాల్సి వచ్చేది. దీనికితోడు రవాణా చార్జీలు కూడా తడిసిభారమయ్యేవి. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారింది.

### తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం : భిక్కునాయక్


నాకు మా ఊరిలో ఐదెకరాల భూమి ఉంది. 20 ఏండ్లుగా ఎవుసం చేస్తున్నా. రకరకాల పంటలు వేసి నష్టపోయిన. పెట్టిన పెట్టుబడి సైతం రాక ఇబ్బందులు పడేది. రెండేండ్ల నుంచి యాసంగిలో ఆవాలు సాగు చేస్తున్న. ఎకరం ఆవాల సాగుకు విత్తనాలు మొదలుకొని పంట చేతికొచ్చే వరకు రూ. 10వేలు ఖర్చు అవుతోంది. నేను 20 గుంటల్లో కిలోన్నర ఆవాల విత్తనాలు వేసిన. ఇందుకు రూ. 750 అయినయ్. పెట్టుబడికి మొత్తం రూ.5 వేలు అయినయ్. అర ఎకరానికి 3 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ప్రైవేట్ కంపెనీలతో ఒప్పందం చేసుకున్నా. క్వింటాల్‌కు రూ. 7 వేల ధర ఇస్తామన్నారు అని తెలిపారు రైతు భిక్కు నాయక్.

ఆనబోయిన స్వామి, m : 9963 87 2222
e: swamyannaboina@gmail.com

# బాలల కథా సుమాలు

*పిల్లల రచనలకు ప్రాచుర్యం కల్పించడం, ప్రచురించడం, పంపిణీ చేయడం, మార్కెటింగ్ లాంటి సమస్యలు ఉన్నా **'చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ' 'బాలచెలిమి'** తెలంగాణాలోని ఉమ్మడి 10 జిల్లాల **"బడి పిల్లల కథలు"** సంకలనాలుగా అందమైన బొమ్మలతో వెలువరించింది. ఆ 'పది జిల్లాల బడి పిల్లల కథలు' దక్కన్‌ల్యాండ్ పాఠకులకు పరిచయం చేయడంలో భాగంగా 'కరీంనగర్‌జిల్లా బడిపిల్లల కథలు' గురించి బాల సాహితీవేత్త **సంగనభట్ల చెన్న రామకిష్టయ్య** గారి విశ్లేషణ.*

*కథల కోసం చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ **బాలచెలిమి** వారి ఆహ్వానం మేరకు కరీంనగర్ జిల్లా 'బడిపిల్లల కథలు' ఎంపిక కోసం 126 కథలు రాగా కథల కార్యశాలలో పాల్గొన్న నిష్ణాతులైన బాల సాహితీవేత్తలు 25కథలను ఎంపిక చేశారు. ఈ పుస్తకానికి కవర్ **కంది నరసింహులు,** లోపలి బొమ్మలు **మ్యాడ్రిపల్లి రమేశ్** వేశారు. ఈ బాధ్యతను నెరవేర్చే క్రమంలో 'చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ' **బాలచెలిమి** నిష్ణాతులతో ఎన్నో సమావేశాలు, సదస్సులు, చర్చలు, బాల చెలిమి ముచ్చట్లు నిర్వహించింది.*




బాలల కథలు తెలివిని, సమయస్ఫూర్తిని, విజ్ఞానాన్ని, ఆలోచనల పెంచుతాయి. హాస్య కథలు. సమస్య పరిష్కార కథలు, రాజుల కథలు, జానపత కథలు, సాహసగాథలు ఇలా వర్గీకరిస్తే చాలా రకాల కథలు మనకు గోచరిస్తాయి. పూర్వం పెద్దలు పిల్లల కొరకు వారి స్థాయికి దిగి కథలు వ్రాయడం ఆనవాయితీ. కాని ప్రస్తుతం పిల్లలే మంచి మంచి కథలు వ్రాసి పిల్లలనే గాకుండా పెద్దలను కూడా ఆశ్చర్యానికి గురి చేస్తున్నారు. ఇది ప్రస్తుతం వచ్చిన మార్పు. చందమామ, బాలమిత్ర వంటి పేరెన్నికగన్న పత్రికలు బాల సాహిత్యంలో కథలకున్న గొప్పదనాన్ని నిన్నటి వరకు చాటి చెప్పాయి.

బాల సాహిత్యాన్ని కాపాడుకోవలసిన బాధ్యత పెద్దలపైన, పిల్లలపైన ఉంది. ఇందుకు తల్లిదండ్రులు కూడా సహకరించాలి. ఇందుకు తల్లిదండ్రులు కూడా సహకరించాలి.

కరీంనగర్ జిల్లా బాల సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన వారిలో అనేకమంది బాలసాహిత్య రచయితలు, రచయిత్రులు ఉన్నారు. చాలా మంది ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు పిల్లలను ఉత్తమ రచయితలుగా తీర్చిదిద్దుతున్నారు. కరీంనగర్ జిల్లా పిల్లలు వ్రాసిన కథలు ఈ పుస్తకంలో 25 వరకు ఉన్నాయి.


ఈ కథలలో బెంచీల అంతరంగాన్ని తెలిపే బెంచీ కథ, అబద్దాన్ని అబద్ధంతోనే జయించాలి అని తెలిపే మంచి స్నేహం కథ, తాను క్రొత్త బట్టలు కొనుక్కోవాలనే కోరికను త్యాగం చేసి నానమ్మ కోరికలు తీర్చిన రమేశ్ కథ, నిజం తెలుసుకొని మారిన మరొక బాలుని కథ, పొలాన్ని కొడుకుగా భావించే రైతు కథ, ఈ కథలన్నీ పిల్లల రచనా శిల్పాన్ని, వారి ఆలోచనా తీరును పెద్దలు కూడా రాయలేనంత పదజాలాన్ని తెలుపుతాయి. కథలలోగానీ, గేయాలలోగానీ నూతనత్వంతో పాటు సందేశం అంటే అవి ఇతరుల అభిమానాన్ని చూరగొంటాయి.


మన కరీంనగర్ జిల్లా కథలు పిల్లలు, పెద్దలే గాకుండా అన్ని వయస్సులవారు చదివి ఆనందింతురు గాక! బాల కథా సాహిత్యం సూర్య చంద్రులున్నంత వరకు భూమిపై వెలుగుతుందని ఆశిస్తూ...

– సంగనభట్ల చెన్న రామకిష్టయ్య, బాల సాహితీవేత్త

JBR
ARCHITECTURE COLLEGE
HYDERABAD
(Approved by Council of Architecture, New Delhi - Affiliated to JNA&FAU Hyderabad)
E-mail : jbrarchitecture@jbgroup.org.in, www.jbrachitecture.com


# దక్కన్ ల్యాండ్ తొమ్మిది సంవత్సరాల ప్రస్థానం...










తెలంగాణ ఉద్యమ కాలంలో ఆవిర్భవించిన
**'దక్కన్‌ల్యాండ్'** మాసపత్రిక 2021 డిసెంబర్ సంచికతో
112 నెలలు పూర్తి చేసుకుంది. ఈ తొమ్మిది సంవత్సరాల
కాలంలో తెలంగాణ భావజాలాన్ని వ్యాప్తిచేసి, పునర్నిర్మాణ
అవసరాన్ని చాటి చెప్పేందుకు 'దక్కన్‌ల్యాండ్' కృషి చేసింది.
ఇప్పటి వరకు వెలువడిన సంచికలను 12 నెలలకు
ఒక సంపుటిగా (2012, 2013, 2014, 2015, 2016, 2017,
2018, 2019, 2020, 2021) రూపొందించి పాఠకుల కోరిక
మేరకు అందిస్తున్నాం. భవిష్యత్తులో వచ్చే సంచికలను కూడా
ఇదే విధంగా తీసుకువస్తామని తెలియజేస్తున్నాం.
ఆసక్తికలవారు ఒక్కో సంపుటిని రూ.400/-లకు పొందవచ్చు
(పార్శిల్ ఛార్జీలు అదనం).


**'ఐఎస్ఎస్ఎన్' ఆమోదం పొందిన 'దక్కన్‌ల్యాండ్'
మాసపత్రిక పట్ల చూపుతున్న ఆదరణకు ధన్యవాదాలు.**













**సంకలనాలు పొందేందుకు మా చిరునామా:**

ఎడిటర్. 'దక్కన్‌ల్యాండ్'
3-6-712/2, స్ట్రీట్ నెం.12,
హిమాయత్‌నగర్,
హైదరాబాదు-500029, తెలంగాణ
మొబైల్: 9030626288

Email: desk.deccan@gmail.com
Website: www.deccanland.com

**ఆన్‌లైన్ ద్వారా చెల్లింపుకోసం:**

NAME : DECCAN LAND
BANK : KOTAKMAHINDRABANK
ACCOUNT NO : 7111218829
IFSC CODE : KKBK0000555
BANK CODE : 000555
MICR CODE : 500485007

DECCAN LAND, Telugu Monthly Magazine Date of Publication 26th - May - 2022,
ISSN 2581-3188 Postal Dates: 28th & 29th Every Month

RNI Regn. No. APTEL/2012/46784
Postal Regn.No.HCD/1167/2021-2023

Oxford Grammar School

KNOWLEDGE IS POWER

ogs JUNIORS grow naturally

40 YEARS OF MERITORIOUS PERFORMANCE

# 2022-23
## Admissions Open
For classes I to X

**SSC | Juniors**

## CHOOSING THE RIGHT SCHOOL IS THE FIRST STEP IN SHAPING THE FUTURE OF YOUR CHILD.

40 years of being one of the best SSC schools in Hyderabad, we know what it takes to be the best at educating young, inquisitive minds with world-class education. Children also love our unique value-based and nature-centric approach to learning.

- ACTIVITY AND VALUE BASED LEARNING
- TECHNOLOGY BASED EDUCATION
- CARING AND HIGHLY TRAINED TEACHERS
- STRESS-FREE ENVIRONMENT
- FOCUS ON EXPERIENTIAL LEARNING
- HUGE PLAYGROUND FOR MULTIPLE SPORTS
- EXTRA-CURRICULAR ACTIVITY LEARNING
- SECURE SUPERVISION ON SCHOOL PREMISES

## WHY PARENTS LOVE SENDING THEIR KIDS TO OGS

**MICROSOFT CERTIFIED TEACHERS**
All our teachers are equipped to handle digital education effortlessly

**5,000 + ALUMNI**
Our students are successful in the field of their choice

**HUGE PLAYGROUND**
With playing areas for cricket, football, basketball and events

**DIGITAL CLASSROOMS**
Big, spacious classrooms equipped for digital learning




## ADMISSION PROCESS

Application forms can be availed at the school premises.
A digital version can be availed via email/WhatsApp. For more details, write to us on **ogshyd@gmail.com.**

**Street No. 13, Himayathnagar, Hyderabad | Ph : 040 2763 6214, 99590 20512**

Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, 1-9-1126/B, Azamabad, Hyderabad-500020, Telangana,
Published at CHANDRAM, 3-6-712/2, St.No.11, Himayatnagar, Hyderabad-500029, Telangana, Editor Manikonda Vedakumar